www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 65 | గురువారం | 24 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



సకల భూసర్వే

రైతుల భూములతో పాటు అటవీ, ప్రభుత్వ, దేవాదాయ మున్నగు అన్ని రకాల లెక్క తేలుస్తాం

ముహూర్తం సెప్టెంబర్ 15, రాష్ట్రం మొత్తం 1100 యూనిట్లుగా విభజన, 3600 బృందాలు

"ప్రస్తుత దుస్థితి నుంచి రైతును గట్టెక్కియ్యాలని ఎప్పటి నుంచో ఆలోచిస్తున్నా. రైతు కోసం ఏమి చేయాలా అని చాలా మందితో మాట్లాడాను. చివరికి వ్యవసాయానికి పెట్టుబడి ప్రభుత్వమే సమకూరిస్తే రైతులకు అప్పుల తిప్పలు తప్పుతాయని నిర్ణయించాం. కాలం కలిసి రాక పంటలు పండకపోయి రైతులు పెట్టుబడి కోల్పోయే ప్రమాదం ఉండదు. ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.8వేలు పెట్టుబడి ఇవ్వాలనుకున్నాం"

- సిఎం కెసిఆర్

రెవెన్యూలో అదనంగా 1000 పోస్టులు



మన తెలంగాణ/ హైదరాబాద్ : సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభమయ్యే భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా రైతుల అధీనంలో ఉన్న వ్యవసాయ భూములతో పాటు గ్రామంలో ఉన్న అటవీ భూమి, ప్రభుత్వ భూమి, దేవాదాయ భూమి, ప్రజోపయోగ కార్యక్రమాల కోసం వినియోగిస్తున్న భూమి, ప్రభుత్వ భవనాల కింద ఉన్న భూమి, చెరువులు, కుంటల కింద ఉన్న భూమి తదితర అన్ని వివరాలు సేకరించాలని సిఎం కెసిఆర్ ఆదేశించారు. భూ రికార్డుల ప్రక్షాళన, రిజిస్ట్రేషన్ల విధానంలో మార్పులు, భూ రికార్డుల నిర్వహణ, సమగ్ర భూసర్వే నిర్వహణ తదితర అంశాలపై ప్రగతి భవన్‌లో సిఎం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వ్యవసాయ భూములు వ్యవసాయేతర అవసరాల కోసం బదలాయింపు జరిగితే ఆ వివరాలు, ప్రభుత్వం సేకరించిన భూ వివరాలు, ప్రభుత్వం అసైన్ చేసిన భూ వివరాలు కూడా నమోదు చేయాలన్నారు. అసైన్డ్ భూముల్లో వ్యవసాయం చేసుకునే పేదలకు కూడా పెట్టుబడి పథకం అందివ్వనున్నట్లు సిఎం ప్రకటించారు. గ్రామ కంఠాన్ని కూడా నిర్ధారించాలన్నారు. మొదటి దశలో వివాదాలు లేని భూముల రికార్డులను సరి చేయాలని, రెవెన్యూ గ్రామం పరిధిలోని ప్రతి భూమి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. రెండో దశలో మొత్తం తెలంగాణ భూభాగాన్ని సర్వే చేయించి, కొత్త మ్యాపులు రూపొందిస్తామన్నారు. ఎప్పటికప్పుడు తెలంగాణ భూభాగంలో జరిగే మార్పులు కూడా వెంటనే నమోదయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. పొరపాట్లు జరిగితే వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగే అవకాశం ఉండడంతో భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం

తరువాయి 6లో

బిసిల ఉపవర్గీకరణ కమిషన్

- ఆర్టికల్ 340 పరిధిలో నియామకానికి కేంద్రం నిర్ణయం
- 12 వారాల్లో కమిషన్ నివేదిక

న్యూఢిల్లీ : ఒబిసిలలో ఉప వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయనుంది. కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనకు కేంద్ర మంత్రి మండలి బుధవారం నాటి సమావేశంలో ఆమోదం తెలిపిందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరులకు తెలిపారు. కేంద్ర ఉద్యోగాల కోటాలో ఒబిసికి చెందిన నిరుద్యోగులకు ఈ ఉపవర్గీకరణతో ప్రయోజనం తరువాయి 6లో

క్రీమీలేయర్ ఆదాయ పరిమితి రూ.8 లక్షలకు పెంపు



యుపిలో మరో రైలు ప్రమాదం

- పట్టాలు తప్పిన కైఫీయత్
- 100 మందికి గాయాలు

లక్నో : ఉత్తర్‌ప్రదేశ్‌లో మరో రైలు ప్రమాదం సంభవించింది. గత శనివారం కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటన మరువక ముందే ఇప్పుడు కైఫియత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఆజామ్‌గఢ్ తరువాయి 6లో

ప్రజాభిప్రాయ సేకరణం

కాళేశ్వరంపై ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఘర్షణ, టిఆర్ఎస్ దాడిలో కాంగ్రెస్ వారికి గాయాలు

జిల్లా భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పరిస్థితి తీవ్రం, కరీంనగర్ ఆసుపత్రికి

పోలీస్ స్టేషన్‌కు మాజీమంత్రి శ్రీధర్‌బాబు తదితరుల తరలింపు

మన తెలంగాణ/ పెద్దపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో హింస చోటు చేసుకున్నది. టిఆర్ఎస్ దాడిలో పలువురు కాంగ్రెస్ నాయకులకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. గులాబీ శ్రేణులు మూకుమ్మడిగా కాంగ్రెస్ వర్గాలపై దాడి చేయడంతో సమావేశ ప్రాంగణం రణరంగాన్ని తలపించింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి దాడికి గురైన మాజీమంత్రి శ్రీధర్ బాబుతో, సహా పలువురు కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తరువాయి 6లో





నేరెళ్ల ఘటనపై రాష్ట్రపతికి అఖిలపక్ష నేతల ఫిర్యాదు

10లో

- జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

100కు చేరిన స్వైన్ ఫ్లూ కేసులు

మన తెలంగాణ/ హైదరాబాద్ : స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. ఒకరి నుండి మరొకరికి వాయువేగంతో ప్రవేశించే హెచ్ 1 ఎన్ 1 వైరస్‌కు అడ్డుకట్ట పడడం లేదు. ఒక్క ఈ ఆగస్టులోనే 100 మందిలో స్వైన్‌ఫ్లూ ఉన్నట్లు నిర్ధారించారు. ఈ కేసుల్లో ఎక్కువగా హైదరాబాద్‌కు చెందినవే ఉండడం గమనార్హం. స్వైన్‌ఫ్లూ తరువాయి 6లో



కొత్త రూ.200 నోటు 9

- వచ్చే నెలలో విడుదల
- ఇప్పటి రూ.2 వేల నోటును రద్దు చేసే యోచన లేదు : జైట్లీ



రాజీనామాకు సిద్ధపడిన రైల్వేమంత్రి 11

- ప్రధాని నిర్ణయం తీసుకుంటారు: అరుణ్ జైట్లీ
- సురేష్‌ప్రభును తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్



నంద్యాలలో భారీ పోలింగ్


- 80% ఓటింగ్ నమోదు
- ప్రశాంతంగా నిర్వహణ 11



బ్యాంకుల విలీనానికి యంత్రాంగం 10



రైల్వే బోర్డు కొత్త చైర్మన్ అశ్వనీ లోహాని 10



కుంచెపోటు



ఐఎఎస్, ఐపిఎస్‌లకు కొత్త కేడర్ పాలసీ

న్యూఢిల్లీ: దేశంలోని ఉన్నతస్థాయి ఉద్యోగిస్వామ్యంలో జాతీయ సమైక్యతకు భరోసా కల్పించే ఉద్దేశంతో ఐఎఎస్, ఐపిఎస్‌లతో పాటు ఇతర అధికారుల కేటాయింపునకు సంబంధించిన కొత్త పాలసీని కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ కొత్త పాలసీ ప్రకారం ఐఎఎస్, ఐపిఎస్‌లతో పాటు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఒఎస్) అధికారులు ఇకపై రాష్ట్రాలకు బదులుగా జోన్ల సమూహం నుండి కేడర్ (ఉద్యోగ రాష్ట్రం)ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మూడు సర్వీసులకు చెందిన అధికారుల విధుల నిర్వహణ కోసం ప్రస్తుతం వారికి ఒక అధికార రాష్ట్రాన్ని గానీ లేదా ఒక జత రాష్ట్రాలను గానీ కేటాయిస్తున్నారు. కాగా, కొన్ని అర్హతా తరువాయి 6లో

ఎప్పటికీ సంక్షామ హాస్టళ్లే!

సరైన వసతి, భోజనం, భోజనశాలలు, టాయిలెట్లు, ప్రహరీల లేమితో ఇంకా కొనసాగుతున్న దయనీయ స్థితి



జిల్లాల నుంచి మన తెలంగాణ ప్రతినిధులు

కట్టెల పొయ్యి, ఉడకని అన్నం, నీళ్ల చారు, తలుపులు లేని మరుగుదొడ్లు, పారిశుద్ధ్య లోపం వెరసి సాంఘిక సంక్షేమ హాస్టళ్లు సమస్యల లోగిళ్లుగా దర్శనమిస్తున్నాయి. దశాబ్దాలుగా ఇదే పరిస్థితులు కొనసాగుతున్నా వాటిని పట్టించుకున్న అధికారులు అక్కడో ఇక్కడో అరుదుగా తారసపడుతున్నారు. మేడ్చల్ జిల్లాలో 9 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉండగా వీటిలో గత సంవత్సరం 595 మంది విద్యార్థినీ విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ ఏడాది వారి సంఖ్య 543కు పడిపోయింది. ఆడలేక మద్దెల ఓడన్న చందంగా హాస్టళ్లను సరిగ్గా నిర్వహించలేక విద్యార్థులు తగ్గారన్న కారణాన్ని చూపుతూ ఈ సంవత్సరం శామీర్‌పేట మండలంలో రెండు బిసి బాలుర వసతి గృహాలు, తరువాయి 6లో



బల సమీకరణగా మారిన ప్రజాభిప్రాయ సేకరణ : జీవన్‌రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్ : కాళేశ్వరంపై ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ టిఆర్‌ఎస్ బల సమీకరణ కార్యక్రమంగా మారిందని, బాధితులతో బలవంతంగా ఒప్పించే ప్రజలపై సంతకాలు పెట్టిస్తున్నారని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ, టిపిసిసి ఉపాధ్యక్షులు టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం భేషజాలకు పోయి రైతుల కడుపు కొట్టవద్దని, నిర్వాసితులు కోరుకుంటున్నట్లు 2013 కేంద్ర చట్టం ప్రకారం భూ సేకరణ చేయాలని ఆయన అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంట్రాక్టర్లకు అంచనాలు పెంచుతున్న సర్కార్ రైతులకు నష్టపరిహారం పెంచేందుకు మాత్రం ముందుకు రాకపోవడం భాధాకరమన్నారు. రు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై భారం పెరిగే విధంగా ప్రాజెక్టులపై సిఎం కెసిఆర్ వైఖరి ఉందని ఆయన అన్నారు. సుందిళ్ల నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించేందుకు అవకాశం ఉన్నప్పటికీ దానిని పక్కనపెట్టడం ద్వారా ప్రజలపై మరింత ఆర్థిక భారం పడుతుందన్నారు. ట్రిపుల్ తలాక్ అంశాన్ని బిజెపి రాజకీయ లబ్ధికి వాడుకుంటున్నదని ఆయన ఆరోపించారు. చట్టంతో ట్రిపుల్ తలాక్ అంశం పరిష్కారం కాదన్నారు. మత పెద్దలతో సంప్రదింపులు జరుపడం ద్వారా ట్రిపుల్ తలాక్ అంశాన్ని పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.



గాంధీకి వచ్చిన గవర్నర్

మన తెలంగాణ/ సికింద్రాబాద్ : తెలుగు రాష్ట్రాల గవర్నర్ బుధవారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో సాధారణ వ్యక్తిలా ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కుడికాలి పాదంపై ఉన్న కణితి సమస్యకు పరీక్షలు నిర్వహించి మైనర్ ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు ఆయనకు సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పట్టణాల అభివృద్ధిలో
మహిళల భాగస్వామ్యం

● మేప్మా సమావేశంలో కెటిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : పట్టణాల అభివృద్ధిలో మహిళల పాత్రను మరింత పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె. తారక రామారావు అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మేప్మా) ఉద్యోగులతో హైదరాబాద్‌లో బుధవారం సమావేశమైన మంత్రి కెటిఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల సహకారంతో తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. వీరి సేవలను మరింతగా ఉపయోగించుకునేందుకు త్వరలోనే మరిన్ని కార్యక్రమాలను చేపడుతామన్నారు. ప్రస్తుతం పట్టణాల్లో నివసిస్తున్న పేదల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన పలు కార్యక్రమాలపై వివిధ పట్టణాల నుండి వచ్చిన రిసోర్స్ పర్సన్లను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణకు హరిత హారం, కెసిఆర్ కిట్లు, బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా పట్టణాలను ప్రకటించే కార్యక్రమానికి సంబంధించి క్షేత్ర స్థాయి వివరాలను తెలుసుకున్నారు. తడి.. పొడి చెత్తపై మేప్మా కీలక పాత్ర పోషించాలన్నారు. మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వ వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి కెటిఆర్ వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు, పిల్లలకు వ్యాక్సినేషన్లు, పౌష్టికాహారం వంటి అంశాలపై పట్టణాల్లో మరింత అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాల కాలంగా పని చేస్తున్న తమకు వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని మేప్మా రిసోర్స్ పర్సన్లు కెటిఆర్‌కు విన్నవించగా ఈ విషయంలో ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం తీసుకుంటారని హామీ ఇచ్చారు. పట్టణాల అభివృద్ధి ప్రభుత్వ కార్యక్రమాల అమలులో మరింత చురుగ్గా పాల్గొనాలని కెటిఆర్ వారిని కోరారు.



ఎన్‌ఆర్‌ఐ విధానంపై
ప్రకటన ఎప్పుడు?



మన తెలంగాణ / హైదరాబాద్ : ఎన్‌ఆర్‌ఐ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, గత మూడేళ్లలో గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని మాజీ స్పీకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.ఆర్.సురేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో గల్ఫ్ దేశాలలోని రాష్ట్రానికి చెందిన వారి సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో టిపిసిసి ఎన్‌ఆర్‌ఐ సెల్ చైర్మన్ వినోద్‌తో కలిసి సురేష్‌రెడ్డి మాట్లాడారు. గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. గత ఏడాది జులైలో ఎన్‌ఆర్‌ఐ విధానాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులు సూచనలు, సలహాలు ఇచ్చారని, ఏడాది దాటినా ఇప్పటివరకు విధానాన్ని ప్రకటించలేదని ఆయన విమర్శించారు. మూడేళ్ల కాలంలో రాష్ట్రానికి చెందిన వారు సుమారు 600 మంది గల్ఫ్‌లో మరణించారన్నారు.

నిధులు విడుదల

మన తెలంగాణ / హైదరాబాద్ : తొమ్మిది, పదో తరగతి చదువుతున్న ఎస్‌సి విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 21 కోట్ల 63 లక్షల నిధులను విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఇందుకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్య నాథ్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

వన్నె తెచ్చే విధంగా మూసీ నిర్మాణం

● మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన ప్రేమ్‌సింగ్ రాథోడ్



మనతెలంగాణ/హైదరాబాద్/గోషామహల్: హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలకు వన్నె తెచ్చే విధంగా మూసీ రివర్ ప్రాజెక్టు తయారవుతుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం లక్డీకాపూల్‌లోని మెట్రోభవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డిసి) చైర్మన్‌గా ప్రేమ్‌సింగ్‌రాథోడ్ పదవీ బాధ్యతలను చేపట్టి, మూసీ ప్రాజెక్టు ఫైలుపై తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా నాయిని నర్సింహారెడ్డి, లోకాయుక్త జస్టిస్ సుభాషణ్‌రెడ్డి, మున్సిపల్ శాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, భానుప్రసాద్, బిజెపి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలతోపాటు వివిధ సంస్థల చైర్మన్లు పర్యాద కృష్ణమూర్తి, కొల్లేటి దామోదర్, రాకేష్‌రావు తదితరులు రాథోడ్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని విశ్వ కేంద్రంగా తీర్చిదిద్దాలని కెసిఆర్ కృత నిశ్చ యంతో ఉన్నారని, మూసీ నది గురించి సంపూర్ణ అవగాహన కలిగిన ప్రేమ్‌సింగ్ రాథోడ్ నేతృత్వంలో మూసీ రివర్ ప్రాజెక్టు జంట నగరాలకు తలమానికంగా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎంఆర్‌డిసి చైర్మన్ ప్రేమ్‌సింగ్‌రాథోడ్ మాట్లాడుతూ 40 కి.మీ గల మూసీనదిని ప్రక్షాళన చేసి, మురుగునీటిని శుద్ధి చేసే లక్ష్యంతో సిఎం కెసిఆర్ ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రాజెక్టు కోసం మొదటి విడతలోనే రూ. 1, 600 కోట్ల నిధులను కేటాయించారన్నారు. తనపై నమ్మకంతో చైర్మన్ పదవి బాధ్యతలను అప్పగించినందుకు సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో మూసీ ప్రాజెక్టును పూర్తి చేసి విశ్వనగరానికే వన్నె తెచ్చే విధంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మమతాగుప్తా, జి. ముఖేష్‌సింగ్, మాజీ కార్పొరేటర్ ఎం. శంకర్‌యాదవ్, టిఆర్‌ఎస్ నాయకులు ఆర్వీ మహేందర్‌కుమార్, నందకిశోర్ వ్యాస్, శంకర్‌లాల్‌యాదవ్, ఎస్. ధన్‌రాజ్, యాదగిరి, జైతంకర్, పొన్నాల శంకర్, సంజయ్, గజ్జెల నరేష్, సాయి, సురేష్, నవీన్, ఆర్‌వి వినోద్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న మధ్యప్రదేశ్
పర్యాటక ప్రాంతాలు

మనతెలంగాణ/హైదరాబాద్ : మధ్యప్రదేశ్‌లోని పర్యాటక ప్రాంతాలు ఎన్నో రకాల ఆక ర్షణలు అందిస్తోందని ఆ రాష్ట్ర పర్యాటక మండలి అడిషనల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ పాండే అన్నారు. వివిధ సంస్కృ తులు, సంప్రదాయాల సమ్మిళితంగా మధ్య ప్రదేశ్ అందరినీ ఆకట్టుకుంటోందని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని వివిధ పర్యాటక స్థలాలకు ప్రాచుర్యం కల్పించేందుకు మధ్య ప్రదేశ్ పర్యాటక మండలి(ఎంపిటిబి) బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిటిబి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఓంవిజయ్ చౌదరి మాట్లాడుతూ, మధ్యప్రదేశ్ టూరిజం మధ్యభారతాన్ని సంద ర్శించే పర్యాటకుల కోసం అత్యున్నత ప్రమా ణాలతో కూడిన పర్యాటక సేవలు అందిస్తోందని అన్నారు. ఎంపిటిబి భోపాల్‌లో అక్టోబర్ 27–29 వరకు మధ్య ప్రదేశ్ ట్రావెల్ మార్ట్, ఇండోర్‌సాగర్ డ్యామ్ వద్ద అక్టోబర్ 15, 2018, జనవరి 2 వరకు జల్ మహోత్సవ్ వంటి కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు.

ఘనంగా బిసి కమిషన్
చైర్మన్ జన్మదినోత్సవం



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ బిఎస్. రాములు 69వ జన్మదినోత్సవాన్ని కమిషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన రావు, ఆంజ నేయగౌడ్, జూలూరి గౌరీ శంకర్, ప్రత్యేక అధికారి వనమాల చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి పద్మజ, కార్యాలయ సిబ్బంది బిఎస్ రాములుకు 69వ జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా చైర్మన్ బిఎస్ రాములు బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. బిఎస్ రాములుకు శుభాకాంక్షలు తెలిపేందుకు కవులు, రచయితలు, కుల సంఘా ల నాయకులు భారీగా తరలి వచ్చారు.

మూడు క్వింటాళ్ల గంజాయి పట్టివేత



● శంషాబాద్‌లో చోటు చేసుకున్న ఘటన
● ఆరుగురు నిందితులు రిమాండ్

మనతెలంగాణ/శంషాబాద్ : అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల గంజాయిని పట్టుకున్న సంఘటన బుధవారం రాత్రి శంషాబాద్‌లో చోటుచేసుకుంది. శంషాబాద్ డిసిపి పద్మజారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్కు చెందిన లక్ష్మణ్‌రావు, పరుశరామ్, చందర్‌రావు, బొంతనాగు, శ్రీను, చౌహన్ మోహన్, చౌహాన్ వెంకట్,సురేష్‌లు గత కొంత కాలంగా విశాఖపట్నం నుండి హైదరాబాద్‌లోని పటాన్‌చెరువుకు అక్రమంగా ముడి గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. గత రాత్రి 21.45 గంటలకు విశాఖపట్నంలోని నర్సీపట్నం నుండి పటాన్‌చెరువుకు బొలెరొ రోడ్డు మీదుగా రెండు వాహనాల్లో (బొలెరో నెం.ఎపి31 టిజె1883,టాటా ఇండిగా టిఎస్07 ఎఫ్ హెచ్ 3894) గంజాయిని తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో అప్రమత్తమైన శంషాబాద్ ఎస్ఒటి పోలీసులు , సిసిఎస్ పోలీసుల సహకారంతో ఆర్‌జిఐఎ ఎస్సైలు శివకుమార్, ఎం.మహేశ్‌లు జెబిఆర్‌ంగ్ రోడ్డుపై నిఘా వేసి ఆ రెండు వాహనాలను ఆదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 11పార్సిల్ బ్యాగుల్లో 3క్వింటాళ్ల గంజాయిని, రూ. 42500 నగదును పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అయితే అసలు సూత్రధారులైన లక్ష్మణ్ రావు, పరుశురామ్, సురేష్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న వారిని డిసిపి పద్మజారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఎసిపి సందీప్రా సిఐలు మహేష్, ఎస్ఒటి ఎస్సైలు ప్రవీణ్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌లపై కేంద్రం శీతకన్ను



మన తెలంగాణ/ హైదరాబాద్ : జాతీయ రహదారుల విస్తరణలో కేంద్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోవడం లేదని ఎంఎల్‌ఏ శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. జడ్చర్ల నుండి మక్తల్ వరకు నాల్గు లేన్ల జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ఆయన పట్టించుకోవడం లేదన్నారు. గద్వాల్ మహబూబ్‌నగర్‌లో ముమ్మరంగా పనులు చేసుకుంటున్నారని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బుధవారం టిఆర్‌ఎస్ శాసన సభా పక్ష కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

నవ భారత నిర్మాణంలో ముస్లిం మహిళలు



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నవ భారత నిర్మాణంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యమయ్యేందుకు ముస్లిం మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నా రు. ట్రిపుల్ తలాక్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ నిషేధం విధించడం కోట్లాది మంది ముస్లిం మహిళలకు పెద్ద ఊరట అని అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ముస్లిం మహిళలు పలువురు లక్ష్మణ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

కొంత మంది బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన లక్ష్మణ్ ఈ తీర్పు ఒకరికి విజయం, మరొకరికి అపజయమో కాదన్నారు. ఇది ముస్లిం మహిళా లోకానికి లభించిన విజయమని అభివర్ణించారు. రాజకీయాలకు అతీతంగా అందరూ ముస్లిం మహిళలకు అండగా నిలవాలన్నారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళలకు అండగా నరేంద్ర మోదీ ప్రభుత్వం నిలిచిందని, వారికి మద్దతుగా న్యాయస్థానంలో అఫిడవిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి పద్మ మాట్లాడుతూ, మతం పేరుతో కొంత మంది ముస్లిం మహిళలను మానసికంగా కుంగిపోయేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇస్లాం ఆచారం ప్రకారం దొంగతనం చేస్తే చేతిని తీసి వేయాలని కూడా ఉందని, అయితే కేవలం మహిళలను ఇబ్బందులకు గురి చేసేందుకే ట్రిపుల్ తలాక్‌ను వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వై. గీత, భాయాదేవి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొల్లి మాధవి, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు అఫ్సర్ పాషా, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బండారు శృతి, ముస్లిం మహిళలు నస్రీమ్, షహనాజ్ పాల్గొన్నారు.

ప్రతి ఏటా వెయ్యి మంది
చిన్నారుల దత్తత

మన తెలంగాణ / హైద రాబాద్ : పిల్లలు లేని తల్లిదండ్రులను ప్రొత్స హించి చిన్నారు లను దత్తత తీసుకునేలా చర్యలను రూపొందించుకోవాలని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కారా విభాగం సలహా కమిటి చైర్మన్ మందా రామచంద్రారెడ్డి కోరారు. డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లల దత్తత పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మందా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చిన్నారుల దత్తత విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. సంవత్సరానికి 1000 మంది దత్తత తీసుకునేలా తెలంగాణ రాష్ట్రం, దేశంలోనే ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జగదీశ్ మాట్లాడుతూ దత్తత సంఖ్యను పెంచేందుకు తీసు కోవాల్సిన కార్యాచరణను త్వరలోనే డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్స్ (డిసిపిఓ)లతో సమావేశం అవుతామన్నారు.

రూ.3కోట్లతో చిట్టీ వ్యాపారి పరారీ?

మనతెలంగాణ/జగిత్యాలవరస్‌పల్లి: అందరికీ నమ్మకంగా ఉంటూ చిట్టీ వ్యాపారం నిర్వహిస్తున్న ఓ యువకుడు రూ.3కోట్లతో పరారైన ఉదంతం బుధవారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన జిల్లా రాకేష్ అనే వ్యక్తి గత కొంత కాలంగా ఎల్.జి.రాం లాడ్జి సమీపంలో భవాని సెల్యూషన్స్ పేరుతో దుకాణాన్ని నిర్వహిస్తూ చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. అందరికీ నమ్మకంగా ఉంటూ సుమారు 25 మంది వద్ద నుండి రూ. 3కోట్ల వరకు సేకరించాడు. అయితే ఈ నెల 15 రాత్రి నుండి రాకేష్ కనపడకపోవడంతో ఇంటికి వెళ్ళి చూడగా రాకేష్‌తో పాటు కుటుంబ సభ్యులు కూ డా ఎవరూ లేకపోవడం, బాధితులు పోలీసులను ఆశ్రయించారు.



ఆ రెండు తలాక్‌లు లింగ సమానత్వానికి సవాళ్లే

న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్ విధానం చెల్లనప్పటికీ మిగిలిన రెండు తలాక్‌ల విధానం (తలాక్ ఎ ఎహ్సాన్, తలాక్ ఎ హసన్) కొనసాగింపుతో లింగ సమానత్వం, లింగ న్యాయానికి సవాల్ గా పరిణమిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం వ్యాఖ్యానించారు. ట్రిపుల్ తలాక్ విధానం చట్టవిరుద్ధమంటూ సుప్రీంకోర్టు సంచలన తీర్పుతో గొప్ప స్పష్టత వచ్చిందంటూ చిదంబరం ట్విట్టర్ వేదికగా స్పందించారు. అయితే మిగిలిన రెండు తలాక్‌ల విధానం కూడా లింగ న్యాయం, సమానత్వానికి సవాల్‌గా మారే అవకాశం ఉందని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు. అసలు ఖురాన్‌లోని చట్టపరమైన సూత్రాలను వక్రీకరించేలా ట్రిపుల్ తలాక్ విధానం ఉందని కేంద్ర మాజీ హోంమంత్రి చెప్పారు. ఈ విధానం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించడం శుభపరిణామని అన్నారు. లింగ న్యాయం, జీవిత భాగస్వాముల సమానత్వం అంగీకారంపై మెజారిటీ తీర్పు ప్రతిధ్వనించిందని మరో ట్వీట్‌లో తెలిపారు. ముస్లింల ట్రిపుల్ తలాక్ విధానం (తక్షణ విడాకులు) చట్ట విరుద్ధమంటూ దేశ సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం చరిత్రాత్మక తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే.

రెడ్డి సామాజిక వర్గాన్ని తప్పుదోవ పట్టిస్తున్న సిఎం కెసిఆర్

ఎఐసిసి కార్యదర్శి, ఎంఎల్ఎ డా.జి.చిన్నారెడ్డి



మన తెలంగాణ/వనపర్తిప్రతినిధి: రెడ్డి సామాజిక వర్గాన్ని సిఎం కెసిఆర్ తప్పుదోవ పట్టించే ప్రసంగాలు చేయడం సరికాదని ఎఐసిసి కార్యదర్శి, ఎంఎల్ఎ డా.జి.చిన్నారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం వనపర్తి జిల్లా కేంద్రంలోని మన తెలంగాణ కార్యాలయానికి వచ్చిన ఆయన ప్రతినిధి కొండన్న యాదవ్ తో మాట్లాడుతూ 2013 మార్చి 14న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ అకాడమి (అప్పా) ను రాజా బహదూర్ వెంకట్ రాంరెడ్డి పోలీస్ అకాడమిగా నామకరణం చేసిందని ఆయన తెలిపారు. మంగళవారం హైద్రాబాద్‌లో రెడ్డి హాస్టల్ భవన శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన సిఎం కెసిఆర్ ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ అకాడమిని రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి పోలీస్ అకాడమిగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి అవివేకానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. జెఎసి ఛైర్మన్ కోదండరాం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పలు సమస్యలతో పాటు నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని ఆందోళనలు చేస్తుంటే రాజ్యాధికార అహంకారంతో హోం మంత్రి నాయిని నరసింహ్మారెడ్డి కోదండరాంను దొంగ రెడ్డిగా అభివర్ణించడం శోచనీయమని అన్నారు. కోదండరాం రెడ్డి అనే పదాన్ని తన పేరులో వాడుకోనప్పుడు ఆయన దొంగ రెడ్డి ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వంలో నిరుద్యోగులకు , మహిళలకు ప్రాధాన్యత కరువైందన్నారు. సమావేశంలో నాయకులు కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాగివేణు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ధనలక్ష్మి లు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న లోక్ అదాలత్

మన తెలంగాణ/హైదరాబాద్: నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటి ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ బి.ఆర్.మధుసూదర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ కాగల సివిల్, క్రిమినల్ కేసులు(ప్రీ లిటిగేషన్, పెండింగ్ లిటిగేషన్ కేసులు) లోక్ అదాలత్‌లో పరిష్కారం చేస్తారని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేసుల పరిష్కరించుకోవాలని కోరారు.

పోస్టాఫీసుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు


మన తెలంగాణ/హైదరాబాద్ : గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నిరవధిక సమ్మె కారణంగా సేవలకు అంతరాయం కలగకుండా కొన్ని సేవలను అందించేందుకు ఏర్పాటు చేసినట్టు తెలంగాణ సర్కిల్ ఛీఫ్ పోస్ట్ మాస్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మె కారణంగా చాలా బ్రాంచ్ పోస్టాఫీసులు పని చేయని కారణంగా బల్క్‌లను సంబంధిత సబ్ పోస్టాఫీసుల నుండి తీసుకునేందుకు అనుమతించారు. రిజిస్టర్ లెటర, స్పీడ్ పోస్ట్, పార్సిల్స్‌ను గుర్తింపు కార్డును చూపించి తీసుకునే వెసులుబాటు కల్పించారుత. ఇఎంఒ చెల్లింపులను కడా సంబంధిత సబ్ పోస్టాఫీసు ద్వారా చెల్లించవచ్చు. పోస్టాఫీస్ సేవింగ్ బ్యాంక్ అకౌంట్స్ ఉన్న వారు దగ్గరలోని సబ్ పోస్టాఫీసు ద్వారా లావాదేవీలు నెరపవచ్చు.

దరఖాస్తుల ఆహ్వానం

మన తెలంగాణ/హైదరాబాద్ : బ్యాంక్ ప్రొబేషనరీ ఆఫీసర్స్ నియామకాల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబిపిఎస్) నిర్వహించి పరీక్షకు ఉచితం కోచింగ్ కోసం మైనార్టీ అభ్యర్థులను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐబిపిఎస్‌లో రిజిష్టర్ చేసుకున్న ముస్లీం, క్రిస్టియన్, సిక్కు, బుద్దిస్ట్, పార్శి, జైన మతాలకు చెందిన అభ్యర్థులకు సెప్టెంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 8 నుంచి ఉచిత కోచింగ్ ప్రారంభమవుతుందని అన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో, పాటు ఐబిపిఎస్ దరఖాస్తు జిరాక్స్ కాపీతో దరఖాస్తును ఎస్‌బిఐ గన్‌ఫౌండ్రీ ఎదురుగా, ఉన్న జామియా నిమామియా కాంప్లెక్స్‌లోని తెలంగాణ స్టేట్ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో సమర్పించాలని తెలిపారు.

బేవరేజెస్ కార్యాలయం ప్రారంభం

మన తెలంగాణ/హైదరాబాద్: నాంపల్లిలోని ఆబ్కారీ శాఖ కార్యాలయం 5వ అంతస్థులో బేవరేజెస్ ఛైర్మన్ కార్యాలయాన్ని దేవి ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని



దేవి ప్రసాద్ అన్నారు. కార్పొరేషన్ పని విధానాన్ని మెరుగు పరచి తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కమిషనర్ చంద్రవదన్, ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్, టిఎన్‌జివోస్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, టిజివో సెక్రటరీ జనరల్ సత్యనారాయణతో పాటు అన్ని జిల్లాల టిఎన్‌జివోల నేతలు, మహిళలు పాల్గొని దేవి ప్రసాద్‌ను అభినందించారు.

కార్మికుల కృషితోనే ఆర్‌టిసి ప్రగతి

మన తెలంగాణ/ హైదరాబాద్ : కార్మికుల మెరుగైన పని సామర్ధంతోనే సంస్థకు ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని, కార్మికులకు కూడా గుర్తింపు వస్తుందని టిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ అన్నారు. ఆర్‌టిసి కళా భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో 'హై మైలేజీ' సాధించిన మెకానిక్‌లు, డ్రైవర్లు, సూపర్‌వైజర్లకు ఛైర్మన్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ సుమారు 10 లక్షల కిలోమీటర్లు తిరిగే సామర్థ్యం ఉన్న బస్సులను దాదాపు 12 లక్షల కిలోమీటర్లు నడిపిన ఘనత టిఎస్‌ఆర్‌టిసికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావుతో పాటు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పాత విధానమే మాగ్గావాలె

పెన్షన్ సమస్యలపై 30, 31న ఉద్యోగుల ర్యాలీ



మన తెలంగాణ/ హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలన్న డిమాండ్‌తో ఆగస్టు 30,31 తేదీల్లో ఉద్యోగుల నిరసన ర్యాలీలు నిర్వహించాలని, సెప్టెంబర్ 1న అన్ని జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాల్లో భోజన విరామంలో నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని టిఎన్‌జివో కేంద్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర సంఘం అధ్యక్షులు కారం రవీందర్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని టిఎన్‌జివో కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఉద్యోగులకు గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలని, సిపిఎస్ ఉద్యోగిగా ఉండి చనిపోతే కుటుంబాలకు ఫ్యామిలీ పెన్షన్ అమలు చేయాలని కోరుతూ ఆందోళన నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఏపికి కేటాయించిన తెలంగాణ ఉద్యోగులను స్వరాష్ట్రానికి పిలిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని తీర్మానించారు. కొత్త జిల్లాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు అప్షన్లు ఇస్తూ సొంత జిల్లాలకు శాశ్వత కేటాయింపులను జరపాలని, కొత్త జిల్లాలకు పాత జిల్లాల కేడర్ స్ట్రెంత్‌ను ఏర్పాటుచేస్తూ అదనపు పోస్టులను మంజూరు చేయాలని, అలాగే అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేసింది. జులై 2018 నుండి 11వ పిఆర్‌సిని అమలు చేయాలని తీర్మానించింది. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాజేందర్‌తో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, అనుబంధ ఫోరంల నాయకులు పాల్గొన్నారు.

వానకాలం సాగులో సగం విస్తీర్ణం

పత్తి పంటదే



మన తెలంగాణ/హైదరాబాద్ : ఈ ఏడాది వానకాలం పంటల విస్తీర్ణం మొత్తంగా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. వ్యవసాయ శాఖ తాజా నివేదిక ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1.06 లక్షల ఎకరాలకు గాను ఇప్పటి వరకు 89.47 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో కేవలం ఒక పత్తి పంటనే సగం 45.07 లక్షల ఎకరాల్లో సాగు నమోదు కావడం విశేషం. దేశవ్యాప్తంగా 42 లక్షల ఎకరాల్లో పత్తి సాగు పెరిగితే అందులో దాదాపు 14 లక్షల ఎకరాలు మన రాష్ట్రంలోనే అధికంగా పత్తి వేసారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరినాట్లు కాస్త ఊపందుకున్నాయి. వ్యవసాయ శాఖ ప్రణాళిక అంచనాలు ప్రకారం 23.07 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడాల్సి ఉండగా,ఇప్పటి వరకు 15.32 లక్షల ఎకరాల్లో రైతులు నాట్లు వేసారు. జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, కందులు, పెసర్లు, ఆముదం, సోయాబీన్ పంటల విస్తీర్ణం కూడా తగ్గింది. మొత్తంగా నూనె గింజలు 62 శాతం 4.99 లక్షల ఎకరాలలో సాగయ్యాయి. మొత్తం ఆహార ధాన్యాల సాగు కూడా తగ్గింది. అంచనాల ప్రకారం 48.13 లక్షల ఎకరాలకు గాను 36.22 లక్షల ఎకరాలలో నమోదయ్యాయి. మిరప పంట సాగు కూడా గణనీయంగా తగ్గింది. కేవలం 17297 ఎకరాలలో మాత్రమే వేసారు. గత ఏడాది 76602 ఎకరాలు ఉండడం గమనార్హం. ఈ నెల చివర వరకు వరినాట్లు పడే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇవి కొంత విస్తీర్ణంలో ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పత్తి పంటనే ఎక్కువ సాగైందని, ఇది ఇతర పంటల సాగుపై ప్రభావం చూపడంతో వాటి సాగు విస్తీర్ణం తగ్గిందని పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 584 మండలాలకు గాను ఇప్పటి వరకు 210 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇందులో ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల్, నిర్మల్ , నిజామాబాద్, జగిత్యాల్, పెద్దపల్లి, రాజన్న, మెదక్, వికారాబాద్ జిల్లాలు ఉన్నాయి. జనగాం జిల్లాలోని ఒక మండలంలో తీవ్ర వర్షాభావం చోటు చేసుకుంది. 302 మండలాలలో మాత్రం సాధారణ వర్షపాతం కురిసినట్లు నివేదికలో పేర్కొన్నారు.

కాస్త పుంజుకున్న వరినాట్లు



బిసిలపైకి మోడీ

సమ్మోహనాస్త్రాలు

న్యూఢిల్లీ: దేశంలోని వెనుకబడిన వర్గాలలో పట్టు సాధించే దిశలో బిజెపి పావులు కదిపింది. కేంద్ర మంత్రి మండలి బుధవారం జరిపిన సమావేశంలో తీసుకున్న రెండు కీలక ఒబిసి నిర్ణయాలు పార్టీ పలుకుబడి పెంచేందుకు, ఓట్ల స్థిరీకరణకు ఉపయోగపడుతాయని బిజెపి వర్గాలు ఆశిస్తున్నాయి. ఒబిసిలలో ఉప వర్గీకరణ అంశాన్ని పరిశీలించేందుకు కమిషన్ ఏర్పాటు, ఒబిసిలు రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందేందుకు ఉన్న వార్షిక ఆదాయ పరిమితిని పెంచడం వంటి రెండు నిర్ణయాలపై పార్టీకి చెందిన బిజెపి ప్రముఖ నేతలు స్పందించారు. ఈ నిర్ణయాలు చారిత్రకం,అపూర్వం అని బిజెపి నేతలు హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలంగా బిసిలు ఈ డిమాండ్లు చేస్తున్నారని, ఇప్పటికీ వీరి కల ఫలించనుందని తెలిపారు. బిసిల సాధికారతకు ఇదో ముందడుగు అని పార్టీ ప్రధాన కార్యదర్శి భూపేంద్ర యాదవ్ చెప్పారు. ఈ ఏడాది చివరిలో కొన్ని కీలక రాష్ట్రాలలో ఎన్నికలు జరగనుండటం, అక్కడున్న జనాభా వర్గాల దామాషా నేపథ్యంలో కేంద్రం బిసిల ప్రయోజనాల దిశలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు కూడా స్పందనలు వెలువడ్డాయి. ఆదాయపరిమితిని పెంచడం వల్ల అత్యధిక సంఖ్యలో బిసిలు ప్రయోజనం పొందుతారని బిజెపి నేతలు చెపుతున్నారు. బిసిలలో అట్టడుగు స్థాయిలో ఉన్నవారిని గుర్తించేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాలతో వీలేర్పడుతుందని బిజెపి ప్రధాన కార్యదర్శి యాదవ్ అభిప్రాయపడ్డారు. ఉపవర్గీకరణ కమిషన్ ఏర్పాటు వల్ల బిసిలలోని అన్ని వర్గాలకు ప్రయోజనం దక్కుతుందని తెలిపారు. ఓ వైపు క్రిమీలేయర్ పరిమితిని పెంచడంతో ఒబిసిలలోని ఆధిపత్య కులాలను ప్రసన్నం చేసుకోవడం, ఉప వర్గీకరణతో ఇతర కులాలకు మేలు ప్రతిపాదనలు చేయడం వల్ల సమతూకతనుపాటించినట్లు అయిందని భావిస్తున్నారు. క్రిమిలేయర్ పరిమితిని ఏకంగా 33 శాతం పెంచారు. దీనితో బిసి కోటాలో ప్రయోజనం మరింత మందికి దక్కుతుంది. బిసిల జాతీయ కమిషన్, పార్లమెంటరీ ప్యానెల్ చాలా కాలంగా ఒబిసిల ఉప వర్గీకరణ చేయాల్సిందేనని చెపుతూ వచ్చాయని, దీనికి అనుగుణంగా ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఈ చర్య తీసుకోవడం కీలకమైన అంశం అని ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుర్మీ నేత , కేంద్ర మంత్రి సంతోష్ గంగ్వార్ తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి, పార్టీ ఎంపి హుకుం నారాయణ్ యాదవ్ స్పందిస్తూ ఆదాయ పరిమితి పెంపుదల చిరకాల డిమాండ్ అన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లలోని ప్రాబల్య కులాలైన యాదవులు ఇతరులను దృష్టిలో పెట్టుకుని వారిని తమ పార్టీ ఓటుబ్యాంకులుగా మల్చుకునేందుకే బిజెపి ఈ రాజకీయ ఎత్తుగడకు దిగిందని వ్యాఖ్యానాలు వెలువడ్డాయి.

సామాజిక భద్రతా పథకం

పొడిగింపు

మన తెలంగాణ/హైదరాబాద్: ఆటో డ్రైవర్లు, హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టుల కోసం ఉద్దేశించిన సామాజిక భద్రతా పథకాన్ని సంవత్సరం పాటు పొడిగించారు. ఈ నెల 21వ తేదీతో గడువు ముగియగా ఈ సంవత్సరం ఆగస్టు 22వ తేదీ నుండి 2018 ఆగస్టు 21వ తేదీ వరకు పథకాన్ని పొడిగిస్తూ కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకం కింద ప్రమాదాల్లో మృతి చెందిన వారికి రూ.5,00,000ను బీమా కవరేజీని కల్పిస్తున్నారు.





రెప్పపాటులో స్పందన.. ఫోటో జర్నలిస్టు సొంతం

మన తెలంగాణ/హైదరాబాద్/హిమాయత్‌నగర్: మనిషి శరీరంలో అత్యంత వేగంగా స్పందించేది మెదడు అయితే కనురెప్ప పాటులో చూసిన దృశ్యాలను కెమెరాలో బంధించే వారు ఫొటో జర్నలిస్టులు అని రాష్ట్ర శాసన సభాపతి సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఉత్తమ ఛాయాచిత్ర పోటీలలో2016–17 సంవత్సరంలో గెలుపొందిన ఫొటో జర్నలిస్టులకు బహుమతుల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో చాయచిత్రాల ప్రదర్శనను సభాపతి తిలకించారు. అనంతరం సభాపతి మాట్లాడుతూ జర్నలిస్టులకు వార్త సేకరణకు అనేక మార్గాలు ఉంటాయని, కానీ ఫొటో జర్నలిస్టులకు ఎలాంటి మార్గాలు ఉండవన్నారు. మనిషి నిత్య జీవితంలో కొన్ని కనిపించే దృశ్యాలు ఉంటాయని, కొన్ని మనకు కనబడని దృశ్యాలను ఫొటోగ్రాఫర్లు వారి కెమెరాలో బంధించి ప్రజలకు తెలియజేస్తారని అన్నారు. ఫొటో జర్నలిస్టులు అందరి కంటే ఎక్కువగానే శ్రమించినప్పటికీ గుర్తింపులో వెనుకబడి ఉన్నారని అన్నారు. ఫొటో జర్నలిస్టులు తీసిన దృశ్యాలను బట్టి మనసుండి వ్రాసే వారు ఉంటే ఒక పుస్తకం రాయవచ్చునని అన్నారు. ఐజెయు సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్ మాట్లాడుతూ ఈ పోటీ ప్రదర్శన ఫొటో జర్నలిస్టులకు మరింత ఉత్సాహంగా పాల్గొనడానికి దోహద పడుతాయన్నారు. టియుడబ్ల్యూజె ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టులు బహుమతులు ముఖ్యం కాకుండా ఈ పోటీ ప్రదర్శనలో పాల్గొనడమే మంచి అవకాశంగా భావించాలన్నారు. ఫొటో దృశ్యాల ఆధారంగా ఒక్కొక్క దృశ్యానికి రెండు పేజీల వార్త వ్రాయవచ్చు అన్నారు. ఫొటో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం టియుడబ్ల్యూజె అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అనుముల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్ హరి, రామ్మోహన్, న్యాయనిర్ణేతలు రెహమాన్ దిలీప్‌రెడ్డి, సత్తిరెడ్డి, ఫొటోజర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగా చక్కెర ధరలు

పెంచితే చర్యలు

పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్

మన తెలంగాణ/హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా చక్కెర నిల్వలు కలిగి ఉండి, కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సి.వి.ఆనంద్ వ్యాపారులను హెచ్చరించారు. లైసెన్స్ పొందిన వ్యక్తి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధేశించిన ధర కన్నా అధిక ధరకు అమ్మకూడదని అన్నారు. లైసెన్స్ లేకుండా చక్కెర విక్రయించే వ్యాపారులపై దాడులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా ఐదు క్వింటాళ్ల కంటే ఎక్కువ చక్కెర నిల్వలు కలిగి ఉంటే, వారిని చక్కెర డీలర్‌గా పరిగణిస్తారని, వారు సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారి, తహశీల్దార్‌ల దగ్గర హోల్‌సేల్, రిటైల్ లైసెన్స్‌ను తీసుకోవాలని అన్నారు. లేనిపక్షంలో వారిపై నిత్యావసరాల చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చక్కెర నిల్వలు, లావాదేవీలపై పరిమితులు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం గతంలో విడదుల చేసిన ఉత్తర్వులను మరో ఆరు నెలలు(2017,అక్టోబర్ 28) వరకు పొడిగించిందని, ఇది అన్ని రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పాటించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ మేరకు కమిషనర్ సి.వి.ఆనంద్ హోల్‌సేల్ చక్కెర వ్యాపారుల సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వ హించారు.

లైసెన్స్ లేనివారిపై చర్యలు తీసుకోండి : వ్యాపారులు

చాలామంది లైసెన్స్ లేకుండా చక్కెరను విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని చక్కెర వ్యాపారులు రాంప్రసాద్, కృష్ణమూర్తి, హరికిషన్‌లు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. వ్యాపారుల వివరాలను అందిస్తామని అన్నారు

ఆగిన ఆసరా!

• పోస్టల్ సమ్మెతో ఆగిన పింఛన్ల పంపిణీ • రంగారెడ్డి, వికారాబాద్‌లో 2 లక్షల మందికి అందని పింఛన్లు

మన తెలంగాణ/రంగారెడ్డి జిల్లా ప్రతినిధి

ఆసరా పింఛన్ల కోసం లబ్దిదారులు అవస్థలు పడుతున్నారు. గ్రామీణ తపాలా సేవకులు సమ్మె చేపట్టడంతో మొదటి, రెండో వారంలో రావలసిన పింఛన్‌లు ఇప్పటివరకు రాకపోవడంతో ప్రతి గ్రామంలో ఫింఛన్ కోసం వృద్దులు, వికలాంగుల పోస్టాఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. కొంత మంది వృద్దులు పొద్దున నుంచి అక్కడే కునుకుతీస్తున్నారు. పింఛన్‌ల పంపిణీ మున్సిపాలిటీలలో మాత్రం బ్యాంకుల ద్వారా నేరుగా ఖాతాల్లో వేస్తుండగా ఇతర ప్రాంతాల్లో పూర్తిగా పోస్టల్ వ్యవస్థపై ఆధారపడటంతో ఇబ్బందులు కొనసాగుతున్నాయి. పోస్టల్ సిబ్బంది సమ్మెతో ప్రత్యామ్నాయంగా పంచాయతీ కార్యదర్శిలు, డ్వాక్రా సంఘాలు లేదా ఇతర మార్గాలను అన్వేషించవలసిన అవసరం ఉన్న ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్న వృద్దులు, వితంతువులు, వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పింఛన్‌ల కోసం డబ్బులు విడుదల చేయడం వాటిని పోస్టాఫీసులలో జమ చేసిన మరుసటి రోజు నుంచి పోస్టల్ సిబ్బంది సమ్మెకు దిగడంతో పింఛన్‌లు అందక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం రెవెన్యూ, పంచాయతీ రాజ్ వ్యవస్థలోని సిబ్బందిని వినియోగించి ఫింఛన్‌లు పంపిణీ చేద్దామని ప్రయత్నం చేసినా డబ్బులు పోస్టాఫీసులలో ఉండటంతో పాటు బయోమెట్రిక్ యంత్రాలు సైతం పోస్టల్ సిబ్బంది వద్ద ఉండటంతో వారు సమ్మె విరమణ చేసే వరకు పింఛన్‌లు అందే వాతావరణం మాత్రం కనిపించడం లేదు. ఈ నెల 16 నుంచి సమ్మెకు దిగి కొనసాగిస్తుండగా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి వారి డిమాండ్‌లపై ఎలాంటి సానుకూల ప్రకటన రాకపోవడంతో సమ్మె ఇప్పట్లో ముగిసే అవకాశం కూడా కనిపించడం లేదు. రంగారెడ్డి జిల్లాలో 1,70,124 మంది లబ్దిదారులకు పింఛన్‌లు అందచేస్తుండగా అందులో 122898 మందికి పోస్టాఫీసుల ద్వారా, 47226 మందికి బ్యాంకుల ద్వారా పింఛన్‌లు అందచేస్తున్నారు. బ్యాంకు ఖాతాల ద్వారా పింఛన్‌లు పొందుతున్న వారికి ఇప్పటికి 5.16 కోట్లు జమ చేయడంతో వారికి పింఛన్‌లు రాగా పోస్టాఫీసుల ద్వారా పంపిణి చేయవలసిన ఫింఛన్‌ల డబ్బు 14.39 కోట్లు పోస్టల్ సిబ్బంది సమ్మెతో వారి ఖాతాల్లోనే ఉండిపోయింది. రంగారెడ్డి జిల్లాలో 122898 మంది పింఛన్‌ల కోసం పడిగాపులు కాస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో ప్రతి నెల 1,05,375 మందికి 12 కోట్లు పింఛన్ అందచేస్తున్నారు. వికారాబాద్, తాండూర్ మున్సిపాలిటిలలో నేరుగా బ్యాంకు ఖాతాల్లో పింఛన్ జమ చేస్తుండగా మిగతా జిల్లా పూర్తిగా బ్రాంచ్ పోస్టుమెన్‌ల ద్వారానే పింఛన్ పంపిణీ చేస్తారు. వికారాబాద్‌లో 3,711, తాండూర్‌లో 6,363 మందికి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. వికారాబాద్ జిల్లాలో ప్రస్తుత నెలలో ఇప్పటివరకు కేవలం 8,311 మందికి 91.80 లక్షలు పంపిణీ చేయగా 86,990 మందికి పింఛన్‌లు పది కోట్లకు పైగా పంపిణీ చేయవలసి ఉంది. మేడ్చల్ జిల్లాలో సైతం 1,01,512 మందికి 12.20 కోట్లు పంపిణీ చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా పంపిణీ చేసినవి తప్ప పోస్టల్ సిబ్బంది పంపిణీ చేయవలసినవి పెండింగ్‌లో ఉన్నాయి.



“మనకు దృఢ సంకల్పం ఉండాలి. మన లక్ష్యపథం మధ్యలో ఏవో స్వల్ప ప్రయోజనాలు సిద్ధిస్తే వాటితో తృప్తి పడకూడదు. అంతిమ లక్ష్యం సాధించేవరకూ పట్టినపట్టు విడువకూడదు.
– నేతాజీ సుభాష్ చంద్రబోస్”

ట్రంప్ హెచ్చరిక పాకిస్థాన్‌పై పనిచేస్తుందా?

సంపాదకీయం

ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా సైన్యాల కొనసాగింపు విషయంలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన గత అభిప్రాయాలను మార్చుకున్నారు. అమెరికా 16 సంవత్సరాలుగా ఆఫ్ఘన్‌లో సాగిస్తున్న యుద్ధాన్ని త్వరితంగా ముగించాలనే అభిప్రాయాన్ని మార్చుకుని, అదనపు సైన్యాన్ని పంపాలని తాజాగా నిర్ణయించారు. ప్రస్తుతం అక్కడ ఉన్న 8500 అమెరికన్ సైనికులకు తోడుగా మరో 3900 మంది సైనికులను పంపాలని నిర్ణయించారు. ఆఫ్ఘన్ యుద్ధా న్ని కాలం, ధనం వృథాగా అభివర్ణించిన ట్రంప్, ఆ యుద్ధం పట్ల తన దృక్పథం కాలం ప్రాతిపదికగాగాక పరిస్థితులు ప్రాతిపదికగా ఉంటుందని ప్రకటించటమే గాక టెర్రరిజాన్ని తుదముట్టించటం లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. ఆర్మీ జనరల్స్, మిలటరీ లీడర్స్‌తో క్యాంప్ డేవిడ్‌లో సమాలోచనల తర్వాత ఆయన దక్షిణాసియా విధానం ప్రకటించారు. టెర్రరిస్టులకు ఆశ్రయంపై పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేయటం, ఆఫ్ఘనిస్థాన్ అభివృద్ధిలో భారత్ విరివిగా పాల్గొనాలని కోరటం భారత ప్రభుత్వానికి సంతోషదాయకమైన విషయం. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆ విధంగానే స్పందించింది. పాకిస్థాన్ గడ్డనుంచి టెర్రరిజం బాధితుల్లో మన దేశం ఒకటిగా ఉన్నందున, టెర్రరిజం గూర్చి పాకిస్థాన్‌ను అమెరికా హెచ్చరించినపుడల్లా భారతప్రభుత్వం వెంటనే హర్షం వ్యక్తం చేస్తుంటుంది. కాని ఆచరణలో అమెరికా పాకిస్థాన్‌ను నియంత్రించిన దాఖలాలు లేవు. జమ్మూ–కశ్మీర్‌లో టెర్రరిస్టుల చొరబాట్లు ఈ సంవత్సరం గతేడాదికన్నా పెరగటం గుర్తు చేసుకోదగింది.

2001 సెప్టెంబర్ 11న అమెరికాపై టెర్రరిస్టు దాడి జరిగిన నెలలోపే – అక్టోబర్ 7 న బుష్ ప్రభుత్వం ఆఫ్ఘనిస్థాన్‌పై దురాక్రమణ యుద్ధానికి దిగటం తెలిసిందే. ఆఫ్ఘన్, ఇరాక్ యుద్ధాలను త్వరితంగా ముగింపుకు తెస్తానన్న వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన బరాక్ ఒబామా, ఆ రెండు దేశాల నుంచి తమ సైనికుల్లో ఎక్కువ శాతాన్ని ఉపసంహరించారు. స్థానిక సైనికులకు శిక్షణ ఇవ్వటం, అత్యవసరాల్లో అండగా ఉండటం నిమిత్తం కొన్నివేల సైనికులను కొనసాగించారు. ఒక్క ఆఫ్ఘన్ యుద్ధంలోనే అమెరికా 2001 నుంచి రోజుకు 49బిలియన్ డాలర్ల చొప్పున దాదాపు 800 బిలియన్ డాలర్లు వెచ్చించింది. ఇదంతా దుబారా అన్న ట్రంప్, ఇప్పుడు పరిస్థితులు కోరినంతకాలం తమ సైన్యం కొనసాగుతుందంటున్నారు. తాము ఉపసంహరించుకుంటే, ఆ ఖాళీని టెర్రరిస్టులు పూరిస్తారన్న అమెరికా సైనికాధికారుల అభిప్రాయంతో అధ్యక్షుడు ట్రంప్ ఏకీభవించారు.

కీలకమైన విదేశాంగ విధాన సవాళ్లపై తొలిసారి దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించిన ట్రంప్, దేశ నిర్మాణం(ప్రజాస్వామ్యం నేర్పటం, అలవాటు చేయటం) కన్నా టెర్రరిస్టులను చంపటంపైనే తమ సైన్యం దృష్టి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్‌లోని టెర్రరిస్టు గ్రూపులగూర్చి హెచ్చరిక చేస్తూ, ‘అమెరికా నిషేధించిన 20 టెర్రరిస్టు సంస్థలు ఆ రెండు దేశాల్లోనే ఉన్నాయి. ఇంత పెద్ద కేంద్రీకరణ ప్రపంచంలో మరే ప్రాంతంలో లేదు’ అని వ్యాఖ్యానించారు. అరాచక శక్తులకు పాకిస్థాన్ సురక్షిత స్వర్గంగా ఉందన్న ట్రంప్, ‘గతంలో పాకిస్థాన్ విలువైన భాగస్వామిగా ఉంది. ఉమ్మడి శత్రువులకు వ్యతిరేకంగా రెండు దేశాల సైన్యాలు కలిసి పనిచేశాయి. అయితే మన వాళ్లను చంపటానికి నిత్యం ప్రయత్నిస్తున్న అదే గ్రూపులకు పాకిస్థాన్ ఆశ్రయమిస్తున్నది. పాకిస్థాన్‌కు బిలియన్‌ల కొలది డాలర్లు మనం చెల్లిస్తున్నాం. కాని మనం ఏ టెర్రరిస్టులపై పోరాడుతున్నామో అదే టెర్రరిస్టులకు వారు ఆశ్రయమిస్తున్నారు’ అన్నారు. ఇది పాకిస్థాన్‌కు కచ్చితమైన హెచ్చరిక. అమెరికా సైన్యాల ఉపసంహరణ అనంతర ఆఫ్ఘన్‌ను తమ ప్రభావం కింద ఉంచుకునేందుకై పాకిస్థాన్ ఆఫ్ఘన్ టెర్రరిస్టులకు ఆశ్రయమిస్తున్నది. ట్రంప్ మాటలు భారతదేశ చెవులకు సుగమ సంగీతం లాంటివి. అంతేగాక, ఆఫ్ఘన్ పునర్నిర్మాణంలో భారత్ విరివిగా పాల్గొనాలని ట్రంప్ కోరటం ప్రభుత్వానికి ఎనలేని ప్రోత్సాహం. అయితే ‘వ్యూహాత్మక భాగస్వామ్యం’ పటిష్టత పేరుతో ఆయన మన మిలటరీ జోక్యాన్ని కోరినా ఆశ్చర్యం లేదు. అటువంటి విజ్ఞప్తి వస్తే దాన్ని ప్రభుత్వం సున్నితంగా తిరస్కరించాలి. చైనా, పాకిస్థాన్‌లతో ఉన్న వివాదాలు చాలవా!

నోట్ల రద్దుపై అంకెల గారడీ

చూపు


‘పెద్ద నోట్ల రద్దు’ తర్వాత పెరిగిన ఆదాయం పన్ను చెల్లింపు దారుల సంఖ్యపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక వివరణ ఇచ్చింది. ప్రధాని, ఆర్థిక మంత్రి, ఆర్థిక సర్వే, సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సిబిడిటి) ఈ అంకెను నాలుగు రకాలుగా చెప్పడంతో ఏర్పడిన గందరగోళం తొలగించడానికి ఈ వివరణ ఇచ్చింది. వారు చెప్పిన దానిని బట్టి ఆదాయం పన్ను చెల్లింపుదారుల సంఖ్య వరుసగా 56 లక్షలు, 5.4 లక్షలు, 91 లక్షలు, 33 లక్షలు. ఆ నాలుగు మూలాల నుంచి వచ్చిన సంఖ్యలు భిన్నంగా గందర గోళం ఏర్పడింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణ ప్రకారం ‘ఆ అంకెలు వేర్వేరు కాలాల్లో వేర్వేరు పన్ను చెల్లింపు దార్ల సంఖ్యలు’. ప్రభుత్వం వదిలిన ఈ అంకెల సమాచారం అర్థంకాని గందరగోళమే ఎవరికైనా. దాన్ని సరిగా ఆకళింపు చేసుకొని మన ఆదాయం పన్ను చెల్లిందార్ల సంఖ్యను ఖచ్చితంగా చెప్పడం ఎంతటి పన్నుల నిపుణుడికైనా కష్టం.

మొత్తం సమాచారం అందే వరకు ప్రభుత్వం వేచిచూడకుండా ప్రజల మొహం మీద పొంతనలేని అంకెలు విసరడం– నోట్ల రద్దు ప్రక్రియ విజయం సాధించిందని చాటడానికే. దాని నుంచి రాజకీయ లబ్ధి పొందడానికే ఈ అంకెల గారడీ. ముందుగా ప్రధాని ప్రకటనకు ఇచ్చిన వివరణను విశ్లేషించాలి. ఆ వివరణ ఈ కింది విధంగా సాగింది – 2017 ఏప్రిల్ నుంచి ఆగస్టుదాకా దాఖలు చేసిన – వ్యక్తి గత ఆదాయ పన్ను రిటర్న్స్ (ఐటిఆర్‌లు) – కిందటి ఏడాది అదే కాలంలో దాఖలయిన వాటికంటే ఎంత పెరిగాయో ప్రధాని ప్రకటనలో ఉంది. ఆదాయం పన్ను శాఖ సమాచారం ఏమి చెబుతోందంటే – 2017 ఏప్రిల్ ఒకటి నుంచి ఆగస్టు అయిదు దాకా 2.79 కోట్ల రిటర్న్స్ అందాయి. 2016లో అదే కాలంలో అందినవి 2.23 కోట్లు. అందువల్ల 2017లో అందిన అదనపు రిటర్న్స్ సంఖ్య 56 లక్షలు. 2015 అదే కాలంలో 2 కోట్ల రిటర్న్స్ మాత్రమే అందాయి. దీనిని బట్టి 2016లో గడువు నాటికి దాఖలు చేసిన రిటర్న్స్ 22 లక్షలు పెరిగాయి. ఈ సమాచారాన్ని సిబిడిటి వెబ్‌లో పెట్టడం జరిగింది. గత 7వ తేదీన ఈ పత్రికా ప్రకటన వెలువడింది. ఇప్పుడు మనం ప్రధాని అసలు ఏమి చెప్పారో చూద్దాం

ఇ– రిటర్న్స్ ఊసే లేదు

‘ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 5 దాకా ఆదాయం పన్ను రిటర్న్స్ దాఖలు చేసిన పన్ను చెల్లింపుదార్ల సంఖ్య 56 లక్షలు. గత ఏడాది ఇదే కాలంలో ఆ సంఖ్య 22 లక్షలు. ఒక విధంగా చూస్తే ఈ సంఖ్య రెట్టింపు కంటే పెరిగింది. మేము నల్లధనంతో సాగిస్తున్న పోరాటం వల్ల ఇది సాధ్యపడింది’ అన్న ప్రధాని ప్రకటనలోగాని, సిబిడిటి ప్రకటనలోగాని ‘ఎలక్ట్రానిక్ రిటర్న్స్ (ఇ – రిటర్న్స్)’ సంఖ్య లేదు. ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరణ ఇచ్చిన విధంగా ప్రధాని తన ప్రకటనలో ఎక్కడా ఇ రిటర్న్స్ ప్రస్తావన తేలేదు. అందుకు బదులుగా ఆయన ‘కొత్త పన్ను చెల్లింపుదార్లు’ అనే పదం వాడారు. వారు ఇ – రిటర్న్స్ దాఖలు చేస్తున్నారా అన్నది స్పష్టత లేదు. ఈ నెల 7న, 18న జారీ చేసిన పత్రికా ప్రకటనలలో కూడా సిబిడిటి ఈ వివరణ ఇవ్వలేదు.

ఆదాయంపన్ను రిటర్న్స్ ‘డిమానిటైజేషన్ (నోట్ల రద్దు)’ వల్ల 24 శాతం పెరిగినట్లు చాటుతూ దీని ఆధారంగానే చాలా వార్తా పత్రికలు



ప్రముఖంగా వార్త ప్రచురించాయి. ఈ సందర్భంగా గత రెండేళ్లుగా ఇ–రిటర్న్స్ దాఖలు ప్రక్రియలో ఎంత వృద్ధి చేటుచేసుకుందో పరిశీలించివలసి వుంది. 2015– 16 ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదిక 228వ పేజీలో ఉన్న టేబుల్ ప్రకారం ఇది తెలుస్తుంది. ఇంటర్నెట్‌లో ఐటి రిటర్న్స్ సంఖ్యలను పరిశీలిస్తే, 2006 – 07 ఆర్థిక సంవత్సరం నుంచి 2014–15 ఆర్థిక సంవత్సరం నాటికి ఎలక్ట్రానిక్ పద్ధతిలో దాఖలు అయిన ఆదాయం పన్ను రిటర్న్స్ (ఇ–రిటర్న్స్) సంఖ్య 341.73 లక్షలు పెరిగినట్లు అర్థం అవుతోంది. 2015–16 ఆర్థిక సంవత్సరంలో 2015 డిసెంబర్ నాటికి 309.53 లక్షల రిటర్న్స్ అందాయి. 2014 – 15 ఆర్థిక సంవత్సరంలో అదే కాలంలో దాఖలయిన రిటర్న్స్ 243.31 లక్షలు మాత్రమే. ఇది 27.22 శాతం పెరుగుదల సూచిస్తోంది. ఈ టేబుల్ ప్రకారం ఇ–రిటర్న్స్ పెరుగుదల ఏటేటా వృద్ధి చెందుతున్నట్లు తెలుస్తుంది. అయితే ఆ వృద్ధి 74 శాతం, 79 శాతం, 31 శాతం, 38.67 శాతంగా మన్‌మోహన్ సింగ్ సారథ్యంలోని యుపిఎ ప్రభుత్వం హయాం చివరి నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో (2010–2014) గా ఉంది. మరి గత ఏడాది నిర్దిష్ట కాలంలో 24 శాతం పెరుగుదల చెప్పుకోదగ్గదా అన్న ప్రశ్న పాఠకుల తీర్పుకు వదిలివేస్తున్నాను.

ఆర్థిక సర్వే (సంపుటి–2) 22వ పేజీలో ఇచ్చిన టేబుల్ 6 విశ్లేషణ 2016 నవంబర్ 9 నుంచి 2017 మార్చి 31 కి, గత రెండు ఆర్థిక సంవత్సరాలలో అదే కాలానికి చెందిన సమాచారం ఆధారంగా కూర్చినది. ఇదంతా చూస్తే ఆర్థిక సర్వే ఆధారపడిన, ప్రధాని ప్రకటనకు మూలమైన సమాచారాలు వేర్వేరని అర్థం అవుతోంది. మన పన్నుల ప్రాతిపదికకు అదనంగా 91 లక్షల మంది చేరినట్లు ఆర్థికమంత్రి చేసిన ప్రకటనలో తెలిపింది. 2016–17 ఆర్థిక సం॥లో దాఖలు అయిన మొత్తం కొత్త రిటర్న్స్ సంఖ్యను అలా ప్రస్తావించింది. అందుచేత ఆ అంకెను ప్రధాని ప్రకటనలోని అంకెతో పోల్చకూడదు.

2016 నవంబర్ 9, 2017 మార్చి 31 మధ్య దాఖలయిన మొత్తం రిటర్న్స్ సంఖ్య 1.96 కోట్లు అని మంత్రిత్వ శాఖ వివరించింది. అంటే క్రితం ఏడాది అదే కాలంలో పెరిగిన రిటర్న్స్ సంఖ్య 1.63 కోట్లు అని తేలింది. ఇది కూడా చెప్పుకోదగ్గ పెరుగుదల కాదు. అంతకు ముందు ఏళ్లలో పెరుగుదల రేటుతో పోల్చితే ఈ పెరుగుదల చాలా తక్కువని చెప్పాలి. ఆదాయం పన్నుకు సంబంధించిన మొత్తం సమాచారానికి ఏకైక చిరునామా సిబిడిటి ప్రధానికి, ఆర్థికమంత్రికి, ప్రధాన ఆర్థిక సలహాదారుకు, మరికొన్ని కీలక సంస్థలకు మౌలిక సమాచారాన్ని అందించే సంస్థ అది. అందుచేత దానినుంచి మొత్తం సమాచారం అందే వరకు వేచిచూడకుండా ఎవరి నోటికి వచ్చినట్లు వారు పన్ను చెల్లింపుదార్ల సంఖ్య గురించి అతకని ప్రకటనలు చేయడం భావ్యమా?

✻ జేమ్స్ విల్సన్

షాబానో నుండి ఇప్పటి వరకు

ట్రిపుల్ తలాఖ్ విధానాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును భారత ముస్లిం సమాజం సంతోషంగా ఆహ్వానించింది. ముస్లిం సమాజంలోని మహిళలే కాక పురుషులు సహితం, ఉదారవాదులేకాక, ఛాంధసులు సహితం ట్రిపుల్ తలాఖ్ (చిటికెల్లో విడాకులు) విధానాన్ని చాలాకాలంగా వ్యతిరేకిస్తున్నారు.

ఎస్సెమ్మెస్, ఈ మెయిల్, వాట్స్ అప్, ఆన్‌లైన్, స్కైప్ వగయిరాల ద్వార చెప్పే తలాఖ్‌లు చెల్లవని చెప్పడానికి షరియా/హదీస్‌ల నుండి ఉటంకింపులు కూడా అక్ఖరలేదు. ఇవన్నీ సమాచార విప్లవం అనంతరం వచ్చిన సౌకర్యాలు, దుర్వినియోగాలు. సమాచార విప్లవం కన్నా వెయ్యేళ్ళు ముందుగా రాసినవి కనుక షరియా/హదీస్‌లు వీటిని గుర్తించవు. ఒక్కసారిగా (వెంటవెంటనే instant) తలాక్ చెప్పడం ముస్లిం పర్సనల్ లా(షరియా)కు వ్యతిరేకమని ఇస్లాం ధార్మిక గురువులు చాలాసార్లు చెప్పివున్నారు. అలా ధర్మవిరుద్ధంగా విడాకులు ఇచ్చిన భర్తల కుటుంబాలను సాంఘీకంగా బహిష్కరించాలని అఖిలభారత ముస్లిం పర్సనల్ లా బోర్డు గతంలో పిలుపు (ఫత్వా) కూడా ఇచ్చింది.

చిటికెల్లో విడాకులు విధానంపై ముస్లిం పర్సనల్ లా బోర్డు స్పందించాల్సినంతగా స్పందించలేదనే అపవాదు కూడా ఒకటి వుంది. అయితే. ఇందులో ఒక స్మృతి సూక్ష్మ ం వుంది. సాంఘీక బహిష్కరణ చేయమని మాత్రమే పర్సనల్ లా బోర్డు ఫత్వా జారీ చేయగలదు. ట్రిపుల్ తలాఖ్ దోషులతో అంతకు మించి వ్యవహరిస్తే అంటే తిట్టడం, కొట్టడం వంటివి చేస్తే అది పౌరస్మృతి పరిధిని దాటి నేరస్మృతి పరిధిలోనికి వెళ్ళిపోతుంది. ప్రత్యేక పౌరస్మృతి వున్నట్టు ముస్లింలకు ప్రత్యేక నేరస్మృతి వుండదు. పర్సనల్ లా బోర్డు పరిధి పరిమితుల్ని కూడా అర్థం చేసుకోవాలి. తాము ఆశించిందే కోర్టు తీర్పుగా రావడం ఎవరికైనా ఆనందమే. ముస్లిం సమాజానికి అంత కు మించిన ఆనందాన్నిచ్చే అంశం అత్యున్నత న్యాయస్థానం తీర్పు లో మరొకటుంది. మత స్వేచ్ఛ అనేది పౌరులకు రాజ్యాంగంలోని 25వ అధీకరణ ద్వార వచ్చిన ప్రాథమిక హక్కు అని ధర్మాసనం మరోసారి నొక్కి చెప్పింది. ప్రస్తుత, అసహన వాతావరణంలో, గోగ్రవాదుల మూకదాడుల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన భరోసా తమకు పెద్ద వరమని భారత ముస్లిం సమాజం భావిస్తోంది.

1985లో షాబానో మనోవర్తి కేసు సాగిన సమయంలో భారత ముస్లిం సమాజం మీద ఛాందసుల ప్రాబల్యం ఎక్కువగా వుంది. అప్పుడు ముస్లిం ఉదారవాదులు బలంగాలేరు. ఇప్పటి షయరా బాను కేసు సందర్భంగా కొందరు కొన్ని అపోహలూ, భయాందోళనల్ని వ్యక్తం చేసినప్పటికీ, ట్రిపుల్ తలాక్ ను రద్దుచేయాలనే అంశం మీద ముస్లిం సమాజంలో దాదాపు ఏకాభిప్రాయం వుంది. గడిచిన మూడు దశాబ్దాల కాలంలో భారత ముస్లిం సమాజం సాధించిన పురోగతిగా దీన్ని భావించవచ్చు.

ఈ సందర్భంగా వ్యక్తమైన అపోహలూ, భయాందోళనల్ని కూడా కొట్టి పడేయడానికి వీలులేనివి. ట్రిపుల్ తలాక్ నెపంతో ముస్లిం పర్సనల్ లానే రద్దు చేస్తారని కొందరు భయపడ్డారు. బయటి నుండి హిందూత్వ శక్తులు చేస్తున్న ప్రచారమే దానికి ప్రధాన కారణం. వాళ్ళల్లో కొందరు అతివుత్సాహంతో ముస్లిం సమాజంలో విడాకులనే రద్దు చేయాలని ప్రతిపాదించారు. సుప్రీంకోర్టు చిటికెల్లోఇచ్చే విడాకుల విధానాన్ని మాత్రమే రద్దుచేసిందిగానీ, ముస్లిం విడాకుల్లో ఇతర విధానాలని రద్దు చేయలేదు.

ఇంతటి వివాదాన్ని సృష్టించిన ‘చిటికెల్లో విడాకుల’ కేసులు దేశం మొత్తమ్మీద రెండు వందలు కూడా వుండవు. మొత్తం ముస్లిం విడాకుల కేసుల్లో ఇవి 0.1శాతం మాత్రమే. వెయ్యికి ఒకటే అయినా విచక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించాల్సిన పనిలేదు. విచక్షణతో కూడిన విడాకులు మాత్రం ఇకముందు కూడా కొనసాగుతాయి.

మనందరం గుర్తుంచుకోవాల్సిన అంశం ఏమంటే మతాలు అన్నీ మధ్యయుగాలకన్నా ముందు కాలంలో ఆవిర్భవించాయి. పితృస్వామ్య వ్యవస్థలో పుట్టిన కారణంగా మినహాయింపు లేకుండా సమస్త మతధర్మాల్లో స్త్రీ వివక్ష వుంటుంది. అయితే, స్త్రీల విషయంలో ఇస్లాం సాపేక్షకంగా ఉదారంగా వ్యవహరించిందనేది వాస్తవం. స్త్రీలకు విద్య, వివాహ, పునర్ వివాహ, విడాకుల (కులా)స్వేచ్ఛలతోపాటు ఆస్తి హక్కు కూడా కల్పించింది. స్త్రీ సంస్కరణల విషయంలో ఇతర మతసమూహాలతో పోలిస్తే ఇస్లాం వెయ్యి సంవత్సరాలు ముందున్నది. అయినప్పటికీ ముస్లిం సమాజంలో స్త్రీలకు పురుషులతో సర్వసమాన హక్కులున్నాయనడం అతిశయోక్తే అవుతుంది!.

వర్తమాన ప్రపంచంలో ముస్లింలు ఒక్కోదేశంలో ఒక్కోలా వ్యవహరిస్తుంటారు. తాము మెజారిటీగా వున్న దేశాల్లో వ్యవహరించినట్టు మైనారిటీగా వున్న దేశాల్లో వాళ్ళు దూకుడుగా మార్పుల్ని స్వీకరించలేరు. దానికి కారణం అభద్రత. పౌరస్మృతిని వదులుకుంటే తమ అస్థిత్వమే అంతరించిపోతుందని భారత ముస్లిం సమాజం భావిస్తుంది. అంచేతవాళ్ళు తమ పౌరస్మృతిని గట్టిగా పరిరక్షించుకోవాలనుకుంటారు. నిజానికి తాము మైనారిటీలుగా వున్న దేశాల్లో హిందువులు సహితం ఇదే విధానాన్ని కొనసాగిస్తారు. భారతదేశంలో భక్తి, సంస్కృతి, సాంప్రదాయాలను పట్టించుకోని వారు సహితం అమెరికా వెళ్ళాక వాటికి పెద్దపీట వేస్తుండడాన్ని మనం తానా తదితర ఉత్సవాల్లో చూస్తున్నాం.

ట్రిపుల్ తలాఖ్‌తో ఆగకుండా మొత్తం ముస్లిం పర్సనల్ లానే రద్దు చేయాలని బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ ఒక అభిప్రాయాన్ని చర్చకు పెట్టారు. భారత ముస్లిం సమాజం ఎందుకు తన ప్రత్యేక అస్థిత్వాన్ని రద్దు చేసుకోవాలి? అనే ప్రశ్నకు తస్లీమా నస్రీన్ వంటి వారి వద్ద సమంజసమైన సమాధానం వుండదు.

ట్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేయకుంటే తాము హిందూమతాన్ని స్వీకరిస్తామని కొందరు ముస్లిం మహిళలు హెచ్చరించినట్టు ఇటీవల కొంత ప్రచారం సాగింది. కులవ్యవస్థ పునాది మీద ఏర్పడిన హిందూ సమాజంలోనికి బయటివారు సగౌరవంగా ప్రవేశించగల మార్గం ఇప్పటి వరకు తెరుచుకోలేదు. కులవ్యవస్థకు బయటికి పోయే పెరటి ద్వారం తప్ప, లోపలికి ప్రవేశించే సింహద్వారం లేదు.

గ్యాడ్జెట్ యాప్ తలాఖ్ వివాదం మొదలయ్యాక చాలా మందికి కొత్త ఉపాధి దొరికింది. వాళ్ళు ముస్లిం మహిళ మీద సానుభూతి పేరుతో ముస్లిం సమాజాన్ని పరమ అనాగరికంగా చిత్రించే పనిలో పడ్డారు. ఈ జియస్‌టి తరం స్త్రీజనోద్ధారకుల్లో ఢిల్లీలో కేంద్ర మంత్రుల నుండి గల్లీల్ల చిన్న లీడర్ల వరకు అందరూ వున్నారు. వీళ్లంతా చాకచక్యంగా దాచే ప్రయత్నం చేసిన వాస్తవం ఒకటుంది. మన దేశంలో విడాకులు పొందిన ముస్లిం మహిళలకన్నా హిందూ మహిళలు మూడు రెట్ల కన్నా ఎక్కువ. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో విడాకులు పొందిన హిందూ మహిళలు 6,81,529మంది; ముస్లిం మహిళలు 2,12,074 మంది.

విడాకులు పొందిన హిందూ పురుషులు 3,44,281మంది వుంటే ముస్లిం పురుషులు 57,535 మంది వున్నారు. అంటే ఆరవ వంతు. హిందూ సమాజంలో భర్తలకు భార్యలు విడాకులిచ్చే కేసు ఒకటుంటే, భార్యకు భర్తలు విడాకులిచ్చే కేసులు రెండు వుంటున్నాయి. ముస్లిం సమాజంలో భర్తలకు భార్యలు విడాకులిచ్చే కేసు ఒకటుంటే, భార్యకు భర్తలు విడాకులిచ్చే కేసులు నాలుగు వుంటున్నాయి. ఈ నిష్పత్తి ముస్లిం సమాజంలో ఎక్కువగా వున్నమాట వాస్తవం. అయితే, మరి కొన్ని అంశాలతో కలిపి ఈ గణాంకాలను పరిశీలించాల్సి వుంటుంది.

ముస్లిం సమాజంలో విడిపోవాలనుకున్నప్పుడు పురుషులు వెంటనే విడాకులు ఇచ్చేస్తారు. ఇతర సమాజాల్లో విడాకులు ఇవ్వకుండానే భార్యల్ని వదిలివేసే సాంప్రదాయం వుంది. విడాకులు పొందకుండా, భర్త తమను వదిలేశాడో లేదో తేలని కేసులు అనేకం వున్నాయి. ముస్లిం సాంప్రదాయంలో పెళ్ళి అనేది ‘‘దేవతలు చేసింది స్వర్గంలో నిర్ణయం అయింది జన్మజన్మల బంధం వంటి శాశ్వత అనుబంధంకాదు. అదొక ఇహలోక ఒప్పందం. ఒప్పందం అనుకున్నపుడు కలవడం విడిపోవడమూ వుంటుంది.

ముస్లిం సమాజంలో కన్యత్వ పట్టింపు లేకపోవడం ఒక గొప్ప విశేషం. పునర్ వివాహ సాంప్రదాయం అనాదిగా వుంది. విడాకులు పొందిన స్వల్పకాలంలోనే అమ్మాయికి మళ్ళీపెళ్ళి చేసే సాంప్రదాయమూ కొనసాగుతోంది. ముస్లిం పర్సనల్ లా చర్చకు వచ్చినపుడు సహజంగానే ఉమ్మడి పౌరస్మృతి కూడా చర్చకు వస్తుంది. అహింస లాగ ఉమ్మడి పౌరస్మృతి అనేది ఒక ఆశయమేగానీ ఆచరణకాదు.

భారత ఉపఖండంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వలస పాలన ఆరంభమయిన కొత్తలోనే గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ 1772లో భారతదేశంలో పౌరస్మృతిని రూపొందించడానికి ఒక ప్రయత్నం చేశాడు. ముస్లిం సమాజానికి ఖురాన్ వంటి పవిత్ర గ్రంథం, షరియాహదీస్ వంటి పౌరస్మృతి వున్నట్టు హిందూ సమాజానికి లేవు. వేదాలను, రామాయణ, మహాభారత ఇతిహాసాలను స్మృతులుగా భావించడం కుదరలేదు. మరో గవర్నర్ జనరల్ విలియమ్ బెంటింక్, విద్యావేత్త థామస్ మెకాలే హిందూ సమాజానికి ఒక పౌరస్మృతిని క్రోడీకరించడానికి పూనుకున్నారు. మనుస్మృతినే ఆంగ్లోహిందూ పౌరచట్టంగా గుర్తించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. ఇరవయ్యవ శతాబ్దం ఆరంభంలో విలియం జోన్స్ మనుస్మృతిని ఇంగ్లీషులోనికి అనువదించాడు. అప్పటి నుండి అదే అధికారికంగానో అనధికారికంగానో హిందూ పౌరస్మృతిగా కొనసాగింది.

జాతీయోద్యమం ఊపందుకున్న కాలంలో, భావి భారత రాజ్యాంగానికి రూపకల్పన జరుగుతున్న సమయంలో మనుస్మృతి చర్చనీయాంశంగా మారింది. కొన్ని వివాదాస్పద అంశాలను తొలగించి మనుస్మృతిని హిందూ పౌరస్మృతిగా భావించవచ్చని మహాత్మా గాంధీజీ భావించారు. అప్పుడే కొత్తగా ఆవిర్భవించిన ఆర్‌ఎస్‌ఎస్ సహితం మనుస్మృతిని హిందూ పౌరస్మృతిగా ప్రచారం చేసింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందుకు భిన్నంగా స్పందించారు. కులవ్యవస్థకు పునాది వేసిందే మనస్మృతి అని ఆయన దుయ్యబట్టారు. 1927 డిసెంబరు 25న మనుస్మృతి గ్రంథాన్ని నడివీధిలో అంబేద్కర్ తగులబెట్టారు.

భారత త్రివర్ణ పతాకాన్ని అపశకునంగా విమర్శించినట్టే ఆర్‌ఎస్ఎస్ భారత రాజ్యాంగాన్ని కూడా తీవ్రంగా విమర్శించింది. రాజ్యాంగ రూపశిల్పులు మనుస్మృతిని మరచిపోవడం చారిత్రక నేరం అంది. భారత రాజ్యాంగం అమల్లోనికి వచ్చిన పక్షం రోజుల్లో విడుదలైన ఆర్ఎస్ఎస్ అధికారిక పత్రిక ఆర్గనైజర్ మనువు మన హృదయాలను ఏలుతున్నాడు అనే వ్యాసాన్ని ప్రచురించింది.

ఉమ్మడి పౌరస్మృతి అంటే ఆచరణలో ఖురాన్, షరియా, బైబిల్, మనుస్మృతుల్ని క్రోడీకరించి ఒక పౌరస్మృతిని రూపొందించడం అని అర్థం. ఏ గ్రంథం నుండి ఏ అంశాన్ని స్వీకరించాలి అనేది సామాజిక అవసరాలమీద కాక రాజకీయ ప్రాబల్యాల మీద ఆధారపడి వుంటుందని కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. కేంద్రంలో ఇప్పుడు అధికారంలో వున్న రాజకీయశక్తులు ఉమ్మడి పౌరస్మృతి రచనకు పూనుకుంటే అది ముస్లింలకు వ్యతిరేకంగా వుంటుందని కూడా చెప్పనక్కరలేదు. అలాంటి ఉమ్మడి పౌరస్మృతి ఆమోదయోగ్యమూకాదు.

✻ ఏ.యం.ఖాన్ యజ్దానీ (డానీ)
(రచయిత ముస్లిం ఆలోచనాపరుల వేదిక జాతీయ కన్వీనర్)
9010757776

నిరంకుశ పాలనవైపు?

ఎడిటర్‌కు లేఖలు

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరంకుశ పాలన పునారావృతం అవుతోందా? ప్రతిపక్షాలు ఏం మాట్లాడినా ముఖ్యమంత్రి సహించడం లేదు. రాష్ట్రంలో ఆయనకు సత్యం సహించరానిదవుతోంది. ప్రజాస్వామ్యంలో పత్రికలకున్న స్వేచ్ఛను సైతం తప్పు పడుతున్నారు. ప్రతిపక్షాలు, ప్రశ్నించే వ్యక్తులు, ప్రజాసంఘాలు ప్రభుత్వ పాలనలోని లొసుగులను ఎత్తిచూపినా, మాట్లాడినా, లేదా ప్రశ్నించినా కూడా ప్రభుత్వం అగ్గిమీద గుగ్గిలం అవుతోంది.

నేరెళ్ల ఘటనలో కాంగ్రెసు పార్టీ జోక్యం నేపథ్యంలో కెసిఆర్ ప్రెస్‌మీట్ పెట్టి మరీ కాంగ్రెసుపై విరుచుకుపడ్డారు. పనిలో పనిగా కమ్యూనిస్టులపై, వామపక్ష భావజాలం కలిగిన పత్రికలు, ఛానల్స్‌పై ఫైర్ అయ్యారు. ముఖ్యంగా నవతెలంగాణ, వామపక్ష పత్రికలు, ఛానల్స్ రాస్తున్న రాతలపై కెసిఆర్ మార్కు మాటలను మాట్లాడారు. కమ్యూనిస్టులు, ఇతర ప్రతిపక్షాలు ఎక్కడున్నాయంటూ ఆగ్రహించారు. సిఎం ఫైర్ అయిన మరునాడే పోలీసులు మీడియా ప్రతినిధులపై కెమెరాలు కిందపడేలా నెట్టివేయడం జరిగింది. (ప్రగతి భవన్ ఎదుట కాంట్రాక్టు ఉద్యోగుల నిరసనలో 10టివి రిపోర్టర్‌ను పోలీసులు నెట్టివేస్తూ దురుసుగా ప్రవర్తించడం) ఆందోళన చేస్తున్న మహిళా కాంట్రాక్టు ఉద్యోగులను మగ పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. 10టివి మహిళా రిపోర్టర్, ఇతర మీడియా ప్రతినిధులను రాయలేని రీతిలో దుర్భాషలాడారు. ఈ సంఘట నను రాష్ట్రం కళ్లారా తిలకించింది. ఈ చర్యలన్ని ఏం సూచిస్తున్నాయి?

ఖచ్చితంగా ప్రభుత్వ అండతో పోలీసులు రాష్ట్రంలో రెచ్చిపోతున్నారనేది స్పష్టం చేస్తున్నాయనడంలో సందేహం లేదు. దళితులపై దాడులు జరిగినప్పుడు గానీ, పరువు హత్య లు జరిగిన సందర్భంలో గానీ ప్రభుత్వం బాధితుల వైపు కాకుండా అగ్రవర్ణ దొరతనానికి అండగా ఉందనే దానిని తేటతెల్లం చేశాయి.

టిజెఎసి ఛైర్మన్ కోదండరాం మాట్లాడినా.. కెసిఆర్‌కు రుచించడం లేదు. టిజెఎసి, వామపక్షాలు, ప్రజా సంఘాలు ధర్నా చౌక్ ఎత్తివేతను నిరసించినా, నిరుద్యోగులకు అండగా మాట్లాడినా సమస్యలపై ఆందోళనలకు టిజెఎసి పిలుపునిచ్చిన సందర్భాల్లో ప్రొఫెసర్ కోదండరాం పట్ల, వామపక్షాల పట్ల, ప్రజాసంఘాల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరు నియంతృత్వ పాలనను గుర్తు చేస్తున్నది. అంతే కాదు ‘నేను ఇంత కాలం మౌనంగా ఓపికగా ఉన్నా..

ఇక పాత కెసిఆర్‌ను చూస్తారు’ అంటూ ముఖ్యమంత్రి కెసిఆర్ తన మార్కు బెదిరింపును రాష్ట్రంలో ఒదిలారు. దీని అర్థం ఏంటి? రాష్ట్రంలో తనకు ఎవరు ఎదురు మాట్లాడినా ఊరుకునేది లేదని స్వయంగా ముఖ్యమంత్రే స్పష్టం చేస్తున్నారు. ఈ చర్యలు ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామ్య పాలనకు నష్టం.

పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. మాట్లాడే గొంతులను అణగతొక్కేందుకు దానిని బలమైన శాఖగా అన్ని రకాలుగా రూపు దిద్దుతున్నారు. ఈ స్థితిలో తెలంగాణ సమాజం జాగృతం కావాల్సిన అవసరముంది. కేవ లం అభివృద్ధి కోసం కాకుండా ప్రజాస్వా మ్య పరిరక్షణ కోసం, ఆ విలువలను పెంపొందించడం కోసం కూడా ప్రత్యేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతో ఉంది.

– దామెర రవీందర్,
9440448373

ఏది వాస్తవం?

పోలీస్ అకాడమీకి ఉమ్మడి రాష్ట్ర పాలకులు అప్పా, గిప్పా, డప్పా అనే మాదిరి పేర్లు పెట్టారని, తానిప్పుడు దానికి రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి పోలీస్ అకాడమీగా నామ కరణం చేస్తు న్నానని మంగళవారంనాడు రెడ్డి హాస్టల్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రకటించారు.

అప్పాకు 2013లోనే అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి పేరును పెట్టినట్లు చదివాము. ఇప్పుడు మళ్లీ కెసిఆర్ ఈ ప్రకటన చేశారు. ఏది వాస్తవం.

– విజయ్,
హైదరాబాద్





మన తెలంగాణ
5
హైదరాబాద్
గురువారం
24, ఆగస్టు, 2017
www.manatelangana.news

సుప్రీం తీర్పు గొప్ప ఓదార్పు

పెద్ద ఎత్తున ప్రచారం అవసరం



ముస్లిం మహిళలకు న్యాయం కల్పించే మొదటి తీర్పు ఇది. ట్రిపుల్ తలాక్ నిషేధాన్ని మేం ఎప్పటి నుంచో కోరుకుంటున్నాం. ట్రిపుల్ తలాక్ మానవహక్కులపైనే కాకుండా మహిళల రాజ్యాంగహక్కులకు భంగం కలిగిస్తుంది. ఎన్నో ఏళ్ల తర్వాత వచ్చిన ఈ తీర్పును అభినందించాలి. దీనిపై ప్రతి ముస్లిం మహిళకు, ముస్లిం కుటుంబాలకు తెలియాలి. దానికోసం పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి. అందరికీ దీని గురించి అవగాహన కల్పించాలి. ఫోన్‌లో, వాట్సప్ మెసేజ్‌లలో ట్రిపుల్ తలాక్ చెప్పారంటూ మా దగ్గరకు చాలా కేసులు వచ్చాయి. మహిళల సమ్మతి లేకుండా విడాకుల సర్టిఫికెట్లు సులభతరం చేసిన మోసపూరిత క్వాజీలకు వ్యతిరేకంగా ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు చర్యలు తీసుకోవాలి.

త్రిపురాన వెంకట రత్నం,
చైర్‌పర్సన్ స్టేట్ విమెన్ కమిషన్

ముస్లిం మహిళలకు వరం

అద్భుతమైన నిర్ణయం. అతిసామాన్య మధ్యతరగతి మహిళలకు ఈ తీర్పు చాలా ఉపయోగకరం. హఫీజ్, మహమ్మద్ ప్రకారం ముస్లిం మతంలో మహిళకు సముచితమైన స్థానం ఉంది. పురుషుడు నాలుగు పెళ్లిళ్లు చేసుకోవచ్చన్నది కూడా దాన్లో ఉంది. అప్పటి యుద్ధ పరిస్థితుల్లో వితంతు మహిళలకు సమాజంలో గౌరవం, రక్షణ కల్పించేందుకు ఏర్పాటుచేసిన చట్టం నాలుగుపెళ్లిళ్లు, కాని నేడు దాన్ని ఎవరికి తోచిన రీతిలో వారు వాడుతున్నారు. దీంతో పేద, మధ్య తరగతి మహిళలు ఇబ్బంది పడుతున్నారు. చట్టాల్లో మార్పు రావల్సిన అవసరం ఉంది. నాలుగు పెళ్లిళ్ల సంప్రదాయానికి మా కుటుంబం కూడా బలైంది, మా ఆడపడుచును పొద్దున వివాహం చేసుకున్న వ్యక్తి, సాయంత్రానికి మరో వివాహం చేసుకోవడం ఈనాటికీ మమ్మల్ని బాధిస్తుంది. పేద, మధ్యతరగతి ముస్లింల జీవితాల్లో మార్పు రావాలంటే చట్టాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది.



అఫ్జల్ బేగం, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, అశ్వారావుపేట నియోజకవర్గం

ముస్లిం మతంలో విడాకులకు అనుసరిస్తున్న 'ట్రిపుల్ తలాక్' ఆచారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ముస్లిం మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దేశమంతటా ముస్లిం మహిళలు ఆనందం వెలిబుచ్చారు. సున్నీ ముస్లింలలో తలాక్ పద్ధతి ఎక్కువగా ఉంది. బానో కేసు నాటి నుంచి వివాదంగా కొనసాగుతున్న ఈ అంశానికి ఇప్పుడు అంతిమంగా తెరపడింది. అనేక ఏళ్ల నుంచి తలాక్‌పై పోరాటం జరుగుతున్న నేపథ్యంలో ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ముస్లిం మహిళలకు మానసిక దన్ను చేకూర్చేలా వుందని చెప్పవచ్చు. వీరి ఆత్మగౌరవం, స్వావలంబనకు ఈ తీర్పు దోహదపడుతుంది. సుప్రీంకోర్టు వెలువరించిన చారిత్రాత్మక తీర్పు పట్ల పలు రంగాల్లోని మహిళలు వారి అభిప్రాయాలను మన తెలంగాణతో పంచుకున్నారు.

అలుసైపోయిన చట్టాలు

ఉలేమాలు, మౌల్వీలు ఈ చట్టాలను రూపొందించిన కారణాలు, పరిస్థితులు వేరు, ఇప్పుడున్న పరిస్థితులు వేరు. మూడుసార్లు తలాక్ అనగానే విడాకులు మంజూరు కావు. దీనికి మూడు నెలల సమయం అవసరం. మొదటిసారి తలాక్ అన్నాక కూడ తిరిగి భార్య, భర్త ఒక్కటయ్యే అవకాశం ఉంటుంది. భర్త ఆర్థికంగా సంపన్నుడైనప్పుడు ఈ చట్టాన్ని తప్పుగా వాడుకునే అవకాశం ఉంటుంది. తలాక్ పొందిన మహిళకు భర్త భరణం ఇవ్వాల్సి ఉంటుంది, పిల్లలుంటే వారి పోషణకు కూడా భరణం ఇవ్వాలి, ఈ చట్టంలో మహిళకున్న వెసులుబాటు ఇదొక్కటే. ఖుల్లా ఇది భార్య భర్తను నిరాకరించే పద్ధతి, దీన్లో మహిళకు భరణం దొరకదు. అయితే అప్పటి అభద్రతా పరిస్థితుల్లో ఒక మగవాడు నాలుగు పెళ్లిళ్లు చేసుకోవచ్చని చెప్పడం జరిగింది. దానికి మొదటి భార్యకు విడాకులివ్వాల్సిన అవసరం కూడా లేదు. యుద్ధ సమయంలో పురుషులు మరణించి, మహిళల జనాభా ఎక్కువగా ఉన్నప్పుడు చేసిన చట్టం ఇది. పూర్తిగా మహిళలకు రక్షణ కల్పించేందుకు ఏర్పాటుచేసిందే, కాని ఈ చట్టాన్ని తప్పుగా వాడుతున్న వారే అధికంగా ఉన్నారు. ఇలాంటి చట్టాల్లో కూడా మార్పు రావల్సిన అవసరం ఉంది. ఏమైనా ఈ మార్పు ఆహ్వానించదగ్గదే.

మొహసినా మొబీన్, ప్రిన్సిపల్, ఎక్సెల్‌ఎడ్జ్ స్కూల్, హైదరాబాద్.



అత్యుత్తమ తీర్పు

ఇప్పటివ రకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుల్లో ఇది అత్యుత్తమమైంది. ఏ సమయంలో ఏమౌతుందో అనే భావనతో చాలా మంది ముస్లిం మహిళలు మానసిక సంఘర్షణకు లోనయ్యేవారు. ఈ తీర్పు వారికి చాలా ఊరటనిస్తుంది. ఏ మతానికి చెందిన పద్ధతైనా మానవాళికి మేలుచేసేదిగానే ఉంటుంది. వ్యవస్థ నడవడానికి ఆడా, మగా ఎలా అవసరమో, వారికి ఉపయోగపడే చట్టాలు కూడా అంతే అవసరం.

ఏ మతంలోనైనా మహిళకు సమ ప్రాధాన్యత కల్పిస్తూనే చట్టాలు రూపొందించారు, కాకుంటే వీటిని తప్పుగా వాడుకునేవారి సంఖ్య పెరిగింది. ఇటువంటివారిలో ఎక్కువమంది మగవారుండడంతో మహిళా హక్కులకు భంగం వాటిల్లుతోంది. ఏ చట్టాన్నైనా తప్పుగా వాడుకునేవారికి ఇలాంటి తీర్పులు చెక్ పెట్టినట్లవుతాయి. ఆహ్వానించదగ్గది ముఖ్యంగా తీర్పునిచ్చిన బెంచ్‌లో ముస్లిం న్యాయమూర్తి ఉండడం మంచి పరిణామం. మతాన్ని అడ్డం పెట్టుకొని, చట్టాల ఆసరాతో ఆర్థిక అవసరాలు తీర్చుకునేవారికి చెంపపెట్టు ఈ తీర్పు. మహిళా హక్కుల రక్షణకు సంబంధించి ఆశాజనకంగా ఉంది. హిందూ చట్టాల్లో కూడా మార్పు చేయాల్సిన అవసరాలు ఎన్నో ఉన్నాయి.

వానమామలై పూర్ణిమ, అడ్వకేట్, గోదావరిఖని







వరాలిచ్చే దేవుడు... ఆదివరాహస్వామి..!




భక్తులకు అడిగిన వరాలు ఇచ్చే దేవుడుగా మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి చాలా సంవత్సరాలుగా విరాజిల్లుతున్నాడు. చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెంది దైవత్వానికి ప్రతిరూపంగా వెలిసిన ఈ స్వామి వారి దర్శనార్థం రాష్ట్రం నలు మూలల నుంచి నిత్యం అశేష సంఖ్యలో భక్తులు వస్తూ పోతూ ఉంటారు. దశావతారాల్లో ఆదివరాహస్వామి అవతారం ప్రసిద్ధి. విశ్వమంత జలమయమైన సమయంలో మహాసూరీడు హిరాణ్యక్షుడు భూదేవిని చాపగా చుట్టి సముద్ర గర్భంలో దాక్కున్నప్పుడు ఆమెను ఉద్ధరించడం కోసం మహావిష్ణువు ఆదివరాహస్వామి రూపాన్ని ధరించి ఆ హిరాణ్యాక్షుడిని వధించి భూదేవిని రక్షిస్తాడు. ఆది నారాయణుడి అవతారాల్లో ఆదివరాహస్వామి అవతారం మూడవది. వరాహ స్వామికి మన దేశంలో ఆలయాలు చాలా తక్కువ.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల తిరుపతి దేవాస్థానంలో ఒకటి ఉండగా మన తెలంగాణ రాష్ట్రంలో కేవలం ఒకటి అది పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం పరిధిలోని కమాన్‌పూర్ మండలంలో ఉండటం విశేషం. తిరుమలలో తర్వాత పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఒక బండరాయిపై ఆదివరాహస్వామి విగ్రహం వెలిసింది. వరాల సిద్ధిగా.. భక్తులకు అభయంగా జిల్లాకు తూర్పు దిశగా గత 40 సంవత్సరాల క్రితం ఒక చిన్న బండ రాయిపై చిన్న ఎలుక ఆకారంలో వెలువగా, అది ప్రస్తుతం నాలుగు ఫీట్లకు పైగా పెరిగి వరాహస్వామిగా దర్శనమిస్తోంది. ఆదివరాహస్వామి నడిచి వచ్చిన పాదాల ఆనవాళ్లు పక్కనే ఉన్న బండరాయిపై దర్శనమిస్తాయి. అయితే ఇది సాక్ష్యాత్తూ ఆ దేవుని ప్రత్యేక్ష రూపంగా శాసనాల హితవు. స్వామి వారికి నిత్యం పూజలు, అభిషేకం, అర్చనలను ఆలయ పూజారి జగన్నాధాచార్యులు నిర్వహిస్తూ ఉంటారు. ఆదివరాహ స్వామి ఆలయ ఆవరణలో గత కొన్ని సంవత్సరాల క్రితం దాతల విరాళాలతో కళ్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ కళ్యాణ మండపంలో అధిక సంఖ్యలో శుభ కార్యాలు జరుగుతూ ఉంటాయి. ఉగాది పర్వదినాన సుమారు 30 వేల మందికి పైగా భక్తులు, శ్రావణ మాసంలో నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు తెలంగాణ రాష్ట్ర నలు మూలల నుంచి తరలి వచ్చి ఆదివరాహస్వామిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకుంటారు. కోరిన కోర్కెలు తప్పక నేరవేరుతాయనే ప్రగాఢ నమ్మకం తెలంగాణ నలుమూలల వ్యాపించడంతో మన రాష్ట్రం నుంచే కాక పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆదివరాహస్వామిని దర్శించుకుంటారు. ఇటీవలే తెలంగాణ శాసనసభ డిప్యూటి స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి ఆదివరాహస్వామిని దర్శించుకొని 108 ప్రదక్షణలు చేసి, తన మొక్కు చెల్లించుకున్నారు. ఇన్ని మహిమలు కలిగిన చారిత్రాత్మక నేపథ్యం గల ఆదివరాహస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాల క్రితమే దేవాదాయ శాఖ కిందకు తీసుకోనప్పటికినీ విస్తృత ప్రచారం చేయడంలో గానీ, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడంలో గానీ చొరవ చూపడం లేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ సర్కార్ ఆదివరాహస్వామి దేవాలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని భక్తులు కోరుతున్నారు.

– మాటేటి కుమార్,మంథని రిపోర్టర్ / మన తెలంగాణ






జీర్ణక్రియను పెంచే అంజీర



కొంచెం వగరు, కొంచెం తీపి, కొంచెం పులుపు ఉండే అంజీర్ డ్రైఫ్రూట్ ఏడాది పొడుగునా మార్కెట్‌లో లభ్యమవుతూనే ఉంటుంది. వీటిల్లో పిండి, చక్కెర పదార్థాలు ఎక్కువ. సి, ఎ, బి6 విటమిన్లు , పొటాషియం, కాల్షియం పుష్కలం. సోడియం, మెగ్నీషియం, ఫాస్పరస్‌లాంటి ఇతర ఖనిజ లవణాలు కూడా తగు మోతాదులో ఉన్నాయి. జీర్ణక్రియను వేగవంతం చేయడంలో అంజీర్ బాగా ఉపయోగపడుతుంది. బరువు తగ్గడానికి , ఎముకలు బలంగా ఉండేలా చేస్తాయి. గుండెజబ్బులు, క్యాన్సర్‌లకు మంచి ఔషధం. కాల్షియం పీచు రూపంలో ఉండేది అంజీర్‌లో మాత్రమే. రోగనిరోధక శక్తిని పెంచే డ్రైఫ్రూట్ ఇది. శరీరానికి అవసరమైన శక్తిని వేగంగా అందిస్తాయి. ఏ వ్యాధితో బాధపడుతున్నవాళ్లయినా అంజీర్‌ను తీసుకుంటే త్వరగా కోలుకుంటారు. జ్వరం వచ్చి తగ్గిన వెంటనే రెండు అంజీర్లను తింటే నోటికి రుచి, ఒంటికి శక్తి వస్తాయి. మలబద్ధకాన్ని నివారిస్తుంది. కొంతమందికి శ్వాస మార్గంలో కఫం పేరుకుపోయి గాలి పీల్చుకోవడం కష్టమౌతుంది. ఇవి తినడం వల్ల సమస్య తొలగుతుంది. పొటాషియం, మినరల్స్ ఎక్కువగా ఉండటం వల్ల అధిక రక్తపోటును క్రమబద్ధీకరిస్తుంది. నోటిపూతలాంటి సమస్యలుంటే ఇవి తింటే సరిపోతుంది. నిద్రలేమిని దూరం చేయడంలో వీటి పాత్ర అమోఘం. పడుకునే ముందు రెండు మూడు అంజూర్లను తిని పాలు తాగితే మంచి నిద్ర పడుతుంది. మధుమేహం ఉన్నవారు ఉదయం అల్పాహారంలో రెండు అంజీరలను తీసుకోవచ్చు. చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించి మంచి కొలస్ట్రాల్‌ను పెంచుతుంది.

ఒక్క అబద్ధం ఉన్నా ముక్కు నేలకు రాస్తా : వంశీచంద్ రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణలో అత్యంత సంస్కార హీనుడు, అందరికన్నా కుసంస్కారి సిఎం కెసిఆర్ అని కాంగ్రెస్ ఎంఎల్ఎ చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. టిఆర్ఎస్ నాయకులను ఒక్కసారి దుర్భాషలాడితే తాను సంస్కార హీనుడనైతే అనేక వందల సార్లు ఇష్టానుసారంగా దుర్భాషలాడిన, అసభ్యంగా మాట్లాడిన ముఖ్యమంత్రిని మీరు ఏమంటారని ఆయన ప్రశ్నించారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. టిఆర్ఎస్ నాయకుల లెక్కలో తెలంగాణలో అత్యంత సంస్కార హీనుడు, అందరికన్నా కుసంస్కారి కెసిఆర్ అవుతారా? ప్రజా ప్రయోజనాలను, రైతుల పక్షం వదిలి కల్వకుర్తి ఆయకట్టు తొలగిస్తే మాట్లాడక, మనకు హక్కు ఉన్న నీటిని అక్రమంగా తరలిస్తే మాట్లాడే ధైర్యం చేయక మన ప్రాంతానికి ద్రోహం చేసే వ్యక్తికి గులాంగిరి చేస్తే 'చెంచా' అనక, ప్రాంతానికి మోసం చేసేవారిని 'ద్రోహి' అనక ఏమనాలో మీ ముఖ్యమంత్రిని అడిగి చెపాలని ఆయన వ్యాఖ్యానించారు. తాను ప్రస్తావించిన అంశంలో ఏ ఒక్క అబద్ధం ఉన్న ముక్కు నేలకు రాయడానికి సిద్ధమన్నారు. ఈ ఏడాది జనవరి 25వ తేదీన విడుదల చేసిన ఉత్తర్వులు ద్వారా కల్వకుర్తికి నిరదించే డిబి82 కాలువ సామర్థ్యాన్ని తగ్గించి 37,742 ఎకరాల ఆయాకట్టుని తొలగించింది వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు.

రైల్వే కాంట్రాక్టర్ల ప్రదర్శన

మన తెలంగాణ / హైదరాబాద్ : రైల్వే కాంట్రాక్ట్ పనుల్లో జూన్ 30 తేదీకి ముందు కేటాయించిన టెండర్లకు పాత పన్ను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే కాంట్రాక్టర్లు బుధవారం రైల్ నిలయం, సంచాలన్ భవన్, హైదరాబాద్ భవన్ల వద్ద ప్రదర్శనలు నిర్వహించారు. ఇండియన్ రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు దక్షిణ మధ్య రైల్వే జోనల్ కాంట్రాక్టర్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు అఫ్సర్ రియాజ్ మాట్లాడుతూ జులై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన జిఎస్‌టి పన్ను విధానాన్ని గతంలో కేటాయించిన పనులకు కూడా అమలు చేయడం వల్ల తమపై దాదాపు రూ.400 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. కొత్త జిఎస్‌టి అమలు వల్ల దక్షిణ మధ్య రైల్వేలో జరుగుతున్న రూ.3 వేల కోట్ల విలువైన వివిధ పనులపై ప్రభావం పడుతుందని, పాత పనులకు పాత విధానాన్ని అమలు చేయాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి కె.సురేందర్‌రావు మాట్లాడుతూ ఈ సమస్యను ఇప్పటికే జిఎస్‌టి కౌన్సిల్‌కు, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, రైల్వే మంత్రి సురేష్ ప్రభు, రైల్వే బోర్డు చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.

తెగిన చేయిని అతికించిన వైద్యులు

మన తెలంగాణ/హైదరాబాద్ : పని చేసే చోట మణికట్టు నుండి తెగిపడిన చేయిని ప్లాస్టిక్ మైక్రోవాస్క్యులార్ సర్జరీలతో పునరుద్ధరించినట్లు యశోద హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. రీప్లాంటేషన్ ద్వారా పూర్తిగా తెగిపడిన భాగాన్ని యధాస్థానంలో అతికించచ్చని సోమాజీగూడ యశోద హాస్పిటల్ సీనియర్ ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్ డాక్టర్ శశికాత్ ముద్దు, సీనియర్ వాస్క్యులార్ సర్జన్ డాక్టర్ దేవేందర్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. చికిత్సకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చౌటుప్పల్ రబ్బర్ ఫ్యాక్టరీల పని చేస్తున్న కార్మికుడు అఖిలేష్ యాదవ్ (18)ను మణికట్టు వరకు తెగిన ఎడమ చేతితో 10 గంటలు ఆలస్యంగా హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. తొలుత స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో తెగిన చేతిని సెలైన్ ద్రవంలో ఉంచి మొత్తాన్ని ఐస్ బాక్స్‌లో భద్రపరిచి తరలించారు. రోగి ఎముక భాగాన్ని స్థిరీకరించిన వైద్యులు, రక్త సరఫరాను పునరుద్ధరించారు. రక్తప్రసరణ పూర్తిగా సాధారణ స్థాయికి చేరాక కండరాలు, టెండన్లు, నాడులను అతికించారు. శస్త్రచికిత్సకు 8 గంటల సమయం పట్టింది. 48 గంటల్లో బాధితుడు ఎడమచేతి వేళ్లను కదిలించగలిగాడు. రెండు వారాల చికిత్స తర్వాత రోగిని డిశ్చార్జి చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.దాడికి గురైన భూనిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు యుప్పట్ల శ్రీనివాస్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తొలుత సమావేశం ప్రారంభం కాగానే జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై వివరణ ఇచ్చి రైతులు,ప్రజలు తమ అభిప్రాయాలను తెలుపాలని కోరారు. టిఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎంపిపిలు, జడ్‌పిటిసిలు,సర్పంచ్‌లు,ఎంపిటిసిలు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని, తెలంగాణప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు ప్రజలు,రైతులు తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడారు.అనంతరం పెద్దపల్లి జిల్లా భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు యుప్పట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కాళ్వేరం ప్రాజెక్టు వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతారని, 30రోజులు సాగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణను మూడు రోజుల్లో ముగించడంలో అంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. సుందిళ్ల,అన్నారం,మేడిగడ్డ బ్యారేజిలకు భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటి వరకు పూర్తి నష్టపరిహారం చెల్లించ లేదని ఆరోపించారు. ఇదే సమయంలో మాజీ మంత్రి శ్రీధర్‌బాబు నాయకులు,కార్యకర్తలతో సమావేశంలోకి అడుగిడడంతో పరిస్థితి అదుపు తప్పింది. కాంగ్రెస్ కార్యకర్తలు ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కోపోద్రిక్తులైన టిఆర్ఎస్ వర్గాలు ఒక్క సారిగా దాడికి దిగారు. కుర్చీలు గాలిలోకి విసురుతూ కాంగ్రెస్ కార్యకర్తలను చితక బాదారు.కాంగ్రెస్ టిఆర్స్ వర్గాలు పరస్పరం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. కాగా ఈ దాడిలో భూనిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు యుప్పట్ల శ్రీనివాస్‌తో పాటు మంథని మండలం గంగాపురి ఎంపిటీసి పోలు శివ,మంథని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్‌లు గాయపడ్డారు. అనంతరం ఏకపక్షంగా సాగిన ప్రజాభిప్రాయ సేకరణ టిఆర్ఎస్ సమావేశాన్ని తల పించింది. ఐడిసి చైర్మన్ ఈద శంకర్ రెడ్డి, పలువురు టిఆర్ఎస్ ఎంఎల్ఎలు,ఎంఎల్‌సిలు,పెద్దపల్లి ఎంపితో పాటు అధికారులు మాట్లాడి తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిందనిపించారు.

మంద బలంతో ప్రజల గొంతు నొక్కారు : శ్రీధర్ బాబు

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులను మాట్లాడనీయకుండ టిఆర్ఎస్ భౌతిక దాడులకు దిగి మందబలంతో ప్రజల గొంతు నొక్కిందని మాజీ మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు.

మరో రైలు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

నుండి ఢిల్లీ వెళ్తున్న ఆ రైలు బుధవారం తెల్లవారుజామున 2.50 గంటల ప్రాంతంలో పతా–అచ్చాల్దా స్టేషన్ల మధ్య అరియా వద్ద లోడ్‌తో వెళ్తున్న ఒక టిప్పర్‌ను ఢీకొంది. దాంతో అది పట్టాలు తప్పిందని ఉత్తర మధ్య రైల్వే (ఎన్‌సిఆర్) ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ఈ రైలులోని తొమ్మిది బోగీలు పట్టాలు తప్పినట్లు రైల్వే శాఖ పిఆర్‌ఓ అనిల్ సక్సేనా తెలిపారు. ఈ ఘటనలో 100 మంది గాయపడగా వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని యుపి హోం శాఖ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తెలిపారు. అరియా జిల్లా ఎస్‌పి సంజీవ్ త్యాగి కూడా 74 మంది గాయపడ్డారని చెప్పారు. క్షతగాత్రులను సైఫై, ఇతావాహ్ ఆస్పత్రులకు హుటాహుటిన తరలించి, చికిత్సను అందిస్తున్నామని ఆయన చెప్పారు. మరోవైపు ప్రమాదం గురించి తెలుసుకున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో పాటు అలహాబాద్ నుండి ఒక మెడికల్ రైలు, మరో సహాయక చర్యల రైలును కూడా ఘటనాస్థలికి తరలించారు. ఈ ఘటనపై రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తాజా పరిస్థితిని తానే వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నానని, సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించానని ఆయన చెప్పారు. ఒక అనధికారిక ఇసుక టిప్పర్ రైలు ఇంజిన్‌ను ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనలో ఎవరూ మరణించలేదని, 25 మంది మాత్రమే గాయపడ్డారని అందులో పేర్కొంది.

ఈ ఘటనతో హౌరా–న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ సహా ఐదు రైళ్లను దారిమళ్లించారు. కాన్పూర్–న్యూఢిల్లీ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ సహా ఏడు రైళ్లను రద్దు చేశారు. అంతేకాక యుపిలో మరో 40 స్థానిక రైళ్లను కూడా దారి మళ్లించారు. ఐదు రోజుల వ్యవధిలో రెండు రైలు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో రైల్వే బోర్డు ఛైర్మన్ ఎకె మిట్టల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు మంత్రి సురేష్ ప్రభుకు రాజీనామా లేఖను సమర్పించారు. అయితే దానిపై మంత్రి ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. కాగా, గత శనివారం సాయంత్రం యుపిలోని ఖతౌలి వద్ద ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 23 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా 156 మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే.

రూపన్‌వాలా కమిషన్ నివేదికను ఆమోదించవద్దు


విచారణకు కొత్త కమిషన్ వేయాలి : పలువురి డిమాండ్



మన తెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యపై అశోక్ కుమార్ రూపన్‌వాలా కమిషన్ సమర్పించిన నివేదికను పార్లమెంటు ఆమోదించవద్దని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు చుక్కా రామయ్య, సీనియర్ పాత్రికేయులు మల్లేపల్లి లక్ష్మయ్య, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ డైరెక్టర్ డాక్టర్ వై.బి.సత్యనారాయణ, హెచ్‌సియు ప్రొఫెసర్ లక్ష్మినారాయణ, స్టూడెంట్స్ ఫర్ సోషల్ జస్టీస్ నాయకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. విచారణ కోసం కొత్త కమిషన్‌ను వేయాలని వారు డిమాండ్ చేశారు. కమిషన్ ఏర్పాటుకు ఉద్దేశించిన నిబంధనలు, సూచనలను పట్టించుకోకుండా సమర్పించిన నివేదిక తప్పుల తడకగా ఉందని అన్నారు. పార్లమెంటు సభ్యులు దీన్ని వ్యతిరేకించాలని వారు డిమాండ్ చేశారు.

కాకి మాధవరావు మాట్లాడుతూ, రోహిత్ వేముల కులాన్ని ప్రస్తావించడం ద్వారా కమిషన్ హద్దు మీరిందన్నారు. రోహిత్ కులానికి, కమిషన్ ఏర్పాటు ఉద్దేశానికి సంబంధం లేకపోయినా 11 పేజీలు ఆయన కుల ప్రస్తావనతో నింపారన్నారు. విచారణకు ఎవ్వరిని పిలిచారనేది బ్రహ్మ రహస్యమని అన్నారు. సంఘటనతో ప్రభావానికి గురైన వారిని పరిగణలోకి తీసుకోలేదన్నారు. వారికి పనికొస్తాయనుకున్నే వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకున్నారన్నారు. రోహిత్ తల్లి రాధిక వేముల వడ్డెర కులమని చెప్పినట్టు నివేదికలో తప్పుడుగా పేర్కొన్నారన్నారు. రాధిక వేములను పెంచుకున్న తల్లి అంజనీదేవి స్టేట్‌మెంట్‌ను పరిగణలోకి తీసుకోలేదన్నారు. చుక్కా రామయ్య మాట్లాడుతూ, ఆత్మహత్యకు కారకులైన వారిని రక్షించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. హెచ్‌సియు విసిని కాపాడేందుకే ఈ నివేదిక తయారైందని ఎద్దేవా చేశారు. ప్రొఫెసర్ లక్ష్మినారాయణ మాట్లాడుతూ, ఎబివిపి, అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ విద్యార్థుల నడుమ ఘర్షణ జరిగిన తర్వాత విశ్వవిద్యాలయంలో నిష్పక్షపాత విచారణ జరిపి ఇరు వైపుల విద్యార్థులను హెచ్చరించడంతో సద్దుమణిగిందన్నారు. ఎంఎల్‌సి రామచందర్‌రావు యూనివర్సిటీ సమావేశంలో విద్యార్థులను బహిష్కరించాలని ఒత్తిడి తీసుకువచ్చారన్నారు. రంగారెడ్డి జిల్లా బిజెపి శాఖ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయకు లేఖ రాసిందన్నారు. ఆ లేఖతో దత్తాత్రేయ అప్పటి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీకి లేఖ రాశారన్నారు. ఆ శాఖ నుండి యూనివర్సిటీకి వరసగా ఐదు లేఖలు రావడంతో ఒత్తిడి పెరిగిందన్నారు. దీనితో తొలుత ఇరు వైపుల విద్యార్థులను మందలింపుతో ఆగిపోయిన సమస్య బహిష్కరణకు దారి తీసి అనంతరం రోహిత్ ఆత్మహత్య, వరస సంఘటనలు జరిగాయన్నారు. ఈ వాస్తవాలను రూపన్‌వాలా కమిషన్ పరిగణలోకి తీసుకోకుండా రోహిత్ వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్టు పేర్కొనడం దారుణమన్నారు.

ప్రజలు సహకరించాలి –: రూపన్‌వాలా కమిషన్ న్యాయానికి తూట్లు పొడిచి సత్యాన్ని సమాధి చేసిందని ప్రశాంత్ అన్నారు. బిజెపి తమ జీవితాలను అస్తవ్యస్తం చేసిందన్నారు. ఆత్మహత్యకు నెలముందు రోహిత్ రాసిన లేఖలో స్పష్టంగా విషం ఇమ్మని కోరడం ద్వారా తమ పట్ల జరుగుతున్న అణచివేత తద్వారా తాము ఎదుర్కొంటున్న ఒత్తిడిని పేర్కొన్నారన్నారు. అయితే రూపన్‌వాలా ఆ లేఖకు ఆత్మహత్యకు సంబంధం లేదని పేర్కొనడం దారుణమన్నారు. బిజెపి రూపన్‌వాలాతో తప్పుడు రాతలు రాయించిందన్నారు. న్యాయం కోసం జరిగే పోరాటానికి ప్రజలు కలిసి రావాలని ఆయన కోరారు



సకల భూసర్వే

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటున్నాం అని ముఖ్యమంత్రి వివరించారు. భూ రికార్డులను సరి చేయడానికి, ఆ తర్వాత వాటిని నిర్వహించడానికి, కోర్ బ్యాంకింగ్ లాంటి వ్యవస్థను నడపడానికి ప్రతి రెవెన్యూ కార్యాలయంలో ఒక ఐటి అధికారిని నియమించాలి. ఇందు కోసం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా రెవెన్యూ శాఖలో వెయ్యి మందిని నియమించాలి. రిజిస్ట్రేషన్లు కూడా పారదర్శకంగా జరగాలి. క్రయ విక్రయాలు జరిపే రైతులిద్దరూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలి. రిజిస్ట్రార్ రెండు పాస్ పుస్తకాలను తీసుకుని అమ్మే వారి పాస్ పుస్తకం నుంచి భూమిని తొలగించాలి. కొన్న వారి పాస్ పుస్తకంలో ఎంటర్ చేయాలి. రిజిస్ట్రారే ఈ రెండు పాస్ పుస్తకాలను కొరియర్ ద్వారా ఎమ్మార్వోకు పంపాలి. నాలుగు పని దినాల్లో ఎమ్మార్వో క్రయ విక్రయాలకు సంబంధించిన వివరాలను తన కార్యాలయంలో నమోదు చేయడంతో పాటు అటెస్ట్ చేసి పేరు మార్చాలి. తిరిగి రిజిస్ట్రార్‌కు పంపాలి. రిజిస్ట్రార్ తన రికార్డుల్లో నమోదు చేసుకుని కొరియర్ ద్వారా రైతులకు పంపాలి. పాస్ పుస్తకాలు, పహాణీల నిర్వహణను కూడా మరింత సరళం చేయాలి. ప్రత్యేకమైన పెన్నులు మాత్రమే పడే విధంగా పాస్ పుస్తకాలు తయారు కావాలి, నీటిలో పడినా తడవకుండా, పాడవకుండా ఉండే విధంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. భవిష్యత్తులో ప్రతి మండలానికి ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలి. వీలైతే ఎమ్మార్వోకే రిజిస్ట్రేషన్ కూడా చేసే అధికారం ఇచ్చే అవకాశాలు పరిశీలించాలి. రెవెన్యూ కోర్టులు కూడా ఇన్ని ఉండాలా? కేవలం కలెక్టర్ వద్ద ఒక కోర్టు మాత్రమే నిర్వహించాలా? అనే విషయంలో కూడా నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్‌ను అంగీకరించని విధంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలి అని సిఎం కెసిఆర్ ఆదేశించారు. భూ రికార్డుల ప్రక్షాళనకు సంబంధించి కొంత మంది ఉద్యోగులను కూడా తాత్కాలిక పద్ధతిపై తీసుకుంటాం అని సిఎం చెప్పారు. రాష్ట్రంలో గిట్టుబాటు ధర కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతులను సంఘటితం చేసే పనికి ప్రభుత్వమే పూనుకుంది. రైతులు సంఘటితమై గిట్టుబాటు ధర పొందే ప్రణాళిక కూడా అమలు చేస్తున్నాం అని సిఎం కెసిఆర్ చెప్పారు. భూ రికార్డుల ప్రక్షాళనకు అవలంభించాల్సిన పద్ధతులపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.రఘునందన్ రావు నేతృత్వంలో ఏర్పడిన కమిటీ చేసిన అధ్యయనంపై చర్చ జరిగింది.

"వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకున్న రైతులు అప్పులలో కూరుకుపోతున్నారు. ఏమాత్రం గిట్టుబాటు ఉండడం లేదు. బతకడమే కష్టంగా ఉంది. భార్యకు కనీసం చీర కూడా కొనలేదు. పిల్లలకు స్కూలు ఫీజు కూడా కట్టలేడు. ఇతర పనులేమి లేకుండా కేవలం వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులది ఈ దురావస్థ. పరువు కోసం తెల్లబట్టలేసుకుని తిరుగుతారు. కాని పరిస్థితి ఏమి బాగుండదు. పంట సీజన్ అప్పుల కోసం తిరగని చోటుండదు. బ్యాంకుల చుట్టూ, మిత్తి వ్యాపారుల చుట్టూ తిరిగి అప్పులు పుట్టించుకుంటారు. తీరా అనేక కారణాల వల్ల పంట నష్టపోతే పెట్టిన పెట్టుబడి పోయి అప్పు మిగులుతుంది. అప్పుకు వడ్డీ పెరుగుతుంది. బతుకు భారమవుతుంది. ఈ పరిస్థితి నుంచి రైతును గట్టెక్కియ్యాలని ఎప్పటి నుంచో ఆలోచిస్తున్నా. రైతు కోసం ఏమి చేయాలని చాలా మందితో మాట్లాడాను. చివరికి వ్యవసాయానికి పెట్టుబడి ప్రభుత్వమే సమకూరిస్తే రైతులకు అప్పుల తిప్పలు తప్పుతాయని నిర్ణయించాం. కాలం కలిసి రాక పంటలు పండక పోయి రైతులు పెట్టుబడి కోల్పోయే ప్రమాదం ఉండదు. ఫలితంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోరు. అందుకోసం ప్రభుత్వం ఎంత వ్యయమైనా భరించి ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.8వేలు పెట్టుబడి ఇవ్వాలని నిర్ణయించుకుంది అని సిఎం వివరించారు.

రికార్డు ప్రక్షాళన, రైతు సంఘాల ఏర్పాటు, రైతు సదస్సుల నిర్వహణ తేదీలను ఖరారు చేశారు.

- సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు గ్రామ రైతు సంఘాల సమన్వయ సమితిల ఏర్పాటు. గ్రామంలో వ్యవసాయ భూమి కలిగిన రైతులందరూ సభ్యులుగా ఉంటారు. 11 మందితో సమన్వయ సమితిలు ఏర్పాటు అవుతాయి
- సెప్టెంబర్ 10 నుంచి 15 వరకు రైతు సమన్వయ సమితిల సదస్సులు మండల స్థాయిలో నిర్వహిస్తారు.
- సెప్టెంబర్ 15నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు రెవెన్యూ గ్రామం యూనిట్‌గా భూ రికార్డులు ప్రక్షాళన జరుగుతుంది.
- సెప్టెంబర్ 15న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం

ఒక్కో రెవెన్యూ గ్రామాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. రాష్ట్రం మొత్తాన్ని 1100 యూనిట్లుగా నిర్ణయించారు. 3,600 బృందాలను ఎంపిక చేస్తారు. రెవెన్యూ అధికారి, వ్యవసాయ అధికారి, గ్రామ రైతు సంఘం సమన్వయంతో ఒక్కో గ్రామంలో ఒక్కో బృందం నెల రోజుల పాటు గ్రామంలో ఉండి గ్రామ సభలు నిర్వహించి, రైతులందరి సహకారం, అంగీకారంతో రికార్డులు సరిచేస్తారు. ఒక్కో బృందం ఒక్కో గ్రామంలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తుంది. ఇలా ఒక్కో బృందం మూడు నెలల్లో మూడు గ్రామాలలో రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం నిర్వహిస్తుంది.

= సిఎం కెసిఆర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఒక్కో యూనిట్‌కు బాధ్యత తీసుకుని రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు.

- ఎలాంటి వివాదాలు లేని భూముల దాదా 85 నుంచి 95 శాతం వరకు ఉంటాయని అంచానా. వివాదాలు లేని భూములకు సంబంధించిన రికార్డులన్నింటిని ముందుగా ప్రక్షాళన చేస్తారు. పేర్పు మార్పిడి, క్రయవిక్రయాలు జరిగిన వివరాలన్నీ తీసుకుంటారు. రికార్డులకు తుదిరూపం ఇస్తారు. ఆ రికార్డులను ఆన్‌లైన్‌లో ఉంచుతారు. రెండో దశలో వివాదాస్పద భూములకు సంబంధించి పరిష్కార మార్గాలు చూస్తారు. కోర్టు వివాదాలు ఉంటే, కోర్టు తీర్పులను అనుసరించి యాజమాన్య హక్కులను నిర్ణయిస్తారు.
- డిసెంబర్ నెలాఖరు నాటికి రికార్డులన్ని సరిచేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. దీని ఆధారంగానే రైతులకు పెట్టుబడి పథకం అమలుచేస్తారు.

బిసిల ఉపవర్గీకరణ కమిషన్

(మొదటిపేజీ తరువాయి)

చేకూరుతుంది. ఒబిసిలో ఉన్న వివిధ కులాల వర్గీకరణ , వారికి అందాల్సిన ప్రయోజనాలపై నూతనంగా ఏర్పాటు చేసే కమిషన్ పరిశీలన చేపడుతుంది. ఆర్టికల్ 340 పరిధిలో ఉపవర్గీకరణపై కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం జరిగిందని ఆర్థిక మంత్రి వివరించారు. కమిషన్‌కు ఛైర్మన్ తరువాత సభ్యుల నియామక ప్రక్రియ తరువాత 12 వారాల వ్యవధిలోనే కమిషన్ నివేదిక ప్రభుత్వానికి అందుతుంది. ఇప్పటివరకూ కేంద్ర కోటాలో ఒబిసి ఉపవర్గీకరణ లేకుండా వస్తోంది. ఒబిసిలలోని పలు కులాలు వర్గాలకు సంబంధించిన అంశాలను కూలంకుషంగా పరిశీలించడం ద్వారా రిజర్వేషన్ల అమలులో ఉన్న అసమగ్రత తొలిగిపొయ్యేందుకు వీలేర్పడుతుందని మంత్రి తెలిపారు. ఉప వర్గీకరణ వల్ల అన్ని కులాలకు సరైన రీతిలో లబ్ధి ఉంటుందని జైట్లీ వివరించారు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, జమ్మూ కశ్మీర్‌లలో ఈ బిసిల ఉప వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలలో అమలులో ఉంది.

క్రిమీలేయర్ పరిమితి పెంపు

ఒబిసిలలో క్రిమీలేయర్ ఆదాయ పరిమితిని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న రూ 6 లక్షల వార్షిక ఆదాయ పరిమితిని రూ 8 లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆ తరువాత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరులకు తెలిపారు. ఈ నిర్ణయం మేరకు ఇకపై రూ 8 లక్షల వార్షిక ఆదాయం ఉన్న ఒబిసిలు కూడా రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు కూడా విస్తరించే అంశం చురుగ్గా పరిశీలనలో ఉందని వెల్లడించారు.

కొత్త కేడర్ పాలసీ

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనలను అనుసరించి అధికారులను తమ పదవీకాలంలోనే కేంద్ర ప్రభుత్వ డెప్యుటేషన్‌పై పంపే అవకాశముంటుంది. ప్రస్తుతమున్న 26 కేడర్‌లను కేంద్ర సిబ్బంది శాఖ ప్రతిపాదించిన కొత్త పాలసీ కింద ఐదు జోన్లుగా విభజిస్తున్నారు. జోన్–1లో మొత్తం ఏడు కేడర్‌లుంటాయి. జోన్–1లో ఎజిఎంయుటి (అరుణాచల్‌ప్రదేశ్–గోవా–మిజోరాంతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలు), జమ్ము,కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, రాజస్తాన్, హర్యానా), జోన్–2లో ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, ఒడిశాలు, జోన్–3లో గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జోన్–4లో పశ్చిమ్‌బెంగాల్, సిక్కిం, అసోం–మేఘాలయ, మణిపూర్, త్రిపుర, నాగాలాండ్, జోన్–5లో తెలంగాణ, అంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలను చేర్చారు. జోన్లుగా విభజించడానికి కారణం...ఈ మూడు రకాల ఉన్నతస్థాయి అధికారులు భిన్నమైన అనుభవాలను గడించాల్సి ఉంటుంది. అధికారులు తమ సొంత రాష్ట్రాల్లో కాకుండా వేరే రాష్ట్రాల్లో పనిచేయడం వల్ల అది సాధ్యమవుతుంది. అక్కడ పనిచేయడం వారికి కొత్తగానూ ఉంటుంది. అలా కాకుండా వారు తమ సొంత రాష్ట్రాల్లో పనిచేస్తే కొత్త ప్రయోగాలను చేయడానికి వీలుండకపోవచ్చని సిబ్బంది శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.


100కు చేరిన స్వైన్‌ఫ్లూ కేసులు

(మొదటిపేజీ తరువాయి)

పరంగా హైదరాబాద్ హైరిస్క్‌గా మారింది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తాజాగా మరో పన్నెండు మందిలో స్వైన్‌ఫ్లూ ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. స్వైన్‌ఫ్లూ అనుమానిత లక్షణాలతో వివిధ ఆసుపత్రులకు వచ్చిన 45 మంది నమూనాలను సేకరించి పరీక్షించారు. ఈ నెలలో ఇప్పటి వరకు 632 మంది అనుమానిత నమూనాలను పరీక్షించారు. స్వైన్‌ఫ్లూ ప్రభావం ఇంకా కొనసాగుతున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు ఎ లాంటి భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్ని బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసు పత్రుల్లో స్వైన్‌ఫ్లూ ఔషధాలు, టెస్టింగ్ కిట్స్‌ను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. స్వైన్‌ఫ్లూ నియంత్రణకు ప్రైవేటు ఆసుపత్రులు సహకరించాలని ఆయన కోరారు.

ఎప్పటికీ సంక్షామ హాస్టళ్లే!

(మొదటిపేజీ తరువాయి)



ఘట్‌కేసర్‌లో ఒక ఎస్‌సి బాలుర వసతి గృహాన్ని మూసివేశారు.ఉన్న 9 హాస్టళ్లలో వార్డెన్లు స్థానికంగా ఉండడం లేదు. బయోమెట్రిక్ పద్ధతి అమలుకు నోచుకోవడం లేదు.కీసర బాలికల వసతి గృహంలో నీటి కొరత కారణంగా ట్యాంకర్లద్వారా నీటి సరఫరా చేస్తున్నారు.కొన్ని వసతి గృహాలు పాఠశాలలకు దూరంగా ఉండడం వల్ల విద్యార్థులు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఉంది.విద్యా సంవత్సరం ఆరంభమై మూడు నెలలు గడుస్తున్నా నేటికీ దుస్తులు, దుప్పట్లు అందలేదు.

సంగారెడ్డి,మెదక్, సిద్ధిపేట జిల్లాల్లోనూ వసతి గృహాల పరిస్థితి తీసికట్టుగా ఉంది. ముఖ్యమంత్రి నియోజకవర్గమైన గజ్వేల్‌లో ఎస్‌సి,ఎస్‌టి,బిసి హాస్టళ్లో వంటగదులు లేని పరిస్థితి.250 మంది విద్యార్థులు చెట్లకిందే భోజనాలు చేయవలసిన దుస్థితి నెలకొంది. పలు హాస్టళ్లకు ప్రహరీ గోడలు లేక,బందెల దొడ్డిని మరిపిస్తుండడంతో ఎప్పుడు ఏరోగం సోకుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.నారాయణఖేడ్‌లో అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా వార్డెన్లది ఇష్టారాజ్యంగా మారింది.జోగిపేట,కోల్చారం, దుబ్బాక ఎస్‌సి హాస్టళ్లలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. జహీరాబాద్ బిసి బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్లు కూడా లేవు.

ఆదిలాబాద్ జిల్లాలో 59 హాస్టళ్లు ఉండగా వీటిలో 8 బాలికలకు కేటాయించారు. ఈ హాస్టళ్లలో 4,331 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.ఆసిఫాబాద్ జిల్లా మొత్తం మీద కేవలం 7 హాస్టళ్లే ఉన్నాయి.బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని బిసి బాలుర హాస్టల్‌లో కనీసం మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.కేవలం రెండు గదుల్లో 98 మంది విద్యార్థులు నివసిస్తున్నారు

పాలమూరు జిల్లాలో 221 ఉన్నాయి.వీటిలో బిసి వసతి గృహాలు 72 ,గిరిజన వసతి గృహాలు 31 , ఎస్‌సి వసతి గృహాలు 102, ఉన్నాయి.వీటిల్లో 34,134 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అన్ని హాస్టళ్ల దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయి. విద్యార్థులకు జ్వరం వచ్చినా పట్టించుకునే దిక్కు లేక పై తరగతులు చదువుతున్న విద్యార్థులే వారిని ఆసుపత్రులకు తీసుకువెళుతున్నారు. హాస్టల్ వార్డెన్లు ఎప్పుడు వస్తారో ఎంతసేపు ఉంటారో తెలియని స్థితి ఉంది వరంగల్ అర్బన్ జిల్లాలోని ఎస్‌సి,ఎస్‌సి, బిసి హాస్టళ్లలో 3,575 మంది,వరంగల్ రూరల్ జిల్లాలో 3,962 మంది, మహబూబాబాద్ జిల్లాలో 9,672 మంది, భూపాలపల్లి జిల్లాలో 9,965 మంది, జనగాం జిల్లాలో 3096 మంది విద్యార్థినీవిద్యార్థులు వసతి పొందుతున్నారు.వార్డెన్ల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం ప్రకటించిన మెనూ పాటించడంలేదు. వార్డెన్లు స్థానికంగా ఉండకుండా పట్టణాలనుండి రాకపోకలు సాగిస్తున్నారు. దీనివల్ల రాత్రి సమయాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.పలు హాస్టళ్లలో మరుగు దొడ్లు లేక విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నల్లగొండ జిల్లాలో వివిధ సంక్షేమ హాస్టళ్లలో 4264 మంది,సూర్యాపేట జిల్లాలో 2700 మంది,యాదాద్రి భువనగిరి జిల్లాలో 1277 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 10,777 మంది విద్యార్థులు వసతి పొందుతుండగా 2016/17 విద్యా సంవత్సరంలో 12 కోట్ల 12 లక్షల 96 వేల రూ 222 ఖర్చు చేశారు.అయినా పరిస్థితిలో మార్పులేదంటున్నారు. ఈ విద్యాసంవత్సరంలో మూడు నెలలు గడిచినా ఇంకా విద్యార్థులకు బ్యాగులు అందలేదు.

ఉమ్మడి జిల్లాలో బాన్సువాడ,నందిపేట, బీర్కూర్, జుక్కల్ ప్రాంతాల్లోని హాస్టళ్లలో మరుగుదొడ్లు లేని స్థితి ఉంది. ఒక వేళ మరుగు దొడ్లు ఉన్నా వాటిలో నీటి కొరత మూలంగా వాటి వాడకం నిలిచిపోయింది. వర్షాకాలం మూలంగా బీర్కూర్ హాస్టళ్లలోకి నీరు చేరుతున్నా పట్టించుకునే దిక్కులేకుండాపోయింది. హాస్టల్ భవనాన్ని గ్రామానికి దూరంగా నిర్మించడం దానికి ప్రహరీ ఏర్పాటు చేయకపోవడం వల్ల రక్షణ కరువైంది. హాస్టళ్లలో అన్ని విధాలా వసతులు ఉంటే విద్యార్థులకు కొదవ ఉండదని నందిపేట మండలంలోని హాస్టళ్లు నిరూపిస్తున్నాయి. నందిపేట, అయిలాపూర్, నూతన్‌పల్లి గ్రామాల్లో ఎస్సీ హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతూ వసతులు లేమిగా ఉండేవి. అప్పుడు కేవలం 10 మంది చొప్పున విద్యార్థులు ఉండేవారు. వీటికి నూతన భవనాలు ఏర్పరిచిన అనంతరం విద్యార్థుల సంఖ్య 73 కు చేరింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎస్‌సి హాస్టళ్లు 97, ఎస్‌టి హాస్టళ్లు 28,బిసి హాస్టళ్లు 48 హాస్టళ్లు కొనసాగుతున్నాయి.వీటిలో ప్రభుత్వం ఆదేశాలమేరకు కొన్నింటిలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తుండగా మరి కొన్నింటిలో బయోమెట్రిక్ విధనాన్ని అమలుపరచకుండా విద్యార్థుల సంఖ్యను తారుమారు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల,పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో సంక్షేమాధికారులు లేక ఇంచార్జ్‌లే బాధ్యతలను నిర్వర్తిస్తుండగా పర్యవేక్షణ కొరవడింది. జగిత్యాల జిల్లాలో బిసి హాస్టళ్లకు సరఫరా చేయవలసి ఉన్న ఇన్వర్టర్లు, వాటర్ పూరిఫైయర్లు, స్కూలు బ్యాగులు, ట్రంకు పెట్టెలు, మ్యాట్‌లు నెలల తరబడి జిల్లా కేంద్రంలో పడిఉన్నాయి. సగానికి పైగా హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

విద్యార్థులు లేని హాస్టల్‌కు తప్పని కిరాయి : సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎస్‌సి హాస్టల్ విద్యార్థులు లేకుండానే గత మూడు నెలలుగా అద్దె రూ 11 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ హాస్టల్‌లో 2015 లో 22 మంది పిల్లలు ఉండగా 2016 లో ఆ సంఖ్య 15 కు చేరింది. ఈ విద్యాసంవత్సరంలో ఉన్న పిల్లలు వెళ్లిపోగా గత మూడు నెలలుగా రూ11 వేల చొప్పున రూ 33 వేలు అద్దె చెల్లించారు.

ఈ విషయమై ఇంచార్జ్ వార్డెన్ రామానుజా చారిని ప్రశ్నించగా పై అధికారులకు విషయం తెలిపామని, 50 మంది కంటే తక్కువగా విద్యార్థులు ఉన్న హాస్టళ్లను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఈ మేరకు అధికారులకు తెలియపరిచానని, వారు నిర్ణయం తీసుకోవాల్సి ఉందనితెలిపారు. ఉన్నతాధికారులు నిర్ణయించే వరకు ఇంకా ఎన్ని నెలలు పడుతుందో తెలియని పరిస్థితి ఉండగా ప్రతినెలా అద్దె చెల్లించక తప్పడంలేదు.



అబద్దాలలో సిఎం కెసిఆర్ నెంబర్‌వన్ : పొన్నాల

మన తెలంగాణ/వరంగల్: అబద్దాలలో సిఎం కెసిఆర్ ప్రపంచంలోనే నెంబర్ వన్ అని టిపిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఆగస్టు 15 రోజున కూడా ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా అసత్యాలు, అబద్దాలతో మోసం చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాటల గారడీ చేస్తూ కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. మేనిఫెస్టోలో లేని మిషన్ భగీరథ పేరుతో రూ.40వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇది మిషన్ భగీరథ కాదు కమీషన్ల కోసం ఏర్పాటు చేసుకున్న మిషన్ కల్వకుంట్ల అని ఎద్దేవా చేశారు. బుధవారం హన్మకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పొన్నాల మాట్లాడారు. 2013లో ప్రాణహిత చేవెళ్లకు జాతీయ హోదా కావాలని డిమాండ్ చేసిన కెసిఆర్ తెలంగాణ వచ్చిన తరువాత ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో దాని ఊసులేకుండా చేశారని ఆరోపించారు. ప్రాజెక్టుల రీడిజైనింగ్, ప్రజలకు ఇచ్చిన హామీలపై చర్చికు రావాలని ఈ సందర్భంగా కెసిఆర్‌కు సవాల్ విసిరారు. తుపాకులగూడెం వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేస్తామని చెప్పి మూడున్నరేళ్లయినా పనులు ప్రారంభించలేదని విమర్శించారు.

వేతనాలు చెల్లించాలంటూ నీలోఫర్‌లో కార్మికుల సమ్మె



మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో: రెండు నెలలుగా వేతనాలు చెల్లిం చడం లేదంటూ నీలోఫర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న సుమారు 250 మంది కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది బుధవారం విధులు బహిష్కరించి ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మెకు దిగారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ సాయంత్రం వరకు సమ్మెను కొనసాగించడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా ఎఐటి యుసి నగర ప్రధాన కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే కార్మికులు సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. అనంతరం కాంట్రాక్టర్, ఆసుపత్రి వర్గాలు సమావేశమై రెండు నెలల వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు.

ఆదిలాబాద్ జిల్లా గెజిటెడ్ ఇన్‌స్పెక్టర్ ఇళ్లలో ఎసిబి సోదా

మన తెలంగాణ/హైదరాబాద్/ నార్సింగి: ఆదిలాబాద్ జిల్లా గెజిటెడ్ ఇన్‌స్పెక్టర్ బాపూజీకి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు అభియోగంతో ఇళ్లలో ఎసిబి సోదాలు చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సోమాజిగూడ, మేడ్చల్, రంగారెడ్డి జిల్లా గండిపేట మండల బండ్లగూడ జాగీర్‌లో దాడులను నిర్వహించింది. అ నంతరం ఎసిబి అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ గండిపేట మండలం బండ్లగూడ జాగీర్‌లో 1.50కోట్ల విల్లా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో మూడు చోట్ల తనిఖీలు చేసినట్లు వివరించారు.

డెంగ్యూ బాధితులకు మెరుగైన వైద్యం

- 'మన తెలంగాణ'కు స్పందించిన వైద్యాధికారుల బృందం




మన తెలంగాణ/తుంగతుర్తి టౌన్ : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిధిలో డెంగ్యూతో పలువురు మంచం పట్టారు. మానాపురం గ్రామంలో గిరిజన మహిళ బానోతు బాలి హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. తండాలో మరి కొంతమంది జ్వరాలతో బాధపడుతున్న విషయాన్ని బుధవారం 'మన తెలంగాణ' పత్రికలో 'మంచం పట్టిన మానాపురం' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీంతో వైద్యాధికారుల బృందం హుటాహుటీన మానాపురం గ్రామానికి చేరుకుంది. వెద్యాధికారి డా. కృష్ణనాయక్ నేతృత్వంలో సిబ్బంది బాధితు ల నుంచి రక్త నమూనాను సేకరించారు. రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందజేస్తామన్నారు.

బాలుడిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు



మన తెలంగాణ/గార్ల: 12 ఏళ్ల బాలుడిని తన కామవాంఛ తీర్చాలని వేధిస్తున్న హాస్టల్ ఉద్యోగిపై కేసు నమోదైన ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉన్న ఎస్‌సి బాలుర వసతి గృహంలో చదువుకుంటున్న బాలుడిని వంట మనిషిగా పని చేస్తున్న సుర్నపాక రాము తన కోరిక తీర్చాలంటూ నిత్యం వేధింపుకు గురిచేసేవాడు. ఈ విషయాన్ని బాలుడు తల్లిదండ్రులకు తెలపడంతో తండ్రి ఫిర్యాదు మేరకు రాముపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చుతున్నట్లు సిఐ రాజయ్య తెలిపారు.

మావో పోస్టర్ కలకలం



మన తెలంగాణ/భూపాలపల్లి ప్రతినిధి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి బొగ్గు గనుల్లో వెలిసిన మావోల వాల్‌పోస్టర్ కలకలం సృష్టించింది. కేకే డబ్ల్యూ కార్యదర్శి దామోదర్ పేరుతో భూగర్భ గని 2 వద్ద వెలిసిన పోస్టర్‌తో అధికార, రాజకీయ యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. అక్టోబర్ 5న జరుగనున్న సింగరేణి ఎన్నికల నేపథ్యంలో గనులపై పలువురిని హెచ్చరిస్తూ వెలిసిన పోస్టర్‌తో పోలీసు యంత్రాంగం అప్రమత్తం కాగా, సింగరేణి కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పోస్టర్‌లో 30ఏళ్లుగా సింగరేణి చరిత్రలో ప్రజలు, రైతులకు న్యాయం జరగడంలేదని, వేల ఎకరాలు సేకరిస్తుంది ఎవరి కోసమని? కాంగ్రెస్, టిఆర్‌ఎస్ కలిసి రైతులను,ప్రజలను దోచుకుతింటున్నారన్నారు. కొందరు భూకబ్జాలకు పాల్పడుతూ జనాన్ని భయాందోళనకు గురిచేస్తున్నారని, ఇదివరకే చాలాసార్లు హెచ్చరించామని, పద్ధతి మార్చుకోకపోతే శిక్ష తప్పదని హెచ్చరించారు.

నియంతృత్వ పాలనపై ఐక్యపోరు

మన తెలంగాణ/నల్లగొండ: ముఖ్యమంత్రి కెసిఆర్ నియంతృత్వ పాలనపై ఒంటరి పోరు చాలదని, ఐక్యపోరాటం కోసమే టి మాస్‌ను ఏర్పాటు చేసినట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం నల్లగొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో 'సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి' నినాదంతో టిమాస్ ఫోరమ్ ఆవిర్భావ సభ జరిగింది. ఈ సభకు తమ్మినేనితో పాటు ప్రజా గాయకుడు గద్దర్, ప్రొఫెసర్లు కంచె ఐలయ్య, విశ్వేశ్వర్‌రావులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ సామాజిక తెలంగాణ ప్రజలకు అవసరమని చెప్పారు. గద్దర్ మాట్లాడుతూ పాలకులు రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పపడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు.

ఇండియా మార్ట్ పేరుమీద మోసం

- ఇద్దరు నైజీరియన్‌ల అరెస్టు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: 'ఇండియా మార్ట్' పేరు మీద మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నైజీరియాకు చెందిన గాడ్ విస్ (354), రోరిలియన్ హమర్ (24)లు స్మార్ట్ ఫోన్లను తక్కువ ధరలకు విక్రయిస్తామని నమ్మిస్తారు. అయితే ముందుగా వారి నుంచి తమ అకౌంట్‌లోకి డబ్బులను వేయించుకుంటారు. ఆ తరువాత స్మార్ట్ ఫోన్లను పార్శిల్ ద్వారా పంపించకుండా మోసగించారు. ఈ క్రమంలోనే కొండాపూర్‌కు చెందిన డా. ప్రవీణ్‌ను కూడా ఖరీదైన ఫోన్లు పంపిస్తామని అతడి నుంచి రూ.3.56 లక్షలను వారి బ్యాంక్ ఖాతాలో వేయించుకుని మోసగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ పి.రవిందర్‌రెడ్డి, ఎస్‌ఐలు విజయవర్ధన్‌లు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.

చవితికి సర్వం సిద్ధం

- గణేశ్ ఉత్సవాలకు 35వేల మంది పోలీసులు
- మూడు కమిషనరేట్ల పరిధిలో 30 వేల విగ్రహాల ప్రతిష్ఠ
- హైదరాబాద్‌కు చేరుకున్న అదనపు పోలీసు బలగాలు
- నిమజ్జనం ముగిసే వరకూ స్టాండ్ డ్యూటీలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ మోహరింపు



మన తెలంగాణ/హైదరాబాద్/సిటీబ్యూరో: రేపటి నుంచి ప్రారంభమయ్యే గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు హైదరాబాద్‌లోని మూడు పోలీసు కమిషనరేట్ల పోలీసులు (హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్) సిద్ధమయ్యారు. 11రోజుల పాటు సాగే ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. మూడు కమిషరేట్లలో కలిపి సుమారు 30వేలకు పైగా గణేశ్ మండపాలు (చిన్నవి, పెద్దవి) ఏర్పాటయ్యాయి. ఈ మేరకు బందోబస్తు కోసం 35వేల మంది పోలీసులను వినియోగిస్తున్నారు. ఇందులో 15వేల మంది అదనపు పోలీసు బలగాలను ఇతర జిల్లాలు, ఆంధ్రప్రదేశ్ నుంచి రప్పించారు. వీరంతా బుధవారం ఇక్కడికి చేరుకున్నారు. ఇప్పటికే బందోబస్తుపై నగర పోలీసు కమిషరేట్ పరిధిలోని ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్, సెంట్రల్ జోన్‌లు, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని భువనగిరి, ఎల్‌బినగర్, మల్కాజ్‌గిరి జోన్‌లు, సైబరాబాద్ పోలీసు కమిషరేట్ పరిధిలోని మాదాపూర్, శంషాబాద్, బాలనగర్ జోన్‌ల డిసిపిలతో ముగ్గురు కమిషనర్లు ఎం.మహేందర్‌రెడ్డి, మహేష్ భగవత్, సందీప్‌శాండిల్యాలు సమావేశమై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను కూడా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఎఎఫ్) బలగాలను వినియోగించుకోవాలని కమిషనర్లు సూచించారు. ఇక నిఘా విభాగమైన స్పెషల్ బ్రాంచ్ అధికారులను కూడా అప్రమత్తం చేశారు. ఆయా ఏరియాల్లో పరిస్థితిలను, కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. గణేశ్ మండపం నుంచి నిమజ్జనానికి తరలివెళ్లే వినాయక విగ్రహాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ప్రతి మండపం వద్ద పోలీసులు ఉండే విధంగా బందోబస్తును సిద్ధం చేసి, సిసిటివిలను ఏర్పాటు చేశారు. ఇక నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్‌పై తీసుకోవాల్సిన అన్ని సౌకర్యాలు, జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శివార్లలోని 30 నిమజ్జన కేంద్రాల వద్ద క్రేన్లు, లైటింగ్ ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇక్కడ సుమారు 150మంది గజ ఈతగాళ్లను రప్పిస్తున్నారు. ఇక జిహెచ్‌ఎంసి అధికారులను సైతం అప్రమత్తం చేశారు. నగర పోలీసు కమిషనరేట్ సిబ్బంది సుమారు 12వేల మంది, రాచకొండ పోలీసు సిబ్బంది 3వేలు, సైబరాబాద్ పోలీసు సిబ్బంది 2500 మంది ఉండగా వీరికి అదనంగా పోలీసు బలగాలను రప్పించారు. మూడు, ఐదు, ఏడు, తొమ్మిది రోజుల నాడు నిమజ్జనానికి బయల్దేరే వినాయక విగ్రహాలకు కట్టుదిట్టమైన బందోబస్తు ప్రణాళికలను సిద్ధం చేశారు. ముఖ్యంగా రాత్రి పూట నిరంతరంగా పోలీసు గస్తీ ఉండేలా ఆయా స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు చేసుకోవాలని కమిషనర్లు సూచించారు. ఎసిపిలు, డిసిపిలు బందోబస్తును పర్యవేక్షించాలని ఆదేశించారు.

పశువులకు అంటురోగాలు రాకుండా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలోని పశు సంపదకు అంటురోగాలు రాకుండా పశు సంవర్ధక శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న పశువులు, గొర్రెలు, మేకలు ఇతర జంతువుల ఆరోగ్యస్థితిని తెలుసుకునేందుకు ప్రత్యేక పశుసంవర్ధక చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తోంది. ఇతర రాష్ట్రాలతో సరిహద్దులు కలిగిన మన రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో దాదాపు 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారి ఒకరు 'మన తెలంగాణ'కు తెలిపారు. ఇక్కడ పశు వైద్యుడితో పాటు, సహాయక సిబ్బంది ఉండనున్నారు. ఈ చెక్‌పోస్టులలో ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న పశుసంపద ఆరోగ్యంగా ఉందా లేదా అక్కడి పశువైద్యులు ధృవీకరించిన సర్టిఫికెట్లు ఇతరత్రా వంటివి చూసాకే మన రాష్ట్రంలోకి వాటిని అనుమతించనున్నారు. ఒకవేళ ఎలాంటి ధ్రువీకరణ లేకపోతే, పశువులు, గొర్రెలు అనారోగ్యంతో ఉన్నట్లయితే వాటిని మన పశువైద్యులే వైద్య పరీక్షలు నిర్వహించి సర్టిఫై చేయనున్నారు. అయితే వాటిని వెంటనే అనుమతించకుండా కొన్నిరోజుల సమయం తీసుకుంటామని అధికారి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పశుసంపదకు అధికంగా గాలికుంటు వ్యాధి సోకుతోంది. ఏటా టీకాలు వేసినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వాటితో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి.

పక్క రాష్ట్రం వైద్యులు


త్వరలో సిఎం కె. చంద్రశేఖర్‌రావు చేతులమీదుగా ప్రారంభించనున్న 100 సంచార పశు వైద్యశాలలకు ఇతర రాష్ట్రాల నుంచి పశు వైద్యులను నియమించుకోనున్నట్లు తెలిసింది. కాంట్రాక్టు ప్రాతిపదికన తీసుకుంటన్న ఈ ఉద్యోగాలకు 102 పోస్టులకు గాను కేవలం 30 వరకు మాత్రమే దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది.

దబోల్కర్, పన్సారే హత్యలపై ఇదేం దర్యాప్తు

ముంబై: హేతువాదులు నరేంద్ర దబోల్కర్, గోవింద్ పన్సారేల హత్యలు పకడ్బందీ ముందస్తు వ్యూహాలతో జరిగాయని, వీటికి సంస్థాగత మద్దతు కూడా ఉన్నట్లుగా భావిస్తున్నామని మహారాష్ట్ర హైకోర్టు తెలిపింది. ఈ హత్యలపై ఇప్పుడున్న దర్యాప్తు సరిపోదని, దీనికి మించి విస్తృత స్థాయిలో దర్యాప్తు జరపాల్సి ఉందని, అప్పుడే నిజాలు వెలుగులోకి వస్తాయని స్పష్టం చేసింది. రెండు హత్యా ఘటనల మధ్య ఖచ్చితమైన సంబంధం ఉందని బొంబాయి హైకోర్టు న్యాయమూర్తులు ఎస్‌సి ధర్మాధికారి, విభా కంకన్‌వాడితో కూడిన ధర్మాసనం తెలిపింది. ఇవి వేర్వేరు ఘటనలుగా భావించడానికి వీల్లేదని, కొన్ని సంస్థలు వ్యవహరించి అందించిన మద్దతుతోనే ఈ హత్యలు జరిగాయని , హంతకులకు ఆర్థిక మద్దతు ఇతరత్రా సాయం కూడా అందినట్లు వెల్లడవుతోందని, ఈ కోణంలో దర్యాప్తును సరికొత్తగా వేగవంతం చేయాల్సి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. పన్సారే , దబోల్కర్ హత్యపై సిబిఐ, సిఐడి నివేదికల పరిశీలన తరువాత ధర్మాసనం స్పందించింది. హత్యల కేసులో కీలక నిందితులుగా అనుమానిస్తున్న సారంగ్ అక్లోకర్, వినయ్ పవార్‌లను ఇప్పటి వరకూ పట్టుకోలేక పోయారనే విషయాన్ని ధర్మాసనం ఆక్షేపించింది. దర్యాప్తు సంస్థలు ఈ తీరున కాకుండా వేరే విధంగా కదిలితే మంచిదని చురకలు విధించారు. ఇప్పటివరకూ నిందితులను పట్టుకోలేకపోవడం దారుణమని తెలిపారు. సిబిఐ వారు సిఐడితో దర్యాప్తును సమన్వయ పర్చుకోవాల్సి ఉంది. ఆధునిక సాంకేతికను వాడుకోవాలి. బ్యాంకుల లావాదేవీలు, ఎటిఎంల ఖాతాలు, రైల్వే టికెట్ల బుక్కింగ్‌లు, ఐదారు రాష్ట్రాలపై నిర్ధిష్టమైన నిఘా పెడితే నిందితులు తప్పించుకువెళ్లే పరిస్థితే ఉండదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వచ్చే నెల 13న జరిగే తదుపరి విచారణకు సిబిఐ నుంచి ఈ కేసు దర్యాప్తుపై పురోగతి నివేదికను ఆశిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

టిఎస్‌పిఎస్‌సి, ఎపిపిఎస్‌సిల ముట్టడికి యత్నం

- తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ సంఘాల డిమాండ్



మన తెలంగాణ/హైదరాబాద్/గోషామహల్: ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల లేక 4689 పాఠశాలలు మూత పడుతున్నా ప్రభుత్వం పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని నిరుద్యోగ సంఘాలు మండిపడ్డాయి. నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేశ్, బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ నేతృత్వంలో బుధవారం వందలాది నిరుద్యోగులు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ టిఎస్‌పిఎస్‌సి, ఎపిపిఎస్‌సిల ముట్టడికి యత్నించారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు వారిని అరెస్టు చేసి బేగం బజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే బిజెపి, గాంధీభవన్ పార్టీ కార్యాలయాల్లో తలదాచుకున్న నిరుద్యోగులను సైతం పోలీసులు అరెస్ట్ చేయడంతో ఆగ్రహించిన బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య బిసి నాయకులతో కలిసి పోలీసుల దౌర్జన్యంపై మండిపడ్డారు. పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి పోలీసుల దురుసు ప్రవర్తనపై ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 40 వేలకుపైగా టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా 4689 పాఠశాలలను మూసి వేసే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 4500, ఆదర్శ పాఠశాలల్లో 2200, కస్తూర్బా పాఠశాలలో 1500 పోస్టులు, పిఇటి, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్లు, లైబ్రేరియన్ పోస్టులు, జూనిచర్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని, వెంటనే అన్ని పోస్టులను భర్తీ చేయాలన్నారు. గ్రూప్2 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం సిబిఐ విచారణకు ఆదేశించాలన్నారు. ఆన్‌లైన్ విధానం రద్దు చేసి, ఆఫ్‌లైన్ ద్వారా నేరుగా ప్రభుత్వమే పరీక్షల నిర్వహణ బాధ్యతను తీసుకోవాలని, స్క్రీన్ షాట్లపై సైబర్ క్రైమ్ రిపోర్టును బహిర్గతం చేయాలన్నారు. ఎపిపీఎస్సీ అందిన ఫిర్యాదులపై 28 సెంటర్లలో సీసీటివి పుటేజ్‌లను విడుదల చేయాలని, పరీక్ష నిర్వహించడంతో విఫలమైన సంస్థలపై చర్యలు తీసుకుని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రెండేళ్ల చిన్నారిపై అత్యాచారం

- రంగారెడ్డి జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసిన దారుణం

మన తెలంగాణ/మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని శ్రీప్రేమ టాకీస్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన దంపతులు కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరికి రెండేళ్ల కూతురు ఉంది. చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ విషయాన్ని థియేటర్ యజమాని సంతోష్‌లాల తివారి గోప్యంగా ఉంచి తప్పుదోవ పట్టించడానికి చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్‌కు చెందిన బాధిత కుటుంబం థియేటర్‌లో పని చేస్తూ వెనుక భాగంలో ఉన్న గదుల్లో నివాసం ఉంటున్నారు. ఆగస్టు 13న రాత్రి పక్క గదిలో ఉంటున్న మహబుబ్‌నగర్ జిల్లాకు చెందిన నర్సింహ (19) అనే యువకుడు చిన్నారిని తన గదిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. చిన్నారికి తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించగా చిన్నారిపై అత్యాచారం జరిగిందని, ఉస్మానియా ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో ఈ దంపతులు థియేటర్ యజమానిని చిన్నారిని ఆసుపత్రిలో చేర్పించాలని కోరగా అత్యాచారం జరిగిందని ఎవరికీ చెప్పకూడదని బెదిరించారు. చివరకు ఉస్మానియా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించగా చిన్నారిపై అత్యాచారం జరిగిందని వైద్యులు ధ్రువీకరించారు. దీంతో వారు పహడిషరీఫ్ పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు నిందితుడు నర్సింహ, థియేటర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని బుధవారం పలు పార్టీలు ఆందోళన చేశాయి.





మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి ఆలయాన్ని బుధవారం దర్శించుకున్నారు. సిఎం సతీమణి సాధనా సింగ్, కుమారుడు కునాల్ సింగ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వీరికి ఆలయ చరిత్ర, విశిష్టత వివరించారు. అనంతరం వారిని సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు.
– మన తెలంగాణ/హైదరాబాద్/చార్మినార్

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/నార్నూర్: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిలాబాద్ జిల్లా గడిగూడ మండలం కొత్తపెల్లి(జి) గ్రామంలో విషాదం నింపిది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాంబ్లే దత్త(32) అనే రైతు తనకున్న మూడెకరాల పొలంలో రెండు ఎకరాల్లో పత్తి, మరో ఎకరంలో జొన్న సాగు చేశాడు. వర్షాల్లేక పత్తి ఎండిపోవడంతో దత్త మనస్తాపం చెందాడు. బుధవారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహబూబ్‌నగర్‌లో మరొకరు..

మన తెలంగాణ/అడ్డాకుల: అప్పుల బాధతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం తిమ్మాయిల్లి తండాలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత్లావత్‌హర్య(58) అనే రైతుకు నాలుగెకరాల భూమి ఉంది. ఇందులో వరి,ఆముదం, జొన్న పంటలను సాగు చేస్తున్నాడు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వేసిన పంటలు ఎండుముఖ పట్టాయి. ఎలాగైనావరి పంటను కాపాడుకోవాలని ఇటీవల అప్పుచేసి బోరు వేశాడు. నీరు పడకపోవడం, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందిన హర్య పొలం వద్ద పురుగుల మందు తాగినట్లు చెప్పారు. మృతుడి కుటుంబాన్ని బుధవారం హైకోర్టు న్యాయవాది జి.మధుసూదన్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

కుంటలో పడి ఇద్దరు మృతి



మన తెలంగాణ/బోథ్ : కుంటలో పడి ఇద్దరు బాలురు మృతి చెందిన ఘటన ఆదిలా బాద్ జిల్లా బోథ్ మండలం టివిటి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వె ళ్తే.. గ్రామ సమీపంలోని కుంట వద్ద సాకేర గ్రామానికి చెందిన ధర్మేందర్(14), జాదవ్ సాయి(13) మేకలను మేపేందుకు వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలిం చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీశాఖ సిబ్బందిపై స్మగ్లర్ల దాడి

మన తెలంగాణ/నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం ఈస్పూర్ అటవీ ప్రాంతంలో కలప అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన అటవీశాఖ సిబ్బందిపై స్మగ్లర్లు దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వాంకిడి ఎఫ్ఎస్ఒ పాండురంగ వివరాల ప్రకారం.. ఈస్పూర్ అటవీ ప్రాంతంలో ద్విచక్రవాహనాలపై కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అటవీశాఖ స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది అక్కడి వెళ్లగానే స్మగ్లర్లు సిబ్బందిపై రాళ్లతో దాడిచేశారు. దాడి చేసిన స్మగ్లర్ నేరడిగొండ మండలంలోని కొర్టికల్ గ్రామానికి చెందిన గోపాల్‌గా గుర్తించారు. మరి కొందరు స్మగ్లర్లు అక్కడి నుండి పారిపోయారన్నారు. దాడిలో సిబ్బంది అలీం కుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. దాడిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, స్మగ్లర్ గోపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆడపిల్ల పుట్టిందని..

- ఆగి ఉన్న వాహనంలో శిశువును వదిలి వెళ్లిన తల్లి

మన తెలంగాణ/ఎంజిఎం: పుట్టిన మరుక్షణమే ఒక పసికందును మార్గ మధ్యంలో ఆగి ఉన్న ఓ టాటా ఎసి వాహనంలో వదిలేసి వెళ్లిన సంఘటన వరంగల్ జిల్లా పస్రా మండలంలో చోటు చేసుకుంది. బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి పోషించలేని పరిస్థితో లేక ఆడ పిల్ల అని ఆర్థిక భారమో కాని పసికందును వాహనంలో వదిలేసింది. కొంత సమయం తరువాత ఆ పసికందు ఏడుపు విని దారి మధ్యలో వెళ్లే స్థానికులు గుర్తించి వాహనం డ్రైవర్‌ను అడగ్గా, తనకు తెలియదని చెప్పాడు. అనంతరం గ్రామస్తులు అంగన్‌వాడీలకు సమాచారం ఇవ్వగా, వారు చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ హేమలతకు తెలిపి 108 సహాయంతో పసికందును ఎంజిఎంకు తరలించారు. ఆరోగ్య పరిస్థితి మెరుగైన తరువాత శిశు సంక్షేమ శాఖకు అప్పగిస్తానని తెలిపారు.

సంగారెడ్డిలో కళాశాల విద్యార్థులపై దాడి

- పుల్కల్ మండలం వద్ద ఘటన

మన తెలంగాణ/జోగిపేట టౌన్: ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థులు మూడు రోజులుగా నాగార్జున కళాశాల విద్యార్థులపై ర్యాంగిగ్‌కు పాల్పుడుతున్న సంఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట సర్కిల్ పరిధిలోని పుల్కల్ మండలం వెంకట కిష్టాపూర్ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. పుల్కల్ ఎఎస్‌ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి పట్టణంలోని నాగార్జున (ఎస్‌వీ) కళాశాల బస్సు రోజూ మాదిరిగానే విద్యార్థులతో 6 గంటల ప్రాంతంలో సంగారెడ్డి నుంచి బయల్దేరింది. పుల్కల్ మండలం వెంకట కిష్టాపూర్, వెండికోల్ గ్రామాల మధ్యకు రాగనే పుల్కల్ మండలానికి చెందిన యువకులు బస్సు ఆపి విద్యార్థులు, డ్రైవర్లపై దాడి చేశారు. అంతటితో ఆగకుండా బస్సులో ఉన్న విద్యార్థినులను అసభ్యకర పదాలతో దూషిస్తూ ఓ విద్యార్థినిపై మత్తు పదార్థం వంటి పౌడర్ చల్లారు. అలాగే మరో విద్యార్థిపై దాడి చేసినట్లు చెప్పారు. దాడి జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోగా అస్వస్థతకు గురైన విద్యార్థులను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు ఆంజనేయులు, శ్రీను, సతీష్, ఉదయ్‌కిరణ్, విష్ణు, ప్రశాంత్, సమర సింహారెడ్డి, భాను ప్రసాద్, దత్తు అనే నిందితులపై 149, 341, 354/డీ, 323, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకోని నిందితులను అదుపులోకి తీసుకోని కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

భూ వివాదంలో అన్నను చంపిన తమ్ముడు

మన తెలంగాణ/మిడ్జిల్: భూ వివాదంలో తమ్ముడు అన్నను చంపిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం కొత్తూరు గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి మిడ్జిల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాట చేసిన సమావేశంలో సిఐ వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన ఆంజనేయులు భార్య ఈనెల 14న తన భర్త కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నారు. 16న ఆంజనేయులు దుందుబి వాగులో హత్యకు గురైనట్లు విచారణలో తేలింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారించగా ఆంజనేయులు తమ్ముడు శ్రీశైలం పక్కా ప్రణాళికతో స్క్రూడైవర్, గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిసింది. ఈ మేరకు హత్యకు పాల్పడిన శ్రీశైలంతో పాటు సహకరించిన పాండు, విష్ణును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కాలు బెణికినా డ్యాన్స్ ప్రాక్టీస్

సినిమా హీరోయిన్ కావాలంటే కేవలం గ్లామర్ ఒకటే సరిపోదు. నాజూకుగా కనిపించే ఫిట్ ఫిగర్‌తో పాటు చాలా టాలెంట్లు ఉండాలి. అందుకే చాలా మంది స్టార్ కిడ్స్ ఇంటర్మీడియట్ పూర్తికాగానే విదేశాలకు వెళ్లి యాక్టింగ్‌లో శిక్షణ తీసుకుంటుంటారు. శ్రీదేవి పెద్ద కూతురు జాన్వి కపూర్ కూడా న్యూయార్క్‌లోని ఒక అకాడమీలో అదే తరహాలో నటనలో శిక్షణ తీసుకుంది. అయితే మన ఇండియన్ సినిమాల్లో రాణించాలంటే నటన ఒక్కటే సరిపోదు. డ్యాన్సులు కూడా రావాలి. ఈ భామ ఇప్పుడు ముంబయ్‌లోని ఒక ప్రముఖ కొరియోగ్రాఫర్ వద్ద డ్యాన్సుల్లో శిక్షణ పొందుతోంది. ఈ సమయంలో అమ్మడు తన తల్లి తరహాలో హీరోలతో పోటీపడి డ్యాన్సులు చేయాలనే ధ్యేయంతో కాస్త ఎక్కువగానే డ్యాన్స్ ప్రాక్టీస్ చేసిందట. దీంతో ఆమె కాలు బెణికిందని తెలిసింది. అయినా సరే మోకాలికి ఒక సేఫ్టీ క్యాప్ పెట్టుకొని మరీ జాన్వి డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తోందట. ఎలాగైనా డ్యాన్సుల్లో ఆరితేరి తొలి మూవీతో ప్రేక్షకులను అలరించాలని కోరుకుంటోంది ఈ బ్యూటీ.


జాన్వి కపూర్

నేడే లవ కుమార్ టీజర్



ఎన్‌టిఆర్ తాజా చిత్రం 'జై లవ కుశ' కొత్త టీజర్ గురువారం సాయంత్రం రిలీజ్ కానుంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ మూడు పాత్రల్లో కనిపించనున్న విషయం తెలిసిందే. వీటిలో ఒకటైన జై పాత్ర టీజర్ గతంలో విడుదలై విశేషాదరణ పొందింది. దీంతో రెండవ పాత్ర లవ కుమార్ ఎలా ఉంటాడో అనే ఆసక్తి సర్వత్రా నెలకొని ఉంది. సినిమా టీమ్ చెబుతున్న దాని ప్రకారం జై పాత్ర వైల్డ్‌గా ఉంటే లవ కుమార్ సౌమ్యుడిగా కనిపిస్తాడట.

ఆ పాత్ర కథతో పాటు నడుస్తుందని, అంతేకాకుండా ఈ పాత్రలో తారక్ చూపించే నటనలో వేరియేషన్ అందరినీ ఆకట్టుకుంటుందని తెలిసింది. మొత్తానికి లవ కుమార్‌కు సంబంధించిన టీజర్ ఆశ్చర్యపరిచేవిధంగా ఉంటుందని సమాచారం. మరి టీమ్ చెబుతున్నట్లుగా అంతగా ఆశ్చర్యపరిచే కంటెంట్ టీజర్‌లో ఏముంటుందో తెలుసుకోవాలంటే గురువారం వరకు ఆగాల్సిందే. బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎన్టీర్ ఆర్ట్స్ బ్యానర్‌పై కళ్యాణ్‌రామ్ నిర్మిస్తున్నాడు.

ఎన్‌టిఆర్

కాజోల్‌ను ఎలా ఎదుర్కొన్నాననేదే కొత్త పాయింట్

ధనుష్ హీరోగా వి క్రియేషన్స్, వండర్ బార్స్ పతాకాలపై రూపొందిన చిత్రం 'విఐపి 2'. తెలుగులో పెద్ద హిట్టయిన 'రఘువరన్ బి.టెక్' మూవీకి సీక్వెల్ ఇది. సౌందర్య రజనీకాంత్ దర్శకత్వంలో కలైపులి థాను, ధనుష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదల-కానుంది. ఈ సందర్భంగా ధనుష్ హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటిస్తూ చెప్పిన విశేషాలు...


ధనుష్

తెలుగులో నా మొదటి సినిమా...

'రఘువరన్ బి.టెక్' హిట్టవ్వడంతో దీని సీక్వెల్ 'విఐపి 2'ను తెలుగులో కూడా చేయడం జరిగింది. హీరోగా నాకు ఇదే మొదటి తెలుగు సినిమా. ఈ చిత్రం కూడా మంచి హిట్ అవుతుందన్న నమ్మకం నాకుంది.

కొన్ని కారణాల వల్ల ఆలస్యం...

ముందుగా తమిళ్, తెలుగులో ఒకేసారి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని అనుకున్నాం. కానీ కొన్ని కారణాల వల్ల తెలుగులో ఆలస్యమైంది. ఇక తమిళంలో ఆగస్టు 11 దాటితే మంచి రిలీజ్ డేట్ లేదు. అందుకే అక్కడ ముందుగా విడుదల చేశాం. ఇక తెలుగులో శుక్రవారం 'విఐపి 2'ను రిలీజ్ చేస్తున్నాం.

కొత్త అనుభూతిని కలిగించే...

ఈ సినిమాలో హీరో క్యారెక్టర్, సెంటిమెంట్స్, కామెడీ, మాస్ ఎలిమెంట్స్ అన్నీ 'రఘువరన్ బి.టెక్'లో ఉన్నట్టే ఉంటాయి. కాజోల్ పాత్రను నేను ఎలా ఎదుర్కొన్నాను అనేదే ఇందులో కొత్తగా కనిపించే పాయింట్. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగించే సినిమా ఇది.

అందుకే సౌందర్య దర్శకురాలిగా...

నేను ఈ స్క్రిప్ట్ రాయగానే సినిమాను ఎలా ప్రారంభించాలి అనే దానిపై అస్సలు క్లారిటీ లేదు. అదే సమయంలో ఈ చిత్ర నిర్మాత కలైపులి థాను నాతో మాట్లాడుతూ... నేను ఒక సినిమా చేయాలని అనుకుంటున్నాను... సౌందర్య ఆలోచనలు కూడా గ్రాండ్‌గానే ఉంటాయని అన్నారు. దీంతో ఈ సినిమాకు ఆమె దర్శకురాలైతే బాగుంటుందని అనుకున్నాం.

కాజోల్ పాత్ర ప్రత్యేకంగా...

ఈ సినిమా కోసం కాజోల్ తమిళ్‌తో పాటు తెలుగులో నటించడానికి కూడా ఆసక్తి చూపారు. ఆమెకు ఈ సినిమా కథ నచ్చి ఇందులో నటించారు. కాజోల్ పాత్ర ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఆమె నటన ప్రేక్షకులకు ఎంతగానో నచ్చుతుంది. ఇక తమిళ్, తెలుగు భాషల్లో ఈ సినిమా షూటింగ్‌కు 52 రోజులు పట్టింది.

పనిచేయడమే నాకు రిలాక్సేషన్...

సౌత్‌తో పాటు బాలీవుడ్, హాలీవుడ్ సినిమాల్లో చేయడం ఎంతో ఆనందంగా ఉంది. అయితే బాలీవుడ్ నుండి పర్ఫెక్షన్ ఎలా ఉంటుందో నేర్చుకున్నాను. ఇక పనిచేయడమే నాకు రిలాక్సేషన్. ఎప్పుడూ పని చేస్తూనే ఉంటాను. చేసే పనిని ఎంజాయ్ చేయాలని అనుకుంటాను.


నందు, మిర్యాల రవీందర్ రెడ్డి, బోయపాటి శ్రీను, రకుల్‌ప్రీత్ సింగ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మానవ సంబంధాల నేపథ్యంలో మంచి సందేశం

మానవ సంబంధాల నేపథ్యంలో మంచి సందేశం

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్‌ప్రీత్ సింగ్ హీరోహీరోయిన్లుగా ద్వారకా క్రియేషన్స్ పతాకంపై బోయపాటి శ్రీను దర్శకత్వంలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన లవ్, ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జయ జానకి నాయక'. ఈ చిత్రం ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ను ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్‌ప్రీత్ సింగ్, బోయపాటి శ్రీను, మిర్యాల రవీందర్ రెడ్డి, నందు, ప్రభు, శివన్నారాయణ, శ్రావణ్, రూప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ''నా కెరీర్‌ను మలుపు తిప్పే సినిమా ఇచ్చిన బోయపాటి శ్రీనుకు కృతజ్ఞతలు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారు. మా టీమ్‌ను, కథను నమ్మి మిర్యాల రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని చాలా భారీగా నిర్మించారు''అని అన్నారు. హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ''ఒక మంచి సినిమాను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి థాంక్స్. ఈ చిత్రంలో మంచి సందేశం కూడా ఉంది. ఎమోషన్స్, సెంటిమెంట్, డ్రామా సీన్స్ అద్భుతంగా ఉన్నాయి. ఇన్ని సినిమాలు చేసిన నాకు జానకి క్యారెక్టర్‌కు వచ్చినంత స్పందన దేనికీ రాలేదు. నేను చాలా ఎంజాయ్ చేస్తూ చేసిన సినిమా ఇది. బోయపాటి శ్రీనుతో మరిన్ని చిత్రాల్లో నటించాలని ఉంది''అని తెలిపారు. మిర్యాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ''ఈ చిత్రం మూడో వారంలో కూడా హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో రన్ అవుతోంది. ఈ సినిమాను నిర్మించినందుకు గర్వంగా ఉంది. మంచి సందేశమున్న ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సినిమా హిట్‌తో మా బ్యానర్ విలువ మరింత పెరిగింది''అని చెప్పారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ ''ఈ సినిమాను ఎంతగానో నమ్మి చేశాను. ఎన్ని తరాలు మారినా మానవ సంబంధాలు మారవు. ఆ పాయింట్ మీద తీసిన సినిమాలు తప్పకుండా సక్సెస్ అవుతాయి. దీనికి మంచి ఉదాహరణ 'జయ జానకి నాయక' చిత్రం. ఇలాంటి చిత్రాలు ప్రతి ఒక్క కుటుంబానికి చేరువవుతాయి. ఈ చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టి చేశారు. ఈ చిత్రాన్ని ఇంత పెద్ద హిట్ చేసిన తెలుగు ప్రేక్షకులు అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను''అని పేర్కొన్నారు.

లవ్, యాక్షన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో...


తాతినేని సత్య, సచిన్ జోషి, సి.కళ్యాణ్, శివప్రసాద్ గుడిమిట్ల

సచిన్, ఇషా గుప్తా హీరోహీరోయిన్లుగా వై కింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై తాతినేని సత్య దర్శకత్వంలో రైనా జోషి నిర్మించిన చిత్రం 'వీడెవడు'. ఈ సినిమా సెప్టెంబర్ 8న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగిన కార్యక్రమంలో సచిన్ జోషి, తాతినేని సత్య, సి.కళ్యాణ్, శివప్రసాద్ గుడిమిట్ల తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సి.కళ్యాణ్ మాట్లాడుతూ ''డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా ఇది. టైటిల్ చాలా ఆసక్తికరంగా ఉంది. దర్శకుడు సత్య సినిమాను ఇంటెలిజెంట్ స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించాడు''అని చెప్పారు. తాతినేని సత్య మాట్లాడుతూ ''నేను చేసిన ఎస్ఎంఎస్, భీమిలి కబడ్డీ జట్టు, శంకర సినిమాలు అన్నీ రీమేక్ చిత్రాలే. తెలుగులో నేను చేసిన స్ట్రయిట్ మూవీ 'వీడెవడు'. బినేంద్ర మీనన్ సినిమాటోగ్రఫీ, తమన్ మ్యూజిక్ హైలైట్‌గా ఉంటుంది. సచిన్ జోషి అద్భుతంగా నటించారు. మంచి థ్రిల్లర్ మూవీ. అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయి. సినిమాను సెప్టెంబర్ 8న విడుదల చేస్తున్నాం''అని అన్నారు.

సచిన్ జోషి మాట్లాడుతూ ''ఈ థ్రిల్లర్ మూవీలో పాజిటివ్ యాంగిల్, నెగటివ్ యాంగిల్ రెండూ ఉన్నాయి. నాది ఛాలెంజింగ్ క్యారెక్టర్. యూనిక్ స్క్రీన్‌ప్లేతో సాగుతుంది. సినిమాలో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. లవ్, యాక్షన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే చిత్రమిది''అని పేర్కొన్నారు. ప్రభు, కిషోర్, సుప్రీత్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, వెన్నెల కిషోర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, ఆర్ట్: రఘుకులకర్ణి, ఫైట్స్: కనల్ కణ్ణన్, పాటలు: రామజోగయ్య శాస్త్రి, భాస్కరభట్ల, శ్రీమణి, కొరియోగ్రఫీ: సీజర్, జానీ.

అందమనేది చూసే కళ్లలోనే..



మలయాళంలో 'ప్రేమమ్'తో సినిమాల్లోకి అడుగుపెట్టి కేరళలో యూత్‌ను అలరించిన యంగ్ బ్యూటి అనుపమ పరమేశ్వరన్. 'అ..ఆ' సినిమాతో టాలీవుడ్‌లోకి వచ్చి ఇక్కడ అందరి ప్రశంసలను అందుకుంది. 'శతమానం భవతి' సినిమాతో అచ్చ తెలుగు అమ్మాయి అంటే ఇలాగే ఉంటుంది అనిపించేంత అందంగా కనిపించింది. ఈ మూవీ బంపర్ హిట్ అయినా ఎందుకో టాలీవుడ్ దర్శక నిర్మాతలు ఆమెపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. గ్లామర్ హీరోయిన్‌గా క్లిక్ అవడానికి కావాల్సిన అన్ని లక్షణాలు ఉన్న అనుపమ అందం గురించి చెబుతూ... ''ఒళ్లంతా కనిపించేలా... ఒంపుసొంపులన్నీ ఆరబోసేలా కనిపిస్తేనే అందంగా ఉన్నట్టు కాదు. ఓ అమ్మాయి చీర కట్టుకున్నా, చుడీదార్ వేసుకున్నా, లంగా ఓణీలో అయినా గ్లామరస్‌గానే కనిపించవచ్చు. చివరగా అందమనేది చూసే కళ్లపైనే ఆధారపడి ఉంటుంది తప్ప డ్రెస్సింగ్‌పైన కాదు''అని పేర్కొంది. తెలుగులో మరో రెండు సినిమాలు చేయబోతున్నాను అని చెబుతున్న అనుపమ తెలుగు భాషలో మరింత పట్టు సాధిస్తానని నమ్మకంగా చెబుతోంది. శతమానం భవతి చిత్రంలో తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకున్న ఈ భామ... దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, సతీష్ వేగేశ్నల దగ్గర ఎంతో నేర్చుకున్నానని చెప్పింది. వాళ్లిద్దరి సినిమాల్లో నటించడం తన అదృష్టమని అంటోంది. అయితే శతమానం భవతి తర్వాత ఎన్టీఆర్, రామ్‌చరణ్ వంటి స్టార్ల పక్కన నటించే అవకాశాలు వచ్చినట్టే వచ్చి ఆమె చేజారిపోయాయి. ''ఆ సినిమాలు ఎందుకు చెయ్యలేకపోయానో నేను కారణాలు బయటపెట్టలేను. బహుశా విధి అలా రాసిపెట్టి ఉండవచ్చు. లేదా ఆ అవకాశాలు మరోసారి రావచ్చు'' అని ఒకరకమైన వేదాంతం వల్లిస్తూ చెప్పింది అనుపమ.

అనుపమ పరమేశ్వరన్

మరోసారి ఆ అదృష్టం

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సినిమాలో ఛాన్స్ అంటే హీరోయిన్లంతా ఎగిరి గంతేస్తారు. ఎందుకంటే త్రివిక్రమ్ శ్రీనివాస్ సినిమాలో హీరోయిన్‌కు ఇటు గ్లామర్ పరంగా, అటు యాక్టింగ్ పరంగా మంచి పేరొస్తుంది. అందులోనూ స్టార్ హీరోలతో తీసే సినిమాల్లో ఛాన్స్ దొరికిందంటే అదృష్టం వరించిందన్న మాటే. మజ్ను సినిమాతో తెలుగులో అడుగుపెట్టిన సుందరి అను ఇమాన్యుయల్‌కు ఇప్పుడు అదృష్టం పూర్తిగా కలిసివస్తోంది. అతి తక్కువ సమయంలో త్రివిక్రమ్ డైరెక్షన్‌లో రెండో సినిమా చేసే అవకాశం ఆమె తలుపు తడుతోందట. ప్రస్తుతం త్రివిక్రమ్... పవన్‌కళ్యాణ్ సినిమా షూటింగ్‌లో ఫుల్ బిజీగా ఉన్నాడు. అత్తారింటికి దారేది వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత మరోసారి పవన్‌తో త్రివిక్రమ్ చేస్తున్న ఈ సినిమాలో అను ఇమాన్యుయల్, కీర్తి సురేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా పనులను శరవేగంగా పూర్తిచేస్తున్నారు. ఈ సినిమా తర్వాత ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ సినిమా చేసేందుకు స్క్రిప్ట్ రెడీ చేసుకుంటున్నాడు. ఇందులో హీరోయిన్‌గా అను ఇమాన్యుయల్ తీసుకోవాలని ఆయన ఆలోచిస్తున్నాడని తెలిసింది. ప్రస్తుతం ఎన్టీఆర్ 'జై లవ కుశ' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు.

ఈ సినిమా పని పూర్తయిన వెంటనే త్రివిక్రమ్ సినిమా షూటింగ్‌లో అతను పాల్గొంటాడు. ఇక తన సినిమాల్లో నచ్చిన హీరోయిన్‌ను వెంటనే రిపీట్ చేయడం త్రివిక్రమ్‌కు అలవాటే. అతని డైరెక్షన్‌లో వచ్చిన జల్సాలో నటించిన ఇలియానా తర్వాత జులాయి చిత్రంలోనూ నటించింది. అత్తారింటికి దారేదిలో నటించిన సమంత ఆతర్వాత అ...ఆ సినిమాలో చేసింది. వీరిద్దరి తర్వాత ఆ ఛాన్స్ మళ్లీ అను ఇమాన్యుయల్‌కు దక్కనుందని సమాచారం.


అను ఇమాన్యుయల్

అలీబాబాకు చెందిన యుసి బ్రౌజర్‌పై నిషేధం?

న్యూఢిల్లీ: చైనాకు చెందిన అలీబాబా సంస్థకు చెందిన యుసి బ్రౌజర్ భారత్‌లో ఎంత పాపులరో అందరికీ తెలిసిందే. ప్రతి ఒక్కరి స్మార్ట్‌ఫోన్‌లోనూ ఈ యాప్ కచ్చితంగా కనిపిస్తుంది. అయితే భారత్‌లో అత్యంత ప్రాచుర్యం పొందిన ఈ బ్రౌజర్‌ను రద్దు చేయనున్నట్టు తెలుస్తోంది. దేశీయ ప్రజల నుంచి డేటా దొంగిలిస్తోందంటూ చైనీస్ కంపెనీలపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ బ్రౌజర్‌ను నిషేధించే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ యూజర్ల డేటా దొంగతనానికి గురైందని వెల్లడైతే, భారత్‌లో యుసి వెబ్‌పై నిషేధం విధిస్తారని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. యుసి బ్రౌజర్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని ఆ అధికారి పేర్కొన్నారు. చైనాలోని సర్వర్లకు భారత యూజర్ల మొబైల్ డేటాను ఇది పంపిస్తుందని, ఈ అంశాన్ని తాము పరిగణలోకి తీసుకున్నామని అధికారి తెలిపారు. యుసి బ్రౌజర్‌కు భారత్‌లో నెలవారీ యాక్టివ్ యూజర్లు 100 మిలియన్లకు పైగానే ఉండడం విశేషం. గూగుల్ క్రోమ్ తర్వాత భారత్‌లో అత్యధికంగా వాడుతున్న వెబ్ బ్రౌజర్ యుసి బ్రౌజరే. మొబైల్ ఫోన్ సెగ్మెంట్ యాడ్స్‌లో దీని మార్కెట్ షేరు 48.7 శాతంగా ఉంది. అయితే యుసి వెబ్ సెక్యూరిటీని, ప్రైవసీని చాలా సీరియస్‌గా పరిగణలోకి తీసుకుంటుందని ఆ కంపెనీ అధికార ప్రతినిధి చెప్పారు.



బుధవారంనాడు హైదరాబాద్‌లో సిల్వర్ జూబ్లీ ముగింపు వేడుకలను హెరిటేజ్ ఫుడ్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎపి సిఎం చంద్రబాబు, ఎపి ఐటి శాఖమంత్రి లోకేశ్, నటుడు బాలకృష్ణ తదితరులు హాజరయ్యారు

కొద్ది సెకన్లలోనే నోకియా 6 సేల్

న్యూఢిల్లీ: ఎంతగానో ఎదురుచూస్తున్న హెచ్‌ఎండి గ్లోబల్‌కు చెందిన నోకియా 6 ఎట్టకేలకు మార్కెట్లోకి వచ్చింది. బుధవారం అమెజాన్ వెబ్‌సైట్ ద్వారా తొలి విక్రయాన్ని ప్రారంభించింది. ఆన్‌లైన్ మార్కెట్లో కొద్ది సెకనల్లో అవుట్ ఆఫ్ స్టాక్ కనిపించింది. జులై 14న రిజిస్ట్రేషన్లను ప్రారంభించినప్పటి నుంచి అమెజాన్‌పై 1 మిలియన్ రిజిస్ట్రేషన్లతో కీలక మైలురాయిని చేరుకుంది. జూన్‌లో నోకియా 3, నోకియా 5తో పాటు ఈ స్మార్ట్‌ఫోన్‌ను హెచ్‌ఎండి గ్లోబల్ లాంచ్ చేసింది. మిగతా రెండు స్మార్ట్‌ఫోన్లు ఆఫ్‌లైన్ స్టోర్లలో విక్రయానికి వచ్చాయి. నోకియా 6 మాత్రం బుధవారం విక్రయాలను ప్రారంభించింది. ఈ ఫోన్ లాంచ్ ఆఫర్లను కూడా అమెజాన్ లిస్టు చేసింది. మేట్ బ్లాక్, సిల్వర్, టాంపర్డ్ బ్లూ రంగుల్లో ఈ ఫోన్ అందుబాటులోకి ఉండనుంది. నోకియా 6 లాంచ్ ఆఫర్స్ ధర 14,999 రూపాయలు. అమెజాన్ పే బ్యాలెన్స్‌ను వినియోగిస్తే రూ.1000 క్యాష్ బ్యాంక్ ఉంది. నోకియా 6 ఫీచర్లు విషయానికొస్తే 16 మెగాపిక్సెల్ రియర్ కెమెరా, 8 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా, 5.5 అంగుళాల ఫుల్‌హెచ్‌డి ఐపిఎస్ డిస్‌ప్లే, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్, ఆండ్రాయిడ్ 7.1.1 నోగట్, డ్యూయల్ సిమ్, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 430 ఎస్‌ఒసి, 3జిబి ర్యామ్, 32జిబి స్టోరేజ్(128జిబి వరకు ఎక్స్‌పాండబుల్ మెమొరీ), 3000 ఎంఎహెచ్ బ్యాటరీ సామర్థ్య ఉన్నాయి.

5వ డెల్ చాంప్స్ ఇయర్‌ను ప్రారంభించిన డెల్

ముంబయి : డెల్ ఇండియా 5వ డెల్ చాంప్స్ ఇయర్‌ను ప్రారంభించింది. నేర్చుకునే ప్రక్రియలో పర్సనల్ కంప్యూటర్ల పాత్ర పెంపొందించే లక్ష్యంతో ఫ్లాగ్‌షిప్ స్కూలు ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తారు. విద్యా కార్యక్రమం 'డెల్ ఆరంభ్' చేపట్టిన కంపెనీ, దీని ద్వారా చిన్నారులకు కంప్యూటర్ల అందజేయాలనుకుంటోంది. నాలుగు సంవత్సరం దిగ్విజయంగా పూర్తి చేసిన డెల్ చాంప్స్ ఐదో సంవత్సరంలో ఈ కార్యక్రమాలను 25 టైర్ 2–4 పట్టణాలకు విస్తరించింది. 2లక్షల 50వేల మంది విద్యార్థుల నుంచి ఆసక్తి కనిపించనుందని డెల్ అంచనా వేస్తోంది.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31568.01	276.16	0.88%
నిఫ్టీ	9852.50	86.95	0.89%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27700	29625.67	-0.07%
ముంబై	28570	30556.15	0.32%
ఢిల్లీ	27950	29893.05	0.18%
కోల్‌కతా	28380	30352.94	0%
కేరళ	27000	28877.01	-0.37%
బెంగళూరు	27300	29197.86	0%
హైదరాబాద్	27660	29582.89	0.25%
గల్ఫ్	1365.57	1460.50	0%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42600.00	42300.00	0.71
ముంబై	42600.00	42300.00	0.71
ఢిల్లీ	42600.00	42300.00	0.71
కోల్‌కత్తా	42600.00	42300.00	0.71
హైదరాబాద్	42600.00	42300.00	0.71



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
వరంగల్	357	చిత్తూరు	390
విజయవాడ	359	చెన్నై	397
గోదావరి	359	బెంగళూరు	382

నందన్ నిలేకని రీఎంట్రీ!

• ఇన్ఫోసిస్‌కు మళ్లీ వచ్చే అవకాశాలు • రెండు రోజుల్లో రానున్న స్పష్టత





న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ సిఇఒగా విశాల్ సిక్కా రాజీనామా చేయడంతో కంపెనీ తీవ్ర కష్టాల్లో కూరుకుపోయింది. అదే సమయంలో సిక్కా వారసుడి ఎంపిక ప్రక్రియను కంపెనీ వేగవంతం చేసింది. ఇన్ఫీ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నిలేకని మళ్లీ ఐటీ దిగ్గజానికి తిరిగి రానున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. కంపెనీ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి ఒత్తిడి కారణంగానే పదవి నుంచి సిక్కా తప్పుకున్నారని బోర్డు విమర్శలు చేస్తోంది. ఈ నేపథ్యంలో సిక్కా వారసుడి ఎంపిక అంత సులువేమీ కాదనే వాదన వినిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో కొత్త సిఇఒ ఎంపిక కష్టమైందంటూ నిపుణులు కూడా భావిస్తున్నారు. అయితే హైప్రొఫైల్ వ్యవస్థాపకుడు నిలేకని వచ్చి, మళ్లీ సంస్థ పగ్గాలు చేపడితే కంపెనీ త్వరగా గాడిలో పడుతుందని భావిస్తున్నారు. అయితే దీనిపై ఓ స్పష్టత రావాలంటే మరో రెండు రోజుల సమయం పడుతుందని మీడియా నివేదికలు చెబుతున్నాయి. నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా బోర్డులోకి తిరిగి నిలేకని వచ్చేందుకు ఇన్వెస్టర్ సలహా సంస్థ అనుకూలంగా ఉంది. ఇన్ఫోసిస్ బోర్డు సిఇఒను కాపాడలేక పోయిందని, వారసుడి ఎంపిక కోసం పునరుద్ధరణ దిశగా తప్ప చర్యలు చేపట్టాలని ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ అడ్వైజరీ సర్వీసెస్(ఐఐఎఎస్) పేర్కొంది. మరోవైపు కంపెనీ సహవ్యవస్థాపకులు నారాయణమూర్తి బుధవారం ఇన్వెస్టర్లతో నిర్వహించనున్న సమావేశం వాయిదా పడింది. ఈ నేపథ్యంలోనే నందన్ నిలేకని పునరాగమనంపై మీడియాలో వార్తలు వస్తున్నాయి. నిలేకని ఇన్ఫీలోకి వస్తారన్న వార్తలు అటు స్టాక్‌మార్కెట్‌లో కూడా ఉత్సాహం నింపాయి.

ఇన్ఫీ షేర్లు 2.8 శాతం లాభాలను నమోదు చేశాయి. ఆయన మళ్లీ చేస్తే సానుకూల ఫలితాలు వస్తాయనడానికి ఇదే ఉదాహరణ అని మార్కెట్ నిపుణులు కూడా పేర్కొంటున్నారు. ఇన్ఫోసిస్‌ను నెలకొల్పిన ఏడుగురు వ్యవస్థాపకుల్లో నిలేకని ఒకరు అనే విషయం తెలిసిందే. ఈయన కంపెనీకి సీఈవోగా 2002 నుంచి 2007 వరకు బాధ్యతలు నిర్వహించారు. 2009లో ప్ర భుత్వం చేపట్టిన ఆధార్ కార్డు రూపకల్పన ప్రాజెక్టుకు ఆయన హెడ్‌గా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయన ఇన్ఫోసిస్ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. కాగా ఇన్ఫోసిస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై మార్కె ట్ నియంత్రణ సంస్థ సెబీ నిఘా పెట్టింది. సిక్కా రాజీనా మా చేసిన తర్వాత అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. కంపెనీ షేరు విలువ భారీగా పడిపోగా, మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.34 వేల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. ఇన్ఫీ అధికారులు ఉల్లంఘనల ఆరోపణలపై అమెరికా చట్ట సంస్థలు దర్యాప్తు చేస్తున్నారనే వార్తలు, వా టాదారుల ప్రయోజనాలను కాపాడే దిశగా సెబీ చర్యలు చేపట్టింది. కార్పొరేట్ పాలన దేశంలో ఇప్పటికీ పెద్ద స మస్యనని సెబీ చైర్మన్ త్యాగి ఇన్ఫోసిస్‌ను ఉద్దేశించి అన్నారు. ఉత్తమ కార్పొరేట్ పాలన ప్రమాణాలను సిఫారసు చేసేందుకు జూన్‌లో కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ సెప్టెంబర్ ముగింపు నాటికి నివేదిక ఇవ్వనుందని తెలిపారు. కోటక్ మహీంద్రా బ్యాంక్ ఎండి ఉదయ్ కోటక్ ఆధ్వర్యంలో 21 మంది సభ్యులతో ప్యానెల్‌ను ఏర్పాటు చేశామని అన్నారు.

సమావేశం ఈ నెల 29కి వాయిదా

విశాల్ సిక్కా రాజీనామాతో వారం రోజులుగా జరిగిన పరిణామాలపై ఇన్ఫోసిస్ కంపెనీ పెద్ద షేర్ హోల్డర్స్‌లలో ఆందోళనలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లకు భరోసా ఇచ్చేందుకు మూర్తి బుధవారం సమావేశం కాబోతున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే మూర్తి అనారోగ్య కారణాలరీత్యా సమావేశాన్ని ఈ నెల 29కి వాయిదా వేశారు. సమావేశం వాయిదా వేస్తున్నట్టు సంబంధిత వర్గాలు చెప్పాయి. కాగా సిక్కా తన పదవి నుంచి తప్పుకుంటూ తాను వైదొలగడానికి కారణాలను బ్లాగ్‌లో వెల్లడించారు. మూర్తి పేరును ప్రత్యక్షంగా ప్రస్తావించకుండా.. ఆయన నుంచి వచ్చిన ఒత్తిడి గురించి సిక్కా వివరించారు. సిక్కా ఆరోపణలపై మూర్తి కూడా ఘాటుగానే స్పందిస్తూ.. ఈ ఆరోపణలపై తగిన వేదికపై, తగిన సమయంలో స్పందిస్తానని కూడా మూర్తి చెప్పారు. సిక్కా దెబ్బకు కుదేలైన ఇన్ఫీ షేర్లతో, ఆ కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.34వేల కోట్ల తుడిచిపెట్టుకుపోయింది.

వచ్చే నెలలో రూ.200 నోటు



న్యూఢిల్లీ: కొత్త రూ.200 నోటును జారీ చేసేందుకు ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్)కి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నోట్ల రద్దు అనంతరం ప్రజలు ఎదుర్కొంటున్న చిల్లర సమస్యలను పరిష్కరించేందుకు, నకిలీ నోట్లకు చెక్ పెట్టేందుకు గాను ఆర్‌బిఐ ఈ కొత్త నోటును తీసుకురానుంది. ఇప్పటికే ఆర్‌బిఐ రూ.200 నోట్ల ముద్రణ చేపట్టింది. ఈ కొత్త నోటు సెప్టెంబర్ తొలి వారంలో చలామణిలోకి రానున్నట్లు సమాచారం. అయితే రూ. 200నోట్ల అందుబాటులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు 50 కోట్ల నోట్లను ముద్రించినట్లు తెలుస్తోంది. రూ.100, రూ. 500 మధ్య మరో కరెన్సీ నోటు ఇప్పటి వరకూ లేదు. అయితే రూ. 200 నోటు మంచి ఆదరణ పొందుతుందని ఆర్‌బిఐ భావిస్తోంది. రూ. 200నోట్లు అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్‌బీఐ అన్ని చర్యలు తీసుకుంటోందని అధికార వర్గాలు వెల్లడించాయి. డీమానిటైజేషన్(నోట్ల రద్దు) తర్వాత ప్రభుత్వం కొత్త రూ.2 వేల నోటును తీసుకొచ్చింది. పెద్ద నోటుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవడంతో ఆ తర్వాత కొద్ది రోజులకు కొత్త రూ.500 నోటును జారీ చేసిన విషయం తెలిసిందే.

రూ.2 వేల నోటును నిషేధించం: జైట్లీ

కొత్త రూ.2 వేల నోటుపై అనేక ఊహాగానాలు వెల్లువెత్తున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ స్పందించారు. ప్రభుత్వానికి రూ.2 వేల నోటును రద్దు చేసే ఆలోచన లేదని అన్నారు. రూ.200 నోటు గురించి మాట్లాడుతూ ఎప్పట్నుంచి జారీ చేసే విషయమై ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. తక్కువ నగదు విలువ కలిగిన కరెన్సీ కొరత దృష్ట్యా రూ.200 నోటును తీసుకొచ్చేందుకు ఆర్‌బీఐకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే రూ.2వేల నోటును రద్దు చేసే ప్రతిపాదనేదీ కేంద్రం వద్ద లేదని పేర్కొన్నారు. కొత్త నోట్లను ఎప్పటి నుంచి చలామణీలోకి తీసుకురావాలనే వివరాలను ఆర్‌బిఐనే చూసుకుంటుందని తెలిపారు.



బజాజ్ సిటి100 ఎలక్ట్రిక్ స్టార్ట్ వేరియంట్

న్యూఢిల్లీ: పాపులర్ బైక్ సిటి 100లో అప్‌గ్రేడెడ్ వెర్షన్‌ను బజాజ్ ఆటో సంస్థ బుధవారం ప్రారంభించింది. దీని ధరను రూ.38,806 గా నిర్ణయించింది. ఎలక్ట్రిక్ స్టార్ట్ తో ఆధునీకరించిన సిటి100 అల్లాయ్ ఇఎస్ కొత్త లుక్‌తో వచ్చింది. దేశవ్యాప్తంగా అన్ని అధికారిక బజాజ్ ఆటో డీలర్షిప్ల వద్ద ఈ వాహనం అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. ఫీచర్ల విషయానికి వస్తే వినూత్నమైన స్ప్రింగ్ సస్పెన్షన్, స్ప్రింగ్ టెక్నాలజీ, విప్లవాత్మకమైన 103 సిసి సింగిల్ ఇంజిన్, 4స్ట్రోక్ పెట్రోల్ మోటార్, 7.7 పిఎస్ పవర్, 8.24ఎన్ఎం టార్క్ ఉన్నాయి. ఆకర్షణీయమైన కొత్త డెకాల్ డిజైన్‌తో రూపొందించారు. రూ.38,806 ప్రారంభ ధరలో సిటి 100 ఎలెక్ట్రిక్ స్టార్ట్ వెర్షన్, ఎంట్రీ లెవల్ 100సిసి కమ్యూటర్ సెగ్మెంట్లో కస్టమర్ల సంఖ్యను పెంచుకోవాలని కంపెనీ చూస్తోంది.

సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం

న్యూఢిల్లీ: తదుపరి జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం సెప్టెంబర్ 9న జరుగనుందని తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారి తెలిపారు. జులై 1 నుంచి జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను)ను అమలు చేసిన తర్వాత ఇది మూడో భేటీ కానుంది. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాజెక్టులకు టాక్స్ రాయితీ అంశాన్ని తెలంగాణ సర్కార్ ప్రస్తావించనుందని అధికారులు తెలిపారు. బీడీ పరిశ్రమ, గ్రానైట్‌కు రాయితీ గురించి కూడా గుర్తు చేయనుందని చెప్పారు. జైట్లీతో పాటు పలు రాష్ట్రాల ఆర్థికమంత్రులు ఈ సమావేశానికి రానున్నారు.

ఎట్టకేలకు లాభాల వైపు..

• 276 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ సిఇఒ రాజీనామాతో ఒక్కసారిగా డీలాపడిన సూచీలు మూడు రోజులుగా అదే తంతును కొనసాగించాయి. అయితే బుధవారం దేశీయ స్టాక్‌మార్కెట్లు భారీ లాభాలను నమోదు చేసాయి. ప్రభుత్వం రంగ బ్యాంకులు భారీగా లాభపడ్డాయి. కొన్ని ప్రభుత్వ బ్యాంకుల విలీనానికి క్యాబినెట్ సూత్రప్రాయ ఆమోదం లభించిందన్న వార్తలు ఈ లాభాలకు కారణమయ్యాయి. మిడ్‌సెషన్ నుంచి జోరందుకున్న కొనుగోళ్లతో ఈక్విటీ మార్కెట్లు బలపడ్డాయి. దీంతో సెన్సెక్స్ 276 పాయింట్లు ఎగిసి 31,568 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 87 పాయింట్లు పుంజుకుని 9852 వద్ద స్థిరపడింది. సాంకేతికంగా కీలకమైన 9,850 స్థాయిని కూడా నిఫ్టీ అధిగమించడంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహం పెరిగింది. దాదాపు అన్ని రంగాలూ లాభపడగా ప్రధానంగా నిఫ్టీ బ్యాంక్ 1.27 శాతం ఎగసింది. మెటల్, ఫార్మా, రియల్టీ కూడా లాభపడ్డాయి. అటు డాలర్ మారకంలో రుపాయి స్వల్పంగా నష్టపోయి రూ.64.12వద్ద ఉంది. అలహాబాద్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ఆఫ్ ఇండియా తదితర ప్రభుత్వం రంగ బ్యాంకు షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు హెచ్‌యుఎల్ 1.05 శాతం, సన్ ఫార్మా 0.45 శాతం, ఐటిసి 0.28 శాతం, పవర్ గ్రిడ్ 0.21 శాతం, ఎం అండ్ ఎం 0.13 శాతం మేరకు నష్టపోయాయి.



జియో ఫోన్ బుకింగ్ నేటి నుంచే..

న్యూఢిల్లీ : ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. రిలయన్స్ జియో ఫోన్ బుకింగ్ నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి ప్రి–బుకింగ్ షురూ అవుతుందని కంపెనీ ప్రకటించింది. ఇండియా స్మార్ట్‌ఫోన్ అంటూ రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ గత నెలలో రిలయన్స్ 40వ వార్షిక సర్వసభ్య సమావేశంలో కొత్త ఫోన్‌ను పరిచయం చేశారు. ఉచితంగా అందించే ఫోన్ అయినప్పటికీ రూ.1500 సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని తెలిపారు. మూడేళ్ల తర్వాత ఆ డబ్బును తిరిగి వినియోగదారులకే ఇస్తామని జియో ప్రకటించింది. ఆగస్టు 24 నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. బుకింగ్ సమయంలో కేవలం వినియోగదారులు తమ వివరాలు మాత్రమే నమోదు చేస్తే సరిపోతుంది. ఫోన్ చేతికి అందిన వెంటనే రూ.1500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. జియో ఫోన్ ఫీచర్లు .. 2.4 అంగుళాల స్క్రీన్, ఆల్ఫాన్యూమరిక్ కీబోర్డుతో డిజైన్ చేశారు. దేశంలో 22 భాషలను సపోర్ట్ చేస్తుంది, వాయిస్ కమాండ్ ద్వారా పనిచేస్తుంది. జియో సినిమా యాప్‌లో సినిమాలు, టీవీ ఛానల్స్ ఉచితంగా చూడవచ్చు, కీపాడ్‌లో నెంబర్ 5లో అత్యవసర కాలింగ్ విధానాన్ని పొందు పరిచారు. నియర్ ఫీల్ కమ్యూనికేషన్ (ఎన్ఎఫ్‌సి) టెక్నాలజీ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. మెమొరీ కార్డు ద్వారా ఫోన్ మెమొరీ పెంచుకోవచ్చు. విజిఎ కెమెరా ఏర్పాటు చేశారు. ఎఫ్‌ఎం రేడియో, ఆడియో ప్లేయర్ అప్లికేషన్లు కూడా ఉన్నాయి. ఇందులో బ్లూటూత్ టెక్నాలజీ 4.10 వెర్షన్ ఉపయోగించారు. డ్యూయెల్ సిమ్ సదుపాయం ఉంది. రెండు సిమ్‌స్లాట్‌లు విఒఎల్‌టిఇని సపోర్ట్ చేస్తాయి. ఇక బుకింగ్స్‌ను ఏ విధంగా చేసుకోవాలో చూద్దాం...

వెబ్‌సైట్ ద్వారా..

- అధికారిక వెబ్‌సైట్ జియో.కామ్‌లోకి వెళ్లండి
- మీ మొబైల్ నంబరు, పిన్ కోడ్‌ను నమోదు చేయాలి. (ప్రి బుకింగ్ ప్రక్రియ కోసం ఆధార్ వివరాలు అవసరం లేదు)
- మొత్తాన్ని చెల్లించి, ఫోన్‌ను బుక్ చేసుకోవాలి
- మీరు విజయవంతంగా Jio ఫోన్‌ను బుక్ చేసుకుంటే ఎస్ఎంఎస్ ద్వారా సందేశం వస్తుంది.

మై జియో యాప్ ద్వారా...

- మీ ఫోన్లో మై జియో యాప్‌ను ఓపెన్ చెయ్యాలి
- జియో ప్రీ బుకింగ్ ఆప్షన్‌పై క్లిక్ చేయండి.
- మీ మొబైల్ నంబర్, పిన్ కోడ్ (ప్రి బుకింగ్ ప్రక్రియ కోసం ఏ ఆధార్ వివరాలు అవసరం లేదు) నమోదు చేయాలి.
- మొత్తాన్ని చెల్లించి, ఫోన్‌ను బుక్ చేసుకోండి.
- ఇలాగ మీరు విజయవంతంగా జియో ఫోన్‌ను బుక్ చేసుకుంటారు

ప్రీ బుకింగ్ : ఆఫ్లైన్ ప్రాసెస్

- సమీప జియో స్టోర్ లేదా రిటైల్ స్టోర్‌కు వెళ్లండి (అక్కడ జియో ఫోన్ బుకింగ్ అందుబాటులో ఉంటుంది).
- రిటైలర్‌కు అవసరమైన వివరాలు ఇవ్వాలి. రూ. 500 చెల్లించాలి.
- మీరు జియో ఫోన్ విజయవంతమైన బుకింగ్ చేసుకున్నట్టు ఎస్ఎంఎస్ వస్తుంది.
- రిటైలర్ మీకు అదే రసీదుని ఇస్తారు.

సిబిఐ ఎదుట హాజరైన కార్తీ చిదంబరం



న్యూఢిల్లీ: అవినీతి కేసులో మాజీ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పి చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం బుధవారం సిబిఐ ఎదుట హాజరయ్యారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా సీనియర్ చిదంబరం ఉన్నప్పుడు ఐఎన్ఎక్స్ మీడియాకు విదేశీ పెట్టుబడుల క్లియరెన్స్ ఇప్పించడంతోనే మలేషియా నుంచి నిధులు వచ్చినట్లు కార్తీపై ఆరోపణలు వచ్చాయి. ఇంద్రాణీ, పీటర్ ముఖర్జీ నిర్వహిస్తున్న ఐఎన్ఎక్స్ మీడియాతో కార్తీకి పరోక్షసంబంధాలు ఉన్నట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. గత జూన్‌లో తాము నిర్వహించబోయే విచారణకు హాజరు కావాలని సిబిఐ కార్తీకి నోటీసులు పంపింది. అయితే సిబిఐ ఎదుట హాజరయ్యేందుకు తనకు మరింత సమయం కావాలని కార్తీ తెలిపారు. దీంతో ఆయన విదేశాలకు పారిపోకుండా సిబిఐ లుకౌట్ నోటీసులు జారీ చేసినట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి. దీనిపై కార్తీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించడంతో సిబిఐ ఉత్తర్వులపై కోర్టు స్టే విధించింది. అనంతరం కేసును విచారించిన సుప్రీంకోర్టు హైకోర్టు ఉత్తర్వులను తోసిపుచ్చింది. విచారణ కోసం సిబిఐ ఎదుట హాజరు కావాలని చిదంబరాన్ని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది.

కర్ణన్‌కు హైకోర్టులో చుక్కెదురు



న్యూఢిల్లీ: కోర్టు ధిక్కరణ చట్టం రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సిఎస్ కర్ణన్ దాఖలు చేసిన అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు బుధవారం తోసిపుచ్చింది. కర్ణన్ రిట్ పిటిషన్‌లో ఎలాంటి పసలేనందు వల్ల దానిని కొట్టివేస్తున్నామంటూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్, జస్టిస్ సి.హరిశంకర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. తన క్లయింట్ కర్ణన్‌కు ఆరు నెలల జైలుశిక్షను విధించడంలో సుప్రీంకోర్టు సహజ న్యాయ సూత్రాలను పాటించలేదని ఆయన తరపు న్యాయవాది మాథ్యూస్ జె నెడుంపర తన పిటిషన్‌లో ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, విచారణలు అదే విధంగా తనకు వ్యతిరేకంగా ఉన్న సమాచారం గురించి కర్ణన్‌కు బాగా తెలుసునని ఈ సందర్భంగా బెంచ్ గుర్తు చేసింది. అంతేకాక తన చర్యకు గాను కర్ణన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు ఆయన తన వాదనను వినిపించుకునేందుకు పలుమార్లు ఆయనకు అవకాశం కల్పించామని కూడా తెలిపింది. కాగా, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా సుప్రీంకోర్టు మే 9న తనకు ఆరు నెలల జైలుశిక్షను విధిస్తూ ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, అది చెల్లదని ఆరోపిస్తూ తన వాదనను బలపరిచే దిశగా ఒక ప్రకటన చేయాలని కర్ణన్ తన పిటిషన్‌లో హైకోర్టును కోరారు.

'గోప్యత'పై నేడు సుప్రీంకోర్టు తీర్పు



న్యూఢిల్లీ: చాలాకాలంగా నలుగుతున్న వ్యక్తిగత గోప్యత అంశంపై సుప్రీంకోర్టు నేడు తీర్పును వెలువరచనుంది. గోప్యత హక్కు అనేది రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కా? అన్న అంశంపై ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం నేడు తీర్పును వెల్లడించే అవకాశముంది. ఇదే అంశంపై దాఖలైన పిటిషన్లను మూడు వారాల పాటు సుదీర్ఘంగా విచారించిన అనంతరం ఈ నెల 2న సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వు చేసింది. విచారణ సందర్భంగా గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా పరిగణించాలా? వద్దా? అనే అంశంపై అనుకూల, వ్యతిరేక వాదనలు బలంగానే విన్పించాయి. ఈ నేపథ్యంలో నేడు కోర్టు ఇవ్వనున్న తీర్పు పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఖేహర్‌తో పాటు ఈ విస్తృత రాజ్యాంగ ధర్మాసనంలో జె.చలమేశ్వర్, ఎస్ఎ బాబ్డే, ఆర్‌కె అగర్వాల్, ఆర్ఎఫ్ నారిమన్, ఎఎం సప్రి, డివై చంద్రచూడ్, ఎస్‌కె కౌల్, ఎస్.అబ్దుల్ నజీల్ కూడా సభ్యులుగా ఉన్నారు. గోప్యత హక్కుపై చేపట్టిన విచారణలో అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్, అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అరవింద్ దాతర్, కపిల్ సిబాల్, గోపాల్ సుబ్రమణ్యం, శ్యామ్ దివాన్, ఆనంద్ గ్రోవర్, సిఎ సుందరం, రాకేశ్ ద్వివేది సహా పలువురు సీనియర్ న్యాయవాదులు పాలుపంచుకున్నారు. కాగా, సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందడానికి ఆధార్‌ను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేయడాన్ని సవాలు చేస్తూ కుప్పలుతెప్పలుగా దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించిన సంగతి తెలిసిందే.

మణిపూర్ మాజీ సిఎం కన్నుమూత



ఇంఫాల్: మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి, తొలి లోక్‌సభ సభ్యుడు, కాంగ్రెస్ ప్రముఖ నాయకుడు రిషాంగ్ కీషింగ్(96) బుధవారం కన్నుమూశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జులై 1న రిమ్స్‌లో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 8.15 మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. రిషాంగ్ కీషింగ్ మణిపూర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలోని బుంగ్‌పా గ్రామంకు చెందినవారు. ఆయన 1952లో జరిగిన తొలి పార్లమెంట్ ఎన్నికల్లో నెగ్గారు. ఆయన మణిపూర్ రాజ్యసభ స్థానానికి కూడా ప్రాతినిధ్యం వహించారు. నాగా జాతియుడు అయిన కీషింగ్ మణిపూర్ ముఖ్యమంత్రిగా 1980 నుంచి 1988 వరకు, మళ్లీ 1994 నుంచి 1997 వరకు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన అనేక అవయవాలు పనిచేయడం మానేయడం వల్ల ఆయన కన్నుమూశారని ఆయనకు చికిత్స అందించిన 'రిమ్స్' వైద్యులు చెప్పారు.

రూ. 48 కోట్ల ఆస్తులు ఇడి అటాచ్


చెన్నై: మనీ లాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఓ విద్యా ట్రస్టు చైర్మన్‌కు సంబంధించిన రూ. 48 కోట్లు విలువైన ఆస్తులను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అటాచ్ చేసింది. తిరువల్లూరు ఆధారిత దీన్‌దయల్ మెడికల్ విద్యా ట్రస్టు చైర్మన్ టిడి నాయుడుకు చెందిన వ్యవసాయ భూములు, నివాస స్థలాలును అటాచ్ చేసిసినట్టు ఇడి అధికారులు వెల్లడించారు. మెడికల్ విద్యార్థులకు నకిలీ అడ్మిషన్ల పేరుతో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో 2015లో నాయుడును పిఎంఎల్ఎ చట్టం కింద ఇడి అరెస్ట్ చేసింది. బ్యాంకు నుంచి రూ. 136 కోట్లు, విద్యార్థుల నుంచి అడ్మిషన్ల పేరుతో రూ. 16 కోట్లు తీసుకుని చీటింగ్‌కు పాల్పడిన కేసులో మొత్తం రూ. 48 కోట్ల ఆస్తులను అటాచ్ చేసినట్టు ఇడి పేర్కొంది.

గో రక్షణ పేరుతో ఖజానా ఖాళీ!



లక్నో: రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో గోవుల మరణాల నేపథ్యంలో అధికార పార్టీ బిజెపిపై బిఎస్‌పి చీఫ్ మాయావతి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గో రక్షణ పేరుతో రాష్ట్ర నిధులను ఖాజేస్తున్నారని ఆమె ఆరోపించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 'గోమాతను రాజకీయం, కులమతాల సమస్యలతో ముడిపెడుతున్నారు. కానీ, గో సేవల పేరుతో ఎందుకు క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. బిజెపి పాలనలో పరిస్థితి దారుణంగా మారింది. మానవ జీవితానికి విలువే లేకుండా పోయింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వ సహాయ గోశాలలోనే గోవులు మరణాలు సంభవిస్తున్నాయి. ఎందుకంటే రాష్ట్రాల్లో అవినీతి పెచ్చుమీరడమే ఇందుకు కారణం' అంటూ మాయావతి దుయ్యబట్టారు. గోమరణాలపై ఆర్ఎస్ఎస్ ఎందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయడం లేదంటూ మండిపడ్డారు. గో సంరక్షణకు సంబంధించిన పథకాలు, అవినీతిపై సమీక్ష జరపాల్సిందిగా మాజీ సిఎం మాయావతి డిమాండ్ చేశారు.

ఎస్‌సిఒ సదస్సుకు రాజ్‌నాథ్



న్యూఢిల్లీ: కిర్గిజ్ రిపబ్లిక్‌లో విపత్తుపై నేటి నుంచి ప్రారంభం కానున్న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) సమావేశానికి కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నారు. ఈ ద్వైపాక్షిక సమావేశంలో రాజ్‌నాథ్.. ఎస్‌సిఒ సభ్య దేశాల మంత్రులతో దేశ విపత్తు నివారణ, సాయంపై చర్చించనున్నట్టు అధికార ప్రకటన పేర్కొంది. ఈ నెల 24, 25 తేదీల్లో చాప్లన్ అటాలో జరిగే 9వ ఎస్‌సిఒ సమావేశానికి భారత ప్రతినిధి బృందంలో రాజ్‌నాథ్ సహా కేంద్ర హోం మంత్రిత్వశాఖ నుంచి సీనియర్ అధికారులు, జాతీయ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారులు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో అత్యవసర పరిస్థితుల నివారణ, తొలగింపుపై ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

బ్యాంకుల విలీనం?

- ఎస్‌బిఐ తరహాలో మిగిలిన 20 పిఎస్‌బిల ఏకీకరణకు రంగం సిద్ధం
- ప్రతిపాదనల పరిశీలనకు ప్రత్యామ్నాయ యంత్రాంగం
- కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం





న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంకుల స్థిరీకరణ, పటిష్టతకు వచ్చే ప్రతిపాదనలను పరిశీలించేందుకు ప్రత్యామ్నాయ యంత్రాంగాన్ని(ఎఎం) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. యంత్రాంగ విధివిధానాలను ప్రధాని మోడీ ఖరారు చేస్తారని ఆరిక మంత్రి జైట్లీ కేబినెట్ నిర్ణయాన్ని వెల్లడించారు. విలీనం ద్వారా తక్కువ సంఖ్యలో అయినా పటిష్ట రుణ సంస్థలుగా బ్యాంకులను తీర్చిదిద్దడం లక్ష్యంగా ఈ ప్రత్యేక ఏర్పాటు చేస్తారు. ఈ ప్రత్యామ్నాయ ఏర్పాటు పనితీరును మంత్రుల స్థాయి కమి టీ పర్యవేక్షిస్తుంది. బ్యాంకుల విలీనం, సముదాయంగా మార్చడం వంటి ప్రతిపాదనలపై ఈ ప్రత్యామ్నాయ విభాగం పరిశీలన నిర్వహిస్తుంది. దీని ఏర్పాటుకు సూత్రప్రాయ ఆమోదం దక్కిందని జైట్లీ తెలిపారు. తుది నిర్ణయం రిజర్వ్ బ్యాంక్‌తో సంప్రదింపుల తరువాత తీసుకుంటారు. చట్టాలు, సెబీ అవసరాల మేరకు బ్యాంకుల ఏకీకరణ చర్యలు ఉంటాయని వెల్లడించారు. రుణ ప్రదాత వ్యవస్థలో బ్యాంకింగ్ రంగానికి ప్రాధాన్యత విస్తరిస్తోంది. ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బ్యాంకులు రుణాలను పటిష్ట రీతిలో అందించాల్సి ఉంది. ఇందుకు కేవలం ప్రభుత్వ నిర్ణయాలపై, సాయంపై ఆధారపడకుండా తగు నిర్ణయాలు తీసుకోవల్సి ఉందని జైట్లీ అభిప్రాయపడ్డారు. విస్తృత, పటిష్ట లెండర్స్ లీడర్స్‌ను సృష్టించడమే బ్యాంకుల విలీన, ఏకీకృత ఉద్దేశం అని స్పష్టం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా రుణ సాయం అందించాల్సి ఉంటుంది. దీనికి తగ్గట్లుగా ప్రభుత్వ రంగ బ్యాంకులను పటిష్టం చేయాల్సి ఉంది. బ్యాంకుల సంఖ్య కాదు బ్యాంకుల పనితీరు కీలకంగా మార్పులు ఉంటాయని, వీటన్నింటినీ ఇప్పుడు ఏర్పాటు అయ్యే ప్రత్యేక యంత్రాంగం పర్యవేక్షిస్తుందని జైట్లీ తెలిపారు. ఎస్‌బిఐ కాకుండా ఇప్పుడు 20 పిఎస్‌బిలు ఉన్నాయి.

రైల్వే బోర్డు కొత్త చైర్మన్‌గా ఎయిరిండియా సిఎండి



న్యూఢిల్లీ: యుపిలో వరుస రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే బోర్డు ఛైర్మన్ పదవికి ఎకె మిట్టల్ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో కొత్త చైర్మన్‌గా ఎయిర్ ఇండియా సిఎండి అశ్వని లోహానిని బుధవారం నియమించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవలి రైలు ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలనుకుంటున్నట్లు ప్రధాని మోడీతో చెప్పానని రైల్వే మంత్రి సురేష్ ప్రభు వెల్లడించిన కొన్ని గంటలకే కేంద్ర సిబ్బంది నియామకాల కమిటీ ఈ మేరకు ప్రకటన చేయడం గమనార్హం. రైల్వే బోర్డు ఛైర్మన్‌గా లోహాని నియామకానికి సంబంధించిన అవసరమైన సమాచారాన్ని రైల్వే మంత్రిత్వ శాఖకు నివేదించామని కమిటీ తెలిపింది. రైల్వే మంత్రికి మిట్టల్ మంగళవారం సాయంత్రం పంపిన రాజీనామా లేఖ బుధవారం ఉదయం ఆమోదించబడిందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రైల్వే మెకానికల్ సర్వీసు అధికారి అయిన లోహాని...గతంలో డివిజనల్ రీజనల్ మేనేజర్ (ఢిల్లీ)గానూ, ఐటిడిసి ఛైర్మన్‌గానూ, ఇక్కడ రైల్ మ్యూజియం డైరెక్టర్‌గానూ పని చేశారు.

మధ్యప్రదేశ్ గెస్ట్‌హౌస్‌కు ఢిల్లీలో భూమి

న్యూఢిల్లీ: దేశరాజధానిలో మధ్యప్రదేశ్ ప్రభుత్వ అతిథి గృహ నిర్మాణానికి కేంద్రం 1 ఎకరా 478 గుంటల భూమిని కేటాయించింది. దీనికి సంబంధించిన నిర్ణయానికి కేంద్రం ఆమోదం తెలిపిందని బుధవారం నాడు ఓ అధికార ప్రకటన వెలువరించారు. ఢిల్లీలో ఛాణక్యపురి ప్రాంతంలో జీస్, మేరీ మార్గ్ నడుమ టీ జంక్షన్ వద్ద ఈ భూమి స్థలం ఖరారు చేశారు.

నేరెళ్లపై రాష్ట్రపతికిఫిర్యాదు

మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలు, నేరెళ్ల ఘటన, దళితులపై దాడులు, ధర్నాచౌక్ ఎత్తివేత వంటి అంశాలపై రాష్ట్రానికి చెందిన అఖిలపక్ష నేతలు సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రపతిని రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి మూడు పేజీల వినతిపత్రం అందజేశారు. డి రాజా నేతృత్వంలో రాష్ట్రపతిని కలిసిన వారిలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టిటిడిపి అధ్యక్షుడు ఎల్ రమణ, టిజెఏసి చైర్మన్ కోదండరామ్, కాంగ్రెస్ ఎంఎల్ఎ సంపత్ సహా 12 మంది నేతలు ఉన్నారు. అనంతరం అఖిలపక్ష నేతలు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజాస్వామిక విధానాలపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్లు అఖిలపక్ష బృందం నేతలు వివరించారు. నేరెళ్ల ఘటన జరిగి 50 రోజులు అవుతున్నా.. ఘటన బాధ్యులపై ఇప్పటివరకు చట్టపరమైన చర్యలు తీసుకోలేదని రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తెలంగాణలో ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాలేలా కేంద్ర హోంమంత్రికి సూచించాలని తాము కోరినట్లు చెప్పారు. తెలంగాణలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని, టిఆర్ఎస్ పార్టీ నాయకుల బంధువులు ఇసుక మాఫీయాలో ఉన్నారని రాష్ట్రపతికి వివరించినట్లు చాడ వెంకటరెడ్డి తెలిపారు. దళితుల హక్కులపై జరుగుతున్న దాడుల విషయంలో జోక్యం చేసుకోవాలని కోరామన్నారు. ముఖ్యమంత్రి తనయుడు కెటిఆర్ సొంత నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణా ఎక్కువగా జరుగుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకు వెళ్లామని చాడ తెలిపారు. పేదలు, దళితులంటే సిఎం కెసిఆర్‌కు చిన్నచూపు అన్న విషయాన్ని, నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు న్యాయం జరగని పరిస్థితిని రాష్ట్రపతి చెప్పామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రపతికి తెలంగాణలో పరిస్థితిని వివరించిన తరువాత ఆయన కనబర్చిన వైఖరి సానుకూలతను ఇచ్చిందని, జాతీయ స్థాయిలో మేము చేస్తున్న ఒత్తిడి రాష్ట్రప్రభుత్వం పై ఖచ్చితంగా ఉంటుందని కోదండరాం అన్నారు. అఖిలపక్ష బృం దం నాయకులు తెలంగాణ ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ గత 3 రోజులుగా ఢిల్లీ స్థాయిలో జరిపిన పర్యటన సత్ఫలితాలను ఇచ్చిందని, సిఎం కెసిఆర్ వైఖరిని జాతీయ స్థాయి దృష్టికి తీసుకు వెళ్లడంలో సఫలీకృతులము అయ్యామని అఖిలపక్ష నేతలు అభిప్రాయపడ్డారు.

బిజెపి ఎంఎల్ఎ స్కూలు బస్సుకు టీనేజర్ బలి

లక్నో: దేవరియా జిల్లాలో ఓ స్కూలు బస్సు 14 ఏళ్ల టీనేజర్ ప్రాణాలు బలిగొంది. దీంతో స్థానికులు నిరసనకు దిగారని పోలీసులు తెలిపారు. బిజెపి ఎంఎల్ఎ సురేశ్ తివారీ నడిపే లగ్న దేవీ తారాకాంత్ సీనియర్ సెకండరీ కాలేజికి చెందిన బస్సు అది. అయితే ఆ బిజెపి ఎంఎల్ఎ మృతుడి కుటుంబానికి తన సంతాపాన్ని ప్రకటించి నష్టపరిహారం ఇస్తానని అన్నారు. భాలిచౌర్ గ్రామానికి చెందిన మోహన్ నిశాద్ ఉదయం 7.30 గంటలకు దగ్గరలోని ఘూలిచౌక్ గ్రామంలోని దుకాణానికి వెళుతుండగా బర్హాజ్ అసెంబ్లీ నియోజకవర్గం ఎంఎల్ఎ సురేశ్ తివారీ బస్సు ఢీకొంది. ఆ టీనేజర్ అక్కడికక్కడే చనిపోయాడు. దాంతో స్థానికులు నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డును దిగ్బంధించారు. ఆ బస్సును ధ్వంసం చేసి డ్రైవరు రఘుబర్ పాల్‌ను కూడా చితకబాదారు. ప్రస్తుతం ఆ డ్రైవరు హాస్పిటల్‌లో చికిత్సపొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తీర్పు సమీక్ష లేనే లేదు : సుప్రీం

అవినీతి కేసులో శశికళకు ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ: లెక్కకు మించిన ఆస్తుల కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న జయ నెచ్చెలి శశికళకు సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలింది. ఆస్తుల కేసులో తమను దోషులుగా ఖరారు చేస్తూ ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని శశికళ, ఆమె సమీప బంధువులు పెట్టుకున్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం బుధవారం తోసిపుచ్చింది. ఇంతకు ముందు వెలువరించిన ఉమ్మడి తీర్పులో ఎలాంటి తప్పిదాలు లేవని భావిస్తున్నందున అంతా సక్రమంగానే జరిగినట్లుగా నిర్ధారించుకున్నందున ఇప్పుడీ రివ్యూ పిటిషన్లకు అనుమతించాల్సిన అవసరం లేదని భావిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. శశికళతో పాటు సమీపబంధువులు ఇలవరసి, విఎన్ సుధాకరన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. రికార్డుల పరిశీలనకు సంబంధించి ఎలాంటి పొరపాట్లు జరగలేదని, సమీక్షకు అవకాశం లేదని న్యాయమూర్తులతు ఎస్ఎ బోబో అమిత్వా రాయ్‌తో కూడిన ధర్మాసనం రెండు వేర్వేరు పిటిషన్లను కొట్టివేయడంతో శశికళకు ఆశాభంగం కల్గింది. కేసులో ప్రధాన నిందితురాలైన నిందితురాలు జయలలితపై ఉన్న అభియోగాలను కొట్టివేసినందున తమను కూడా వీటి నుంచి తప్పించాలని పిటిషనర్లు కోరారు. ప్రజా సంబంధిత వ్యక్తిపై ఉన్న అవినీతి కేసును కొట్టివేసినందున, తమ వంటి ప్రైవేటు వ్యక్తులపై ప్రభుత్వ ధనం దుర్వినియోగపు అభియోగాలలో పసలేదని స్పష్టం చేశారు. శశికళ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రొహత్గీ వాదించారు. కేసులో తీర్పును ఇంతకు ముందు వెలువరించిన జస్టిస్ పిసి ఘోష్ రిటైర్ అయినందున , సరికొత్తగా తమ రివ్యూ పిటిషన్‌పై విచారణను బహిరంగంగా నిర్వహించాల్సి ఉందని న్యాయవాది కోరారు.జయలలిత కేసుపై ఈ ఏడాది ఫిబ్రవరి 14న తీర్పు వెలువరించింది.శశికళ దోషిగా ఖరారు అయింది. శశికళతో దివంగత జయలలిత కుమ్మక్కు అయి అక్రమ దారిలో ఆస్తులు కూడబెట్టుకున్నారనే అభియోగాలపై దోషిత్వం ఖరారు అయింది.

హోసూరు ఎంఎల్ఎ ఇంటికి శశికళ

బెంగళూరు: స్థానిక సెంట్రల్ జైలులో ఉన్న అన్నాడిఎం ప్రధాన కార్యదర్శి వికె శశికళకు కర్నాటక డిఐజి రూపా మరో షాక్ ఇచ్చారు. స్థానిక పరప్పన అగ్రహార జైలులో ఉన్న శశికళ తరచూ జైలుకు సమీపంలో ఉన్న హోసూరు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లుతున్నారని, పైగా షాపింగ్‌లకు కూడా వెళ్లి వస్తున్నారని ఆరోపించారు. తన వద్ద దీనికి సంబంధించి వీడియోలతో కూడిన సాక్ష్యాధారాలు ఉన్నాయని రూపా బుధవారం కర్నాటక ఎసిబికి ఇచ్చిన నివేదికలో తెలిపారు. సాధారణ ఖైదీలాగా ఉండాల్సిన శశికళకు జైలులో అన్ని విధాలుగా రాజమర్యాదలు దక్కుతున్నాయని ఇంతకు ముందు తెలిపిన రూప ఇప్పుడు ఈ కొత్త ఆరోపణ చేయడం సంచలనం కల్గించింది. శశికళ ఓ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి వస్తున్న అంశాన్ని జైలు ప్రధాన ద్వారం వద్ద అమర్చి ఉండే సిసిటీవీ కెమెరాలలోని ఫుటేజ్‌ల ద్వారా తనిఖీ చేసుకోవచ్చునని శశికళ తెలిపారు. గేట్ 1, గేట్ 2 వద్ద ఉండే కెమెరాలను వెంటనే స్వాధీనపర్చుకుని పరిశీలిస్తే మరిన్ని నిజాలు వెల్లడి అవుతాయన్నారు.

తమిళ అసెంబ్లీలో బలపరీక్ష?

చెన్నై: ప్రస్తుత పరిస్థితుల్లో తమిళనాడు అసెంబ్లీలో బలపరీక్ష సాగాలని, పళనిస్వామికి బలం ఉన్నదీ లేనిదీ సభలో తేలాల్సి ఉందని ప్రధాన ప్రతిపక్షం డిఎంకె డిమాండ్ చేసింది. అధికార పార్టీలో అసమ్మతి వ్యక్తం కావడంతో అసెంబ్లీలో బలనిరూపణ జరగాల్సి ఉందని కాంగ్రెస్ కూడా డిమాండ్ చేసింది. రాష్ట్ర గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు వెంటనే జోక్యం చేసుకుని బల పరీక్షకు తేదీ ఖరారు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేత కెఆర్ రామస్వామి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిపై తమకు విశ్వాసం లేదని కొందరు ఎమ్మెల్యేలు గవర్నర్‌కు లేఖలు రాసినట్లు వెల్లడైందని, దీనితో బల నిరూపణకు వెంటనే అసెంబ్లీ ఏర్పాటు చేయాలని గవర్నర్‌కు రామస్వామి ఓ లేఖ పంపించారు. మరో వైపు అన్నాడిఎంకెలో ఒంటరి అయిన శశికళ మేనల్లుడు టిటివి దినకరన్ తన వ్యతిరేకులపై చర్యలకు దిగారు. జయపేరిటవెలిసిన పార్టీ ఫోరం ప్రధాన కార్యదర్శి పదవి నుంచి రెవెన్యూ మంత్రి ఆర్‌బి ఉదయకుమార్‌ను తొలిగిస్తున్నట్లు దినకరన్ ప్రకటించారు.

కేజ్రీవాల్ ప్రతిస్పందన కోరిన హైకోర్టు



న్యూఢిల్లీ: జైట్లీ పెట్టుకున్న తాజా పిటిషన్‌పై ప్రతిస్పందన ఇవ్వాల్సిందిగా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ హైకోర్టు బుధవారం ఆదేశించింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి వ్యతిరేకంగా కించపరిచే మాటలను ఉపయోగించాలని తన న్యాయవాది రామ్‌జెఠ్మాలనీకి సూచించలేదని దాఖలు చేసిన కేజ్రీవాల్ తప్పుడు అఫిడవిట్ దాఖలు చేయండంపై చర్యలు చేపట్టాలని జైట్లీ తాజా వినతి దాఖలు చేశారు. కేజ్రీవాల్, ఆప్ పార్టీకి చెందిన రాఘవ్ చద్దా, కుమార్ విశ్వాస్, అశుతోష్, సంజయ్ సింగ్, దీపక్ బాజ్‌పేయి అనే ఇతర నాయకులపై రూ. 10 కోట్ల పరువునష్టం దావాను జైట్లీ వేశారు. కేజ్రీవాల్ తరపున వాదించిన రామ్‌జెఠ్మాలనీ మే 17న క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా కించపరిచే పదాలు ఉపయోగించారు. కేంద్ర మంత్రి విషయంలో అలాంటి కించపరిచే పదాలు ఉపయోగించాలని కేజ్రీవాలే తనకు సూచించారని కోర్టుకు తెలిపారు. మే 17న జరిగిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో జైట్లీకి, రామ్‌జెఠ్మాలనీకి మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఇదిలా ఉండగా మరో పరువునష్టం దావా కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాపై అభియోగాలు నమోదు చేసేందుకు ఢిల్లీ కోర్టు సెప్టెంబర్ 14 గడువు పెట్టింది. ఈ కేసులో వీరిద్దరితోపాటు యోగేంద్ర యాదవ్ అనే ఆప్ మాజీ నాయకుడిపై కూడా అభియోగాలు నమోదు చేయాలని కోరింది. ఆప్ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా 2015 వరకు ఉన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోటీకి 2013లో ఆప్ తరఫున దరఖాస్తు దాఖలు చేశాడు. కానీ ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ టికెట్ ఇవ్వాలని నిర్ణయించి తర్వాత నిరాకరించడం జరిగింది. దాంతో అతడు స్వరాజ్ ఇండియా అనే స్వంత పార్టీని పెట్టుకున్నాడు. కానీ తనపై వార్తా పత్రికలలో వచ్చిన ఆర్టికల్స్ తనకు కోర్టుబార్‌లో, సమాజంలో పరువునష్టం కలిగించాయని యాదవ్ చెప్పాడు. అతడు దాఖలు చేసిన ఫిర్యాదుపై విచారణ కొనసాగుతున్నది.

భారత్‌లో నేపాల్ ప్రధాని పర్యటన



న్యూఢిల్లీ: నాలుగు రోజుల పర్యటనకు గానూ బుధవారం ఢిల్లీకి చేరుకున్న నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాతో ప్రధాని నరేంద్ర మోడీ విస్తృత చర్చలు జరపనున్నారు. జూన్‌లో నేపాల్ ప్రధానిగా దేవ్‌బా ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మొదటి సారిగా భారత్‌లో పర్యటిస్తున్నారు. గురువారం ద్వైపాక్షి అంశాలన్నింటిపై ఇరువురు నేతలు చర్చలు జరపనున్నారు. వ్యాపారం, పెట్టుబడితోపాటు పలు రంగాలలో భారత్, నేపాల్‌ల మధ్య సంబంధాలను పెంపొందించుకోనున్నారు. షేర్ బహదూర్ దేవ్‌బాకు ఢిల్లీ విమానాశ్రయంలో విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ స్వాగతం పలికారు. దేవ్‌బాకు ప్రత్యేకంగా స్వాగతం పలుకుతున్న సుష్మా ఫొటోను విదేశాంగ ప్రతినిధి రవీశ్ కుమార్ ట్వీట్ చేశారు. నేపాల్‌లో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితి గురించి దేవ్‌బా, మోడీకి తెలిపే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత సంతతికి చెంది మాధేసి సమాజిక వర్గ సమస్యలను పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలను మోడీకి వివరించనున్నారు. ఇరు దేశాల మధ్య పరస్పర ప్రయోజనాలు, స్నేహ బంధాన్ని బలోపేతం చేయడానికి గతంలో చేసుకున్న ప్రత్యేక ఒప్పందలపై చర్చించనున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. తన పర్యటనలో భాగంగా దేవ్ బా హైదరాబాద్, బోధ్‌గయలను సందర్శించనున్నారు.

సంబంధాలు బల పడితే సంతోషమే : చైనా

నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా భారత్ పర్యటనపై చైనా స్పందించింది. అంతర్జాతీయ ఒప్పందాలు లాభ, నష్టాలకు సంబంధించినవి కావని పేర్కొంది. నేపాల్ ప్రధాని భారత్ పర్యటనపై చైనా ఆందోళన చెందుతోందన్న మీడియా కథనాలపై స్పందిస్తూ ఇరు దేశాలు బలమైన ఒప్పందాలు చేసుకుంటే తమకు సంతోషమేనని పేర్కొంది. బిఆర్ఐతో ఇరువురికి లాభం చేకూరుతుందని తాము నమ్ముతున్నామని హువా తెలిపారు. బిఆర్ఐలో చేరే దేశాలను విశాల దృక్పథంతో చైనా స్వాగతిస్తుందని ఆయన అన్నారు. ఉమ్మడి శ్రమ వల్లే వచ్చే లాభాలు ఇరువురికి పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

క్లాస్‌మేట్‌పై విద్యార్థిని విషప్రయోగం

సాత్నా (మధ్యప్రదేశ్): పరీక్షల్లో తన కంటే ఎక్కువ మార్కులు వచ్చాయన్న అక్కసుతో ఎనిమిదో తరగతి చదివే ఒక విద్యార్థిని తన సహాధ్యాయినిపై విషప్రయోగం చేసి చివరకు తాను కూడా ఆత్మహత్యకు ప్రయత్నించిన ఉదంతమిది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇక్కడ ఒక ప్రైవేటు స్కూల్‌లో బాధిత, నిందిత బాలికలిద్దరూ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. అయితే తన కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకుందన్న కోపంతో నిందిత బాలిక తన సహాధ్యాయిని నీళ్ల సీసాలో సోమవారం మశక వికర్షకాన్ని (దోమలను మట్టుపెట్టే మందు) కలిపింది. ఆ విషయం తెలియక బాధిత బాలిక ఆ నీళ్లను తాగింది. దాంతో తనకు అస్వస్థతగా ఉందంటూ వాంతులు చేసుకుంది. ఆమె తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతో వారు ఆమెను హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని సివిల్ లైన్స్ పోలీసు స్టేషన్ ఇన్‌చార్జ్ భూపేంద్ర సింగ్ చెప్పారు. తరగతి గదిలో ఏర్పాటు చేసిన సిసిటివిలో బాధిత బాలిక నీళ్ల సీసాలో నిందితురాలు దోమల మందును కలుపుతున్నట్లు రికార్డయిందని ఆయన తెలిపారు. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు తనను తీసుకెళ్తారేమోనన్న భయంతో నిందిత బాలిక కూడా మంగళవారం ఇక్కడ తన ఇంట్లో అదే దోమల మందుతో ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను జిల్లా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నామని, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని డాక్టర్ సుధీర్ సింగ్ చెప్పారు. కాగా, ఐపిసిలోని సెక్షన్ 328(విష ప్రయోగం ద్వారా హాని చేయడం) కింద నిందిత బాలికపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



వెనుకబడ్డ గ్రామాలపై ప్రత్యేక దృష్టి : జూపల్లి

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, వెనుకబడ్డ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించా రు. ఈ సమావేశంలో ఉపాధిహామీ పనులు, మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, డంపింగ్ యా ర్డులు, వైకుంఠధామాల నిర్మాణంపై చర్చించా రు. అలాగే హరితహారంలో భాగంగా మొక్కలు నాటడంతోపాటు, వాటిని సంరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో పోల్చితే ఉపాధిహామీ పనుల్లో వేగం పెంచగలిగామని, గత ఆర్థిక సంవత్సరంలో పూర్తి స్థాయిలో నిధులు సద్వినియోగం చేసుకోగలిగామని అన్నా రు. ఈ సారి కూడా ఆశించిన స్థాయిలో పనులు సాగుతాయని తెలిపారు. అయితే కొన్ని గ్రామా లు పూర్తిగా వెనుకబడ్డాయని, అలాంటి గ్రామాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి మండలంలో వెనుకబడ్డ రెండు గ్రామాల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డ్, వైకుంఠధామం ఏర్పాటు చేసే దిశగా సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఉగ్రనేరం కప్పిపుచ్చుడానికే భారత్‌పై పాక్ ఆరోపణలు : అమెరికా



వాషింగ్టన్: ఉగ్రవాదులకు ఊతం ఇస్తున్న పాకిస్థాన్ తన తప్పును తప్పిపుచ్చుకోవడానికి భారత్‌పై ఆరోపణలు చేస్తోందని అమెరికా ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. భారత దేశం అఫ్గాన్‌ను చుట్టు ముడుతోందని పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. అఫ్గాన్‌లో భారత్ చేస్తున్నది పాక్‌కు ఎంతమాత్రం ప్రమాదకరం కాదని జాతీయ భద్రతా మండలి ప్రతినిధి మైఖేల్ ఆంటన్ వ్యాఖ్యానించారు. అక్కడ భారత్ సైనిక స్థావరాలను నిర్మించడం లేదని, బలగాలను మోహరించడం లేదని ఆయన పేర్కొన్నారు. టెర్రరిస్టు గ్రూపులకు నేరుగా సహాయపడుతున్న పాక్ నేరాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు.

కశ్మీర్ అంశం మళ్లీ ప్రస్తావించిన పాక్

ఇస్లామాబాద్: తాము టెర్రరిస్టులకు ఆశ్రయమిస్తున్న అమెరికా ఆరోపణను పాకిస్థాన్ ఖండించింది. ఆధిపత్య సాధనకు విధానాలు అనుసరిస్తూ సంక్లిష్టమైన రాజకీయాలు ఆడడమే సమస్యగా ఉందని పాకిస్థాన్ విమర్శించింది. ముఖ్యంగా దక్షిణాసియాలో ఉద్రిక్తతలకు అదే కారణమని పేర్కొంది. టెర్రర్ గ్రూపులకు ఊతం ఇస్తున్నందుకు పాక్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా గర్హించిన మరునాడు ఆ దేశం ఈ విధంగా ప్రతిస్పందించింది. ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలకు జమ్ము– కశ్మీర్ అంశం అపరిష్కృతంగా మిగలడం ప్రధాన కారణమని పాక్ విదేశాంగ కార్యాలయం నిందించింది. అఫ్గాన్‌లో, దక్షిణాసియాలో తమ వ్యూహాన్ని మార్చనున్నట్లు అమెరికా ప్రకటిస్తూ భారత్ మరింత ప్రమేయం కల్పించుకోవాలని కోరింది. ఆ తర్వాత మంగళవారం రాత్రి పొద్దుపోయాక పాక్ ఈ వ్యాఖ్య చేసింది. ట్రంప్ ప్రకటనపై సమగ్ర ప్రతిస్పందన త్వరలో వెలువడుతుందని కూడా పాక్ ప్రకటించింది.

నాటో నుంచి పాక్‌ను తొలగించే సూచన

పాకిస్థాన్‌ను నాటో కూటమిలో ప్రధాన మిత్ర దేశం హోదా నుంచి తొలగించే విషయం అమెరికా పరిశీలిస్తుందని విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్ బుధవారం నాడు హెచ్చరించారు. ఆ దేశం టెర్రరిస్టులపై కఠిన చర్యలు ప్రారంభించకపోతే ఇది తప్పదని పేర్కొన్నారు. అఫ్గాన్‌పట్ల నూతన వైఖరిని ఆవిష్కరిస్తూ మంగళవారం ట్రంప్ పాక్‌ను తీవ్రంగా తప్పుపట్టడాన్ని ఆయన సమర్థించారు.

బలమైన మిత్ర దేశం భారత్: అమెరికా

వాషింగ్టన్: అమెరికాకు బలమైన ప్రాంతీయ వ్యూహాత్మక భాగస్వామిగా భారత్ దేశం రూపుదిద్దుకుంటోందని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్ బుధవారం నాడు అన్నారు. అందువల్ల భారత్ అఫ్ఘనిస్థాన్‌ను రాజకీయంగా , ఆర్థిక పరంగా బలోపేతం చేయగలుగుతుందని ఆయన అన్నారు. అఫ్గాన్‌పట్ల అమెరికా నూతన వ్యూహాన్ని ఆవిష్కరిస్తూ మంగళవారం నాడు ట్రంప్ భారత్ ప్రమేయం పెరగాలని కోరారు. అందు మీదట టిల్లర్సన్ వ్యాఖ్యానిస్తూ అఫ్గాన్ ప్రభుత్వాన్ని, ఆర్థిక వ్యవస్థను బలపర్చడంలో భారత్ కృషిని ప్రశంసించారు. అభివృద్ధికి కూడా భారత్ సహాయపడిందని చెప్పారు. పాకిస్థాన్ ప్రవర్తన మార్చడంలో భారత్ సహాయాన్ని ఆయన కోరారు. టెర్రర్ గ్రూపులను కట్టడి చేయడంలో తన శక్తిని పాకిస్థాన్ మదింపు వేసుకోవాలని కూడా సూచించారు. పాకిస్థాన్ వ్యవహారంలో అమెరికా ఒక్కటే చేయగలిగిందేమీ లేదని చెప్పారు.

ఉగ్ర స్థావరాలు నిర్మూలిస్తాం : ఐరాస

ఐక్యరాజ్య సమితి: పాకిస్థాన్ కోరితే దాని ఉగ్రవాద స్థావరాలను తొలగించడంలో సహాయపడతామని ఐక్యరాజ్య సమితి సంసిద్ధత ప్రకటించింది. ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రెస్ అందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రతినిధి దుజారిక్ తెలిపారు. పాకిస్థాన్ ఉగ్రవాదుల స్వర్గధామంగా మారిందని ట్రంప్ చేసిన విమర్శపై ఐరాస ఆ విధంగా స్పందించింది. అంతర్జాతీయంగా దేశాలు టెర్రరిజం నిర్మూలన విషయంలో ఏకమై ఉమ్మడి కృషి సాగిస్తాయన్న ఆశాభావాన్ని గుటెర్రెస్ వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో శాంతి స్థాపన లక్ష్యంగా ఈ కృషి సాగాలని సూచించారు.


సూపర్ సింగర్ విజేత గౌరి

మన తెలంగాణ/హైదరాబాద్: నగరంలోని ఇనార్బిట్ మాల్‌లో లవిట్ చాక్లెట్స్ సమర్పణలో రేడియో సిటీ సూపర్ సింగర్ సీజన్9 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన భీమ్స్ సిసిరోలే, సాయి కార్తీక్, శశక్తి కాంత్ కార్తీక్‌లు ఆరుగురు పోటీదారుల నుంచి ఫైనల్ విజేతగా గౌరిని ఎంపిక చేశారు. విజేతగా నిలిచిన గౌరికి రూ. లక్ష నగదు బహుమతిని కూడా అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీతారలు తాప్సీ పన్ను, ప్రగ్యా జైస్వాల్, బోయపాటి శ్రీను, తేజ, భీమ్స్ సిసిరోలో, సాయి కార్తీక్, శక్తి కాంత్ కార్తీక్‌లు సందడి చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ కల్లా మాట్లాడుతూ.. రేడియో సిటీ సూపర్ సింగర్ అనే కార్యక్రమం ద్వారా ఔత్సాహిక గాయకులను ప్రోత్సహిస్తూ అనేక రికార్డులను నెలకొల్పిందని అన్నారు.

హైదరాబాద్‌కు 'వాయ్ వాయ్' సిటీ

మన తెలంగాణ/హైదరాబాద్: దేశంలో మొట్టమొదటి ఐకానిక్ నూడిల్ బార్ 'వాయ్ వాయ్ సిటీ' పేరుతో హైదరాబాద్‌కు సమీపంలో తమ ఔట్ లెట్‌ను తెరిచింది. 40 సీట్లు కలిగిన రెడీ టు ఈట్ నూడిల్ బార్ మెనూలో రుచికరమైన నూడిల్ డిషెస్ ఉంటాయి. లైవ్ కిచెన్స్‌లో నాలుగు రకాల నూడిల్స్ క్లాసిక్, చోప్‌స్యు, రోస్టెడ్, పాన్ ఫ్రైడ్ ఉంటాయి. ఔట్‌లెట్ ప్రారంభోత్సవం సందర్భంగా సిజికార్ప్ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరణ్ చౌదరీ మాట్లాడుతూ.. వాయ్ సిటీ బ్రాండ్‌ను వినియోగదారులకు చేరువ చేయడమే లక్ష్యంగా పేర్కొన్నారు. నూతన ఫార్మాట్‌తో నూడిల్ అభిమానులకు ఫ్లేవర్స్‌ను అందిస్తున్నామని చెప్పారు. ఈ నూడిల్ బార్లు ఇప్పటికే ఢిల్లీ, పుణె, సిలిగురి, చండీగఢ్, బెంగళూరులో ఓపెన్ లైవ్ కిచెన్ ఫార్మాట్‌లో నిర్వహిస్తున్నారు.ఇప్పుడు మాదాపూర్, హైదరాబాద్‌తో పాటు వదోదర, వెలాచెరీ, చెన్నైలలో కూ డా ఔట్‌లెట్లను ప్రారంభించనున్నారు. రాబోయో ఐదేళ్లలో 250 కోట్ల రూపాయల పెట్టుబడితో 1500కు పైగా ఔట్‌లెట్లను ఏర్పాటు చేయనుంది.


మట్టి గణపతుల పంపిణీ



మన తెలంగాణ/ హైదరాబాద్: నగరంలోని మాధాపూర్‌లో సెలబ్రిటీ సీక్రెట్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. సినీ దర్శకులు క్యాంక్ కృష్ణ చేతుల మీదుగా కస్టమర్స్ మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు క్యాంజ్ మాట్లాడుతూ.. పర్యావరణానికి మేలు చేసే మట్టి గణపతులను అందరూ పూజించాలని చెప్పారు. రసాయనాలతో తయారుచేసిన గణేష్ విగ్రహాల నివారించడంతో మట్టి వినాయక విగ్రహాలు ఒక్కటే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.వెంకట్, డా. మాధవి తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌ప్రభు రాజీనామా?

- ఇప్పుడే వద్దన్న ప్రధాని మోడీ
- వరుస రైలు ప్రమాదాలతో మంత్రి మనస్థాపం
- ప్రభు విజ్ఞప్తిపై ప్రధాని నిర్ణయం తీసుకుంటారు : జైట్లీ
- రైల్వే మంత్రి తొలగింపునకు కాంగ్రెస్ డిమాండ్






న్యూఢిల్లీ : యుపిలో ఇటీవల జరిగిన రెండు రైలు ప్రమాదాలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసేందుకు రైల్వే మంత్రి సురేష్ ప్రభు చేసిన విజ్ఞప్తిపై ప్రధానమంత్రి మోడీ ఒక నిర్ణయం తీసుకుంటారని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం అన్నారు. జవాబుదారీతనం అనేది ప్రభుత్వంలో ఒక ఉత్తమ పద్ధతి. అందువల్ల రైల్వే మంత్రి అభ్యర్థనపై ప్రధాని ఒక నిర్ణయం తీసుకుంటారని ఆయన చెప్పారు. రైలు ప్రమాదాలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలనుకుంటున్నట్లు ప్రధానికి చెప్పానని ప్రభు చెప్పిన కొద్ది గంటలకే జైట్లీ ఈ మేరకు ప్రకటించడం గమనార్హం. ప్రమాదాల నేపథ్యంలో రైల్వే బోర్డు ఛైర్మన్ ఎకె మిట్టల్ రాజీనామాతో పాటు పదవి నుండి తప్పుకోవాలనుకుంటున్నట్లు ప్రభు చేసిన వినతిపై మంత్రి ఈ మేరకు స్పందించారు. రైల్వే బోర్డు కొత్త ఛైర్మన్‌గా ఎయిర్ ఇండియా సిఎండి అశ్వని లోహానిని నియమించిన సంగతి తెలిసిందే. మరోవైపు వరుస రైలు ప్రమాదాల నేపథ్యంలో రైల్వే మంత్రి సురేష్ ప్రభును తొలగించి, ఆయన స్థానంలో బాధ్యతాయుతమైన మరో వ్యక్తిని నియమించాలంటూ విపక్ష కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. రైల్వే మంత్రిగా ఆయన ఘోరంగా వైఫల్యం చెందారని, ఆయన్ని తొలగించాలని ప్రధాని నరేంద్ర మోడీని ఆ పార్టీ ప్రధాన ప్రతినిధి రణ్‌దీప్ సుర్జీవాలా డిమాండ్ చేశారు. ప్రమాదాలకు 'బాధ్యత వహిస్తున్నాను' అని చెప్పడం వల్ల ఉపయోగం లేదని, పదవి నుండి దిగిపోవాలని సురేష్ ప్రభుని ఆయన సూటిగా కోరారు. ఇటీవల జరిగిన రైలు ప్రమాదాలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు ప్రభు చేసిన వ్యాఖ్యలను సుర్జీవాలా గుర్తు చేస్తూ ఈ మేరకు ఆయన రాజీనామాకు డిమాండ్ చేయడం గమనార్హం. కాగా, అంతకుముందు యుపిలో వరుస రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు రైల్వే మంత్రి సురేష్ ప్రభు వెల్లడించారు. ఇదే విషయాన్ని ప్రధాని మోడీని కలిసి చెప్పానని ఆయన అన్నారు. అయితే తొందరపడవద్దని ప్రధాని తనకు సూచించినట్లు మంత్రి చెప్పారు. దురదృష్టవశాత్తుగా సంభవించిన రైలు ప్రమాదాల్లో చాలా మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. ఈ ఘటనలు తననెంతగానో బాధిస్తున్నాయని సురేష్ ప్రభు ట్వీట్ చేశారు. రైల్వే మంత్రిగా గత మూడేళ్లలో రైల్వేల అభివృద్ధికి తన చెమటను, రక్తాన్ని చిందించానని ఆయన చెప్పుకొచ్చారు. ప్రధాని నాయకత్వంలో రైల్వేల్లోని పలు విభాగాల్లో దశాబ్దాలుగా నెలకొన్న నిర్లక్ష్యాన్ని క్రమబద్ధ సంస్కరణల ద్వారా అధిగమించడానికి ప్రయత్నించానని ఆయన చెప్పారు. తన ప్రయత్నాల ఫలితంగా అనూహ్యమైన పెట్టుబడులు సాధ్యమయ్యాయని, పలు మైలురాళ్లను చేరుకున్నామని ఆయన మరో ట్వీట్ ద్వారా తెలిపారు.

రైల్వే భద్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నాం

మన తెలంగాణ / హైదరాబాద్ : రైల్వేలో భద్రతా ప్రమాణాల కల్పన, ప్రమాదాల నివారణకు రైల్వే తగిన చర్యలు తీసుకుంటున్నదని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎం.ఉమాశంకర్ కుమార్ తెలిపారు. రైలు ప్రమాదాల సంఖ్యను పరిశీలిస్తే 2014–15లో 135 ప్రమాదాలు జరుగగా, 2015–16లో ప్రమాదాల సంఖ్య 107కు, తగ్గి 2016–17లో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగై ప్రమాదాల సంఖ్య 104 కి పరిమితమైందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. కకోడ్కర్ హై లెవెల్ సేఫ్టీ కమిటీ చేసిన 106 సిఫార్సులలో 68 సిఫార్సులను పూర్తిగా, 13 పాక్షికంగా ఆమోదించి 52 సిఫార్సులు అమలు పరచగా మిగతావి వివిధ దశలలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతర్జాతీయ కొలమానం మిలియన్ ట్రైన్ కిలోమీటర్ల ప్రమాదాల సంఖ్యతో పోల్చితే 2014–15లో ప్రతి మిలియన్ ట్రైన్ కిలోమీటర్లకు 0.11 ప్రమాదాలు జరగగా 2015–16లో ఆ సంఖ్య 0.10 కి, 2016–17లో 0.09 కి తగ్గిందని తెలిపారు. కాపాలా లేని లెవెల్ క్రాసింగ్‌ల వద్ద జరిగిన ప్రమాదాల సంఖ్య 2014–15తో పోల్చితే 2016–17లో 60 శాతం తగ్గాయన్నారు. కాపలా ఉన్న లెవెల్ క్రాసింగ్ ల వద్ద 2014 15, 2015–16 లలో 6 ప్రమాదాలు జరుగగా, 2016–17లో ఒక్క రైలు ప్రమాదం జరుగలేదని తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా గత 3 ఏళ్లలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం ద్వారా 3904 కాపలా లేని గేట్లను, 1209 కాపలా ఉన్న గేట్లను తొలగించిందని తెలిపారు. ఆర్‌ఓబి, ఆర్‌యుబిల నిర్మించడంతో పాటు పలు చోట్ల గేట్ల మిత్ర కార్యకర్తల నియామకం, 2వ విజిల్ బోర్డుల ఏర్పాటు తదితర చర్యలు చేపట్టామన్నారు. వచ్చే 4 ఏళ్లలో ప్రస్తుతం ఉన్న కాపలా లేని గేట్లను ఎత్తివేయనుందన్నారు. రైళ్లు పరస్పరం ఢీ కొట్టకుండా అభివృద్ధి పరచిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని లోకో పైలెట్లకు సహాయకారిగా రద్దీ రైలు మార్గాలలో, సబర్బన్ సెక్షనులలో ప్రవేశపెట్టారన్నారు. లోకో పైలెట్ల డ్రైవింగ్ నైపుణ్యం పెంచడానికి సిమ్యులేటర్ ఆధారిత ప్రత్యేక శిక్షణా సౌకర్యాన్ని ప్రవేశపెట్టారు. రైలు పట్టాలు తప్పకుండా యాంత్రిక ట్రాక్ మెయింటెనెన్స్ సిస్టంను ఉపయోగించడం, వెహిక్యులర్ యుఎస్‌ఎఫ్‌డి యంత్రాలు, వెల్డింగ్ సాంకేతికతను మెరుగు పరచడం, హెడ్ హార్డెండ్ రైల్స్ ఉపయోగించడం, లోపాలను కనిపెట్టే పరికరాలు, వే సైడ్ లోడ్ ఇంపాక్ట్ డిటెక్టర్స్, ఎల్‌హెచ్‌బి కోచ్‌లు విస్తరించడం,ఐసిఎఫ్ కోచ్‌లలో సిబిసి కప్లింగ్ రిట్రో ఫిట్మెంట్ ఏర్పాటు తదితర చర్యలు తీసుకున్నామని వివరించారు. రైల్వేలో భద్రతా చర్యల పెంపుదల కోసం 2017 18లో బడ్జెట్ లో 'రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్' నిధిని రూ.1 లక్ష కోట్లతో ఐదేళ్ల కాలానికి కేటాయించిందని తెలిపారు. ఈ నిధిని ట్రాక్ భద్రత పెంపుదల కోసం, రోలింగ్ స్టాక్, వెహికిల్ ఆధారిత యూ.ఎస్.ఎఫ్.డి మిషన్ల ను సమకూర్చుకోవడం కోసం, ఆన్‌బోర్డ్ రోలింగ్ స్టాక్ మానిటరింగ్ సిస్టమ్స్, ఇతర భద్రతా సాంకేతికతల పెంపుదల కోసం ఉపయోగిస్తారని తెలిపారు.

నంద్యాలలో పోలింగ్ ప్రశాంతం



నంద్యాల: కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ ముగిసింది. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైంది. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పోటెత్తారు. ఈ సాయంత్రం 5 గంటల సమయానికి మొత్తం 80 శాతం పోలింగ్ నమోదైంది. నంద్యాల రూరల్, గోస్పాడు మండలాల్లో అత్యధికంగా పోలింగ్ నమోదైంది. నంద్యాల అర్బన్ లోనూ 70 శాతం వరకు పోలింగ్ నమోదైనట్టు తెలుస్తోంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే క్యూలైన్లలో వేచి ఉన్నవారికి ఓటుసేందుకు అనుమతించారు. పోలింగ్ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా అధికారులు పర్యవేక్షించారు. దీన్ని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. ఈ ఎన్నికను సిఇసి కూడా పర్యవేక్షించింది. నియోజకవర్గంలో సు మారు 80 నుంచి 90 వరకు పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉండటంతో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పారా మి లటరీ బలగాలతో భద్రతను ఏర్పాటుచేశారు. 25 పోలింగ్ కేంద్రాలు అత్యంత సమస్యాత్మకంగా ఉండటంతో కేంద్ర బలగాలను రంగంలోకి దించి భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రత్యేకంగా నియోజకవర్గాన్ని 20సెక్టార్లుగా విభజించి త హశీల్దారు స్థాయి వ్యక్తులతో సెక్టోరియల్ అధికారులను ఏ ర్పాటుచేసి పర్యవేక్షించారు. 28న ఫలితం వెల్లడి కానుంది.


ఇరు వర్గాల ఘర్షణ : నంద్యాలలోని ఏడో వార్డు ఎన్‌టిఆర్ షాదీఖానా వద్ద దొంగ ఓట్లు వేస్తున్నారంటూ వైసిపి నేతలు ఫిర్యాదు చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో టిడిపి నుంచి ఎవి సుబ్బారెడ్డి, భూమా నాగిరెడ్డి కుమార్తె మౌనిక, అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి అక్కడకు చేరుకున్నారు. అలాగే వైసిపి అభ్యర్థి సోదరుడు శిల్పా చక్రపాణిరెడ్డి అక్కడకు రావడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాయలసీమ రేంజ్ ఐజీ ఇక్బాల్ అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపుచేసేందుకు ప్రయత్నించారు. దాదాపు అర గంట పాటు హైడ్రామా కొనసాగింది. అలాగే బొగ్గు కాలనీలోనూ ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. భారీగా పోలీసు బలగాలను పహారా ఉంచడంతో మొత్తమ్మీద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండానే పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

కాలుష్య టపాసులకు నియమాలు : సుప్రీం

న్యూఢిల్లీ: కాలుష్యాన్ని, వెలుతురును వెదజల్లే టపాసులకు నియమాలవసరం అని, అందుకు తగిన మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టు బుధవారం తెలిపింది. పరిమితిని దాటి రసయానాలను టపాసులలో ఉపయోగించకుండా మార్గదర్శకాలను రూపొందించాలంది. క్లోరిన్, పొటాషియం, టైటెనియం వంటి రసయానాలు 5 శాతం పరిమితికి మించకుండా చూడాలని న్యాయమూర్తులు మదన్ బి. లోకుర్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. కొన్ని టపాసులు విపరీత శబ్ద కాలుష్యాన్ని, మరి కొన్ని వెలుగును, కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయని వారన్నారు. టపాసుల కాలుష్యాన్ని నివారించడానికి మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే టపాసుల తయారీదారులు తాము నియమానుసారం పరిమితి మేరకే రసయానాలు వాడుతున్నట్లు కోర్టుకు తెలిపారు. గత నవంబర్‌లో దేశ రాజధాని పరిసరాలలో అన్ని టపాసుల అమ్మకందారుల లైసెన్సులు రద్దు చేయాలంటూ కేంద్రాన్ని ఆదేశించింది. ఆ కేసుకు సంబంధించిన విచారణ బుధవారం కోర్టు ముందుకు వచ్చింది. టపాసుల నుంచి కాలుష్యం వెలువడుతోందని పిటిషనర్ వాదించారు.

సూపర్ స్పెషాలిటీ సీట్లపై వాదనలు పూర్తి

మన తెలంగాణ/ హైదరాబాద్: కాళోజీ, ఎన్‌టిఆర్ యూనివర్శిటీల పరిధిలో ఉన్న ఎంసిహెచ్, డిఎం సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీల కేసులో హైకోర్టులో వాదప్రతివాదనలు పూర్తయ్యాయి. నీట్‌పై సుప్రీంకోర్టులో కేసు ఉన్నందున ఈ అంశంపై తమ నిర్ణయాన్ని గురువారమే వెలువరిస్తామని న్యాయమూర్తులు రామసుబ్రమణియన్, రజనీలతో కూడిన ధర్మాసనం తెలిపింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు 85 శాతంతో భర్తీ చేయాలని రాజ్యాంగంలోని 371 – డి అధికరణ చెబుతున్నా నేషనల్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లను భర్తీ చేయాలని కేంద్రం ఆదేశాలివ్వడం అన్యాయమని పేర్కొంటూ డాక్టర్ సతీష్ కుమార్, ఇతరులు కేసులు వేశారు. వెనకబాటుతనం ఉన్నప్పుడు ఆ విధంగా చేశారని, ఇప్పుడు కూడా అమలు చేయడం అన్యాయమని పేర్కొంటూ మరి కొందరు హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. ఎపి, తెలంగాణల్లోని సీట్లను ఆయా రాష్ట్రాల అభ్యర్థులు 85 శాతం భర్తీ చేశాక మిగిలిన సీట్లను ఇతర రాష్ట్రాలతో భర్తీ చేయాలని 371 – డి చెబుతున్నా జాతీయ కౌన్సెలింగ్ పద్ధతి చెల్లదని పిటిషనర్ల న్యాయవాది సరసాని సత్యం రెడ్డి వాదించారు. 371– డి ప్రకారం 85శాతం సీట్లను సంబంధిత రాష్ట్రానికి చెందిన వారికోసం మిగిలిన 15 శాతం సీట్లను ఇతర అభ్యర్థులతో భర్తీ చేసేందుకు వీలు కల్పిస్తున్న రాజ్యాంగంలోని 371–డి చెల్లదని పిటిషనర్ల తరఫు పలువురు సీనియర్ న్యాయవాదులు ప్రతివాదనలు చేశారు. వీటిపై హైకోర్టు తన నిర్ణయాన్ని గురువారం తెలుపుతుంది.



గిన్నీస్ రికార్డుకెక్కిన 153 కిలోల సమోసా

లండన్: భారత్‌లో స్నాక్స్‌గా తినే సమోసను ఏకంగా 153 కిలోల సైజులో తయారుచేసి ప్రపంచ గిన్నీస్ రికార్డు నెలకొల్పారు. ముస్లిం సహాయక స్వచ్ఛంద బృందం 12 మంది సభ్యులు తూర్పు లండన్ మసీదులో మంగళవారం ఈ సమోసను తయారు చేసి రికార్డు నెలకొల్పారు. వీరి ఈ ఫీట్‌ను గిన్నీస్ రికార్డు అధికారులు గుర్తించారు. ఈ 153 కిలోల భారీ సమోసను రూపొందించడానికి దాదాపు 15 గంటలు పట్టింది. దీనిని తర్వాత వైట్‌చాపెల్ పరిసర ప్రాంతంలోని నిరాశ్రయులకు(హోమ్‌లెస్ పీపుల్) పంచి పెట్టారు. ఇదివరలో 110.8 కిలోల సమోసాయే ప్రపంచ రికార్డుగా ఉంది. దానిని 2012 జూన్‌లో ఉత్తర ఇంగ్లాండ్‌లోని బ్రాడ్‌ఫోర్డ్ కాలేజ్ తయారు చేసింది.

వైఎస్ జగన్‌పై కేసు నమోదు

నంద్యాల: వైఎస్‌ఆర్‌సిపి అధ్యక్షుడు, ఎపి ప్రతిపక్ష నేత జగన్ మోహన్‌రెడ్డిపై నంద్యాలలో కేసు నమోదైంది. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా జగన్ 'ఎపి సిఎం చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా ఫర్వాలేదు. ఉరితీసినా తప్పులేదు' అంటూ వ్యాఖ్యలు చేయడంతో టిడిపి నేతలు ఇసికి ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీన్ని పరిశీలించిన ఎన్నికల సంఘం ఆయన వ్యాఖ్యలు కచ్చితంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో నంద్యాల ఉప ఎన్నికకు రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.


ఎపి మంత్రి గంటాకు అరెస్ట్‌కు వారెంట్

విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ మంత్రి గంటా శ్రీనివాసరావు అరెస్టుకు వారెంట్ జారీ అయింది. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన ఆయనను అరెస్టు చేయాలంటూ అనకాపల్లి కోర్టు బుధవారం పోలీసులను ఆదేశించింది. ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించిన కేసులో తన ముందు హాజరుకావాల్సిందిగా గంటాను కోర్టు పలుమార్లు ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలను గంటా పట్టించుకోకపోవడంతో అరెస్ట్ చేయాలంటూ వారెంట్ జారీచేసింది.2009సార్వత్రిక ఎన్నికల సమయం లో అక్రమ మార్గంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు గంటా శ్రీనివాసరావు పెద్ద ఎత్తున క్రికెట్ కిట్లు పంపిణీ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులోనే తాజా వారెంట్ జారీ అయింది.

దారికి వస్తున్న ఉత్తర కొరియా : ట్రంప్

వాషింగ్టన్: ఉత్తర కొరియా వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచన ప్రాయంగా చెప్పారు. ఆ దేశంతో అణ్వాయుధ కార్యక్రమాల విషయంలో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఇటీవల కొద్ది రో జులుగా ఆ దేశం కొంత సంయమనాన్ని ప్రదర్శిస్తున్నట్లువిదేశాంగ మంత్రి టిల్లర్సన్ కూడా తెలిపారు.అరిజోనాలోని ఫీనిక్స్ వద్ద ర్యాలీలో ట్రంప్ ప్రసంగిస్తూ ఉత్తర కొరియా నేత కిమ్ తమను గౌరవించడం ప్రారంభించారన్నారు.

జలవిధానం మార్చండి : బూరనర్సయ్య



మన తెలంగాణ/న్యూఢిల్లీ : కర్ణాటకలో రిజర్వాయర్లు నిండుగా ఉన్నా.. తెలంగాణ, ఎపిలో ప్రాజెక్టులు ఎండిపోతున్నాయని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, కేంద్ర ఉమాభారతికి టిఆర్‌ఎస్ ఎంపి బూర నర్సయ్యగౌడ్ బుధవారం లేఖ రాశారు. ఓ వైపు టీం ఇండియా స్పిరిట్ అంటూనే దిగువ రాష్ట్రాలు నీటికి ఇబ్బంది పడుతున్నా కేంద్ర జలవనరుల సంఘం పట్టించుకోవడం లేదని ఆ లేఖలో ఆరోపించారు. ప్రస్తుత జల విధానంతో దిగువ రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత జలవిధానాన్ని మార్చాలని, దిగువ రాష్ట్రాల అవసరాలు తీరే విధంగా జలవిధానం ఉండాలని ఎంపి కేంద్ర మంత్రికి సూచించారు. తెలంగాణ అవసరాల కోసం తక్షణమే 20 టిఎంసిల నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఎంపి బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ అవసరాల రీత్యా కనీసం 20టీఎంసీల నీళ్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రికి లేఖ రాసాశానన్ని వెల్లడించారు. అవసరమైతే జలవనరుల శాఖ మంత్రిని కలుస్తానని అన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత

మన తెలంగాణ/హైదరాబాద్ : కార్మికుల సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని పురపాలక శాఖ కార్యదర్శి నవీన్ మిత్తల్ తెలిపారు. కార్మిక సంఘాల జెఎసి ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. కార్మిక సంఘాల ప్రతినిధులు లేవనెత్తిన విషయాలపై ఆగస్టు 28న మరోసారి సమావేశమై చర్చించాలని నిర్ణయించారు. సమావేశంలో ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, ఎఐయుటియుసి, ఐఎఫ్‌టియు, బిఎంఎస్, హెచ్‌ఎంఎస్‌ల ప్రతినిధులు పాల్గొని చర్చించారు. పురపాలక శాఖ సంచాలకురాలు డాక్టర్ టి.కె.శ్రీదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆలోచనలను పంపేందుకు గడువు పొడిగింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల వినియోగం పెంచేందుకు వివిధ పద్ధతులు, సాంకేతిక పరిష్కారాలు, ఆలోచనలను కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు గడువను ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగించినట్లు రాష్ట్ర స్వచ్ఛ భారత మిషన్ (గ్రామీణ) తెలిపింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పంపాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

కోదండరాం అబద్దాల చిట్ట : కర్నె

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ జెఎసి ఛైర్మన్ కోదండ రాంకు ఎలాంటి తెలంగాణ, ప్రజాస్వామ్యం కావాలో స్పష్టం చేయాలని టిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్‌నాం చేయాలని కోదండరాం ఢిల్లీలో అబద్దాల చిట్టాతో సంచరిస్తున్నారని మండిపడ్డారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పిలో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1.45 లక్షల కోట్లు అప్పులు తెచ్చిందని మాట్లాడుతున్నారని, దేశంలో మిగతా రాష్ట్రాలు అప్పులు చేయడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఎఫ్‌ఆర్‌ఎంబి చట్టానికి లోబడే అప్పులు తెస్తున్నామన్న విషయం కోదండ రాంకు తెలియదా అన్నారు.

63,736 గొర్రెల యూనిట్లు పంపిణీ

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఇప్పటి వరకు 63,736 గొర్రెల యూనిట్లు పంపిణీ చేసినట్టు గొర్రెలు, మేకల ఫెడరేషన్ ఛైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ లక్ష్యంగా ఉందన్నారు. ఇప్పటికే అలివే ప్రాంతంలో గొర్రెల మేత కోసం స్థలం గ్రాస్ పెంచుతున్నట్లు చెప్పారు. 1962 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా మంద వద్దకే సంచార పశువైద్య శాల ప్రవేశం దీనిని త్వరలోనే సిఎం కె. చంద్రశేఖరరావు ప్రారంభించనున్నారని తెలిపారు.

వన్డే కెప్టెన్సీకి డివిలియర్స్ గుడ్‌బై

జోహెన్నస్‌బర్గ్: దక్షిణాఫ్రికా స్టార్ ఎబి.డివిలియర్స్ వన్డే కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. అయితే టెస్టు జట్టుకు సారథ్యం వహించేందుకు సిద్ధమేనని స్పష్టం చేశాడు. కొంత కాలంగా టెస్టు క్రికెట్‌కు దూరంగా డివిలియర్స్ మళ్లీ ఈ ఫార్మాట్‌లో ఆడేందుకు సిద్ధమేనని తెలిపాడు. కొంతకాలంగా డివిలియర్స్ ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో వన్డే జట్టును విజయపథంలో నడిపించలేక పోతున్నాడు. దీంతో అతను కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలగాలని నిర్ణయించాడు. ఈ విషయాన్ని డివిలియర్స్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించాడు. తాను కెప్టెన్సీ నుంచి తప్పుకున్నా ఆటగాడిగా మూడు ఫార్మాట్‌లలో జట్టుకు అందుబాటులో ఉంటానని వివరించాడు. సంప్రదాయ టెస్టు క్రికెట్‌లో కెప్టెన్‌గా ఉండేందుకు తనకు ఎటువంటి అభ్యంతరం లేదన్నాడు. ఈ విషయంలో సౌతాఫ్రికా క్రికెట్ బోర్డుతో త్వరలోనే చర్చిస్తానని వెల్లడించాడు.



టీమిండియాకు చేరిన కొత్త కిట్స్

పల్లెకెలె: శ్రీలంకతో జరుగుతున్న వన్డే సిరీస్ కోసం టీమిండియాకు కొత్త కిట్స్‌ను నైక్ సంస్థ అందజేసింది. దీంతో బుధవారం భారత ఆటగాళ్లు కొత్త కిట్లతో సాధన చేశారు. మహేంద్ర సింగ్ ధోనీ, రోహిత్ శర్మ, అజింక్య రహానె, కేదార్ జాదవ్, మనీష్ పాండే తదితరులు కొత్త కిట్స్‌తో ప్రాక్టీస్‌కు హాజరయ్యారు. కాగా, వన్డే సిరీస్ ప్రారంభమైన తమకు నైక్ సంస్థ కిట్స్‌ను అందజేయలేదని భారత క్రికెటర్లు బిసిసిఐకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన బిసిసిఐ అప్పటికప్పుడూ క్రికెటర్లకు కొత్త కిట్స్ అందజేయాలని నైక్ సంస్థను ఆదేశించింది. దీంతో నైక్ ప్రతినిధులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుని టీమిండియా క్రికెటర్లకు కొత్త కిట్స్ అందేలా చర్యలు చూశారు. కాగా, కొత్త కిట్స్‌పై భారత ఆటగాళ్లు అసంతృప్తితో ఉన్నట్టు తెలిసిందే. ఈ సందర్భంగా నైక్ సంస్థ అందించిన కిట్స్‌లో నాణ్యత లోపించిందని భారత క్రికెటర్లు వాపోయినట్టు సమాచారం. ఈ అంశంపై మాట్లాడేందుకు నైక్ సంస్థ ప్రతినిధులు నిరాకరించారు.







లంకకు చావో రేవో

ఆత్మవిశ్వాసంతో కోహ్లి సేన, నేడు రెండో వన్డే



పల్లెకెలె: శ్రీలంకతో జరిగే రెండో వన్డేకు విరాట్ కోహ్లి సేన సమరోత్సాహంతో సిద్ధమైంది. దంబుల్లాలో జరిగిన మొదటి వన్డేలో లంకను చిత్తుగా ఓడించిన భారత్ ఈ సారి అదే సంప్రదాయాన్ని కొనసాగించాలనే పట్టుదలతో కనిపిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ ప్రత్యర్థికి అందనంత ఎత్తులో ఉంది. తొలి వన్డేలో బౌలర్లు, బ్యాట్స్‌మెన్ సత్తా చాటారు. ఈ మ్యాచ్‌లో కూడా భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. మరోవైపు ఆతిథ్య శ్రీలంకకు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. తొలి వన్డేలో చిత్తుగా ఓడిపోవడంతో లంకపై విమర్శల వర్షం కురుస్తోంది. ఈ మ్యాచ్‌లో కూడా ఓడితే అభిమానుల నుంచి మరింత ఆగ్రహాన్ని చవిచూడడం ఖాయం. దీంతో కచ్చితంగా గెలవాలనే ఒత్తిడి లంకపై నెలకొంది. ఈ నేపథ్యంలో ఉపుల్ తరంగ సేన ఏ మేరకు భారత్‌కు గట్టి పోటీ ఇస్తుందో వేచి చూడక తప్పదు.

జోరుమీదున్నాడు.

భారత ఓపెనర్ శిఖర్ ధావన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాడు. తొలి వన్డేలో కళ్లు చెదిరే సెంచరీతో చెలరేగిపోయిన ధావన్ ఈసారి కూడా అదే జోరును కొనసాగించాలనే పట్టుదలతో ఉన్నాడు. టెస్టు సిరీస్‌లో రెండు సెంచరీలు సాధించి సత్తా చాటిన ధావన్ తొలి వన్డే కూడా శతకంతో కదం తొక్కాడు. భీకర ఫాంలో ఉన్న అతన్ని కట్టడి చేయడం లంక బౌలర్లకు శక్తికి మించిన పనిగా మారింది. ఇక, తొలి మ్యాచ్‌లో విఫలమైన డాషింగ్ ఓపెనర్ రోహిత్ శర్మ భారీ ఇన్నింగ్స్‌పై కన్నేశాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన రోహిత్ చెలరేగితే అడ్డుకోవడం ప్రస్తుతం పరిస్థితుల్లో లంకకు కష్టంగా కనిపిస్తోంది. వన్డేల్లో మెరుగైన రికార్డు కలిగిన రోహిత్ భారీ ఇన్నింగ్స్ కోసం తహతహలాడుతున్నాడు.

కోహ్లిని ఊరిస్తున్న మరో రికార్డు

ఇక, తొలి వన్డేలో అద్భుతంగా ఆడిన కెప్టెన్ విరాట్ కోహ్లి ఈసారి కూడా బ్యాట్స్ ఝులిపించేందుకు సిద్ధమయ్యాడు. అతను విజృంభిస్తే ఈసారి కూడా భారత్‌కు విజయం ఖాయం. కిందటి మ్యాచ్‌లో అద్భుత షాట్లతో లంక బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన కోహ్లి ఈ మ్యాచ్ ద్వారా మరో మైలురాయికి చేరుకునే అవకాశాలున్నాయి. ఈ సీజన్‌లో కోహ్లి ఇప్పటివరకు 14 మ్యాచుల్లో 769 పరుగులు సాధించాడు. మరో 45 పరుగులు ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలుస్తాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా ఆటగాడు డుప్లెసిస్ 16 మ్యాచుల్లో 814 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ జో రూట్ 785 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. కోహ్లి ఈ మ్యాచ్‌లో వీరిని అధిగమించే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి.

జట్ల వివరాలు

భారత్ (అంచనా): విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, కెఎల్.రాహుల్, మహేంద్ర సింగ్ ధోనీ, కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, చాహల్, భువనేశ్వర్, జస్‌ప్రిత్ బుమ్రా.
శ్రీలంక (అంచనా): ఉపుల్ తరంగ (కెప్టెన్), డిక్వెలా, గుణతిలక, కుశాల్ మెండిస్, మాథ్యూస్, తిసారా పెరీరా, కపుగెదెర, సిరివర్ధనే, హసరంగ/ధనుంజయ, లసిత్ మలింగ, విశ్వ ఫెర్నాండో.

బౌలర్లే కీలకం..

ఈ మ్యాచ్‌లో భారత్ మరోసారి బౌలర్లపై భారీ ఆశలు పెట్టుకుంది. శ్రీలంకను తొలి వన్డేలో తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో భారత బౌలర్లు సఫలమయ్యారు. ఈసారి కూడా విరాట్ కోహ్లి వీరినే నమ్ముకున్నాడు. ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రిత్ బుమ్రాతో సహా స్పిన్నర్లు ఈ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ మ్యాచ్‌లో కూడా వీరే జట్టుకు కీలకంగా మారారు. అక్షర్ పటేల్, చాహల్, కేదార్ జాదవ్‌లు తొలి వన్డేలో మెరుగైన ప్రదర్శనతో లంక బ్యాట్స్‌మెన్‌ను ముప్పుతిప్పలు పెట్టారు. ఒక దశలో వికెట్ నష్టానికి 130 పరుగులతో పటిష్ట స్థితిలో కనిపించిన లంక తర్వాత బౌలర్ల ధాటికి కుప్పకూలిన విషయం తెలిసిందే. దీంతో ఈసారి కూడా జట్టుకు బౌలర్లే కీలకంగా మారారు. వీరు విజృంభిస్తే ఈ మ్యాచ్‌లో కూడా లంకను తక్కువ స్కోరుకే కట్టడి చేయడం కష్టమేమి కాదు.

శ్రీలంకకు పరీక్ష

మరోవైపు టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన శ్రీలంక జట్టు తొలి వన్డేలో కూడా ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. దీంతో జట్టుపై పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇప్పటికే దంబులాలో అభిమానుల నుంచి లంక క్రికెటర్లకు చేదు అనుభవం ఎదురైంది. ఈ పరిస్థితుల్లో రెండో వన్డేలో కచ్చితంగా గెలవాల్సిన ఒత్తిడి లంకపై నెలకొంది. జట్టులో ప్రతిభకు కొదవలేదు. అయితే అనుభవ లేమి జట్టుకు ప్రతికూలంగా మారింది. తొలి వన్డేలో ఓపెనర్లు డిక్వెలా, ధనుష్క గుణతిలకలు మెరుగైన ఆరంభం ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. కుశాల్ మెండిస్ తప్ప మిగతావారు భారత బౌలర్ల ధాటికి ఎదురు నిలువలేక పోయారు. కనీసం ఈసారైనా వారు మెరుగ్గా ఆడాల్సిన అవసరం ఎంతైన ఉంది. కాగా, జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న కెప్టెన్ ఉపుల్ తరంగ వైఫల్యం లంకను వెంటాడుతోంది. టెస్టుల్లో ఘోరంగా విఫలమైన తరంగ తొలి వన్డేలో కూడా నిరాశ పరిచాడు. ఈసారైనా అతను తన బ్యాట్‌కు పని చెప్పాల్సిన అవసరం ఉంది. బౌలర్లు కూడా తమ ప్రదర్శన మెరుగు పరుచుకోక తప్పదు. లేకుంటే ఈ మ్యాచ్‌లో కూడా లంకకు మరో అవమానకర ఓటమి ఖాయం.





మళ్లీ బ్యాట్ పట్టనున్న సెహ్వాగ్

న్యూఢిల్లీ: భారత విధ్వంసక ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ మరోసారి బ్యాట్ పట్టనున్నాడు. ఇప్పటికే అన్ని రకాల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సెహ్వాగ్ టెన్–10 క్రికెట్‌లో మళ్లీ ఆడనున్నాడు. షార్జా వేదికగా జరిగే ఈ టోర్నమెంట్‌లో పలువురు మాజీ, ప్రస్తుత క్రికెటర్లు బరిలోకి దిగనున్నారు. భారత్ తరపున సెహ్వాగ్ కూడా ఈ లీగ్‌లో ఆడనున్నాడు. పాకిస్థాన్ డాషింగ్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది, శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర, క్రిస్‌గేల్ తదితర విధ్వంసక ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. డిసెంబర్ 21 నుంచి 24 వరకు దుబాయ్‌లో ఈ టోర్నీ జరుగనుంది. షార్జాలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయి. ఈ ఫార్మాట్ మ్యాచ్‌లు 90 నిమిషాల్లోనే ముగించేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ట్వంటీ–20 క్రికెట్ ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను కనువిందు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా టెన్–10 క్రికెట్‌ను కూడా అభిమానులకు పరిచయం చేయనున్నారు. స్వల్ప వ్యవధిలో ముగిసే ఈ క్రికెట్‌కు మరింత ఆదరణ లభించడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, ఈ టోర్నమెంట్‌లో పంజాబీస్, మరాఠాస్, లంకన్స్, బంగ్లాస్, సింధీస్, కేరళిటీస్, ఫఖ్తూన్స్ జట్ల పేర్లను ప్రకటించారు. ఫఖ్తూన్స్ జట్టుకు అఫ్రిది కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ప్రస్తుత, మాజీ క్రికెటర్ల కలయికలో ఈ టోర్నమెంట్ జరుగనుంది. దీంతో అభిమానులకు మరో పసందైన క్రికెట్ చూసే అవకాశం దక్కనుంది.



చోటు నిలబెట్టుకుంటా: ముకుంద్



చెన్నై: టెస్టు జట్టులో చోటు కాపాడుకుంటాననే నమ్మకాన్ని భారత ఓపెనర్ అభినవ్ ముకుంద్ వ్యక్తం చేశాడు. శ్రీలంకతో ఇటీవల ముగిసిన టెస్టు సిరీస్‌లో ముకుంద్ తొలి టెస్టులో బరిలోకి దిగాడు. అయితే తర్వాతి రెండు మ్యాచులకు అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. మరో ఓపెనర్ లోకేష్ రాహుల్ బరిలోకి దిగడంతో అతనికి తుది జట్టులో చోటు దక్కలేదు. కాగా, టీమిండియాలో చోటు సంపాదించాలంటే అనుకున్నంత తేలిక కాదన్నాడు. జట్టులో స్థానం కోసం విపరీత పోటీ నెలకొందన్నాడు. తాను మాత్రం ప్రతిభను నమ్ముకున్నానని తెలిపాడు. మళ్లీ టెస్టు జట్టులో తనకు స్థానం లభించడం ఖాయమన్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తనకు ఎంతో మెరుగైన రికార్డు ఉందన్నాడు. దీంతో భారత జట్టులో చోటు సంపాదించడం తనకు కష్టం కాదన్నాడు. కాగా, మురళీ విజయ్, శిఖర్ ధావన్, రాహుల్‌లతో తనకు గట్టి పోటీ నెలకొందన్నాడు. వీరిలో ఎవరైన తప్పుకుంటే మాత్రం తనకే ప్రాధాన్యత ఇవ్వడం ఖాయమని జోస్యం చెప్పాడు. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ముకుంద్ 81 పరుగులు చేసి జట్టును ఆదుకున్న విషయం తెలిసిందే. అయితే రాహుల్ కోలుకోవడంతో తర్వాతి మ్యాచుల్లో అతనికి స్థానం లభించలేదు. ఇక, మురళీ విజయ్ కూడా వచ్చే సిరీస్‌లకు అందుబాటులో రానున్నాడు. శిఖర్ ధావన్ భీకర ఫాంలో ఉండడం ముకుంద్‌కు ప్రతికూలంగా మారింది. ఈ అడ్డంకులను అధిగమించి తుది జట్టులో చోటు దక్కించుకోవడం అతనికి అనుకున్నంత సులువుకాదనే చెప్పాలి.

అఫ్రిది మెరుపు శతకం



లండన్ : పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది నార్త్‌వెస్ట్ ట్వంటీ–20 బ్లాస్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో అద్భుత బ్యాటింగ్‌తో ప్రకంపనలు సృష్టిస్తున్నా డు. టోర్నీలో భాగంగా హ్యాంప్‌షైర్ తరపున బరిలోకి దిగిన అఫ్రిది 42 బంతుల్లోనే సెంచరీ సాధించి సంచలనం సృష్టించాడు. క్వార్టర్ ఫైనల్లో భాగంగా డెర్బీషైర్‌తో జరిగిన ఈ మ్యా చ్‌లో అఫ్రిది ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. విధ్వంసక బ్యాటింగ్‌ను కనబరిచిన అఫ్రిది 10 ఫోర్లు, ఏడు భారీ సిక్సర్లతో 101 పరుగులు సాధించాడు. దీంతో హ్యాంప్‌షైర్ నిర్ణీత 20 ఓవర్లలో రికార్డు స్థాయిలో 249 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన డెర్బీషైర్ 101 పరుగులకే కుప్పకూలింది. కాగా అఫ్రిది 1996లో వన్డే క్రికెట్‌లో 37 బంతుల్లోనే 11 సిక్సర్లు, ఆరుఫోర్లతో 102 ప్రపంచ రికార్డును సృష్టించిన విషయం తెలిసిందే. ఈ రికార్డును తర్వాత న్యూజిలాండ్ క్రికెటర్ కొరె అండర్సన్ బద్దలు కొట్టాడు. అండర్సన్ 36 బంతుల్లోనే సెంచరీ సాధించాడు.



హర్యానా ఉత్కంఠ విజయం

లక్నో: ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో హర్యానా 27–25 తేడాతో దబాంగ్ ఢిల్లీని ఓడించింది. ప్రారంభం నుంచే రెండు జట్లు నువ్వానేనా అన్నట్టు పోరాడాయి. దీంతో ఆధిపత్యం తరచూ చేతులు మారుతూ వచ్చింది. హర్యానా జట్టులో దీపక్ మెరుగైన ప్రదర్శన ఇచ్చాడు. ఢిల్లీ ఆటగాళ్లను హడలెత్తించిన దీపక్ ఏడు పాయింట్లు సాధించాడు. మరోవైపు సుర్జీత్ సింగ్ ఐదు పాయింట్లతో తన వంతు పాత్ర పోషించాడు. వికాస్ కూడా నాలుగు పాయింట్లతో చేయూత ఇచ్చాడు. ఇక, ఢిల్లీ జట్టులో అబుల్ ఫాజిల్ అద్భుతంగా ఆడాడు. ప్రత్యర్థి జట్టును హడలెత్తించిన ఫాజిల్ ఏకంగా ఎనిమిది పాయింట్లు సాధించాడు. మరోవైపు యూపి యోధా– తమిళ్ తలైవాస్ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్ టైగా ముగిసింది. రెండు జట్లు చెరో 33 పాయింట్లను సాధించడంతో మ్యాచ్ సమమైంది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో సైనా, శ్రీకాంత్

- చెమటోడ్చిన సాయి ప్రణీత్
- ప్రపంచ బ్యాడ్మింటన్

గ్లాస్గో: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు కిదాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్, సైనా నెహ్వాల్‌లు రెండో రౌండ్‌లో విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో భారత అగ్రశ్రేణి ఆటగాడు, తెలుగుతేజం శ్రీకాంత్ సునాయాస విజయం సాధించాడు. ఏకపక్షంగా సాగిన పోరులో శ్రీకాంత్ 21–9, 21–17 తేడాతో ఫ్రాన్స్ ఆటగాడు ఫ్లూర్ కొర్విను చిత్తు చేశాడు. ప్రారంభం నుంచే తన మార్క్ షాట్లతో చెలరేగి పోయిన శ్రీకాంత్ పెద్దగా శ్రమ పడకుండానే గెలిచాడు. అద్భుత షాట్లతో అలరించిన శ్రీకాంత్ 32 నిమిషాల్లోనే ప్రత్యర్థిని కంగుతినిపించి మూడో రౌండ్‌కు దూసుకెళ్లాడు. మరో పోటీలో సాయి ప్రణీత్ చెమటోడ్చాడు. హోరాహోరీగా సాగిన పోరులో ప్రణీత్ ఇండోనేసియా ఆటగాడు ఆంథోని గింటింగ్‌ను ఓడించాడు. నువ్వానేనా అన్నట్టు సాగిన మ్యాచ్‌లో ప్రపంచ 19వ ర్యాంక్ ఆటగాడు ప్రణీత్ 14–21, 21–18, 21–19 తేడాతో గింటింగ్‌ను ఓడించాడు. తొలి గేమ్‌లో ప్రత్యర్థి ఆటగాడు ఆంథోని పైచేయి సాధించాడు. చూడచక్కని షాట్లతో చెలరేగిన ఆంథోని సునాయాసంగా తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక, నువ్వానేనా అన్నట్టు సాగిన రెండో గేమ్‌లో కూడా ఆంథోని మెరుగ్గా ఆడాడు. అయితే కీలక సమయంలో సాయి ప్రణీత్ పుంజుకున్నాడు. చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న ప్రణీత్ గేమ్‌ను దక్కించుకున్నాడు. మూడో గేమ్‌లో కూడా పోరు యుద్ధాన్ని తలపించింది. ఇద్దరూ కూడా ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డి పోరాడారు. ఒక దశలో ఓటమి వరకు వెళ్లిన ప్రణీత్ చిరస్మరణీయ ఆటతో మళ్లీ విజయం అందుకున్నాడు.





సైనా అలవోకగా..

మరోవైపు మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ సైనా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. రెండో రౌండ్‌లో సైనా 21–11, 21–12 తేడాతో స్విట్జర్లాండ్ క్రీడాకారిణి సబ్రెన్ జాక్వెట్‌ను చిత్తు చేసింది. ప్రారంభం నుంచే తన మార్క్ షాట్లతో చెలరేగిన సైనా ఏ దశలోనూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. సునాయాస విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. మరో మ్యాచ్‌లో భారత క్రీడాకారిణి తాన్వి లాడ్ ఓటమి పాలైంది. రెండో సీడ్ సంగ్ జి హ్యూన్‌తో జరిగిన పోరులో తాన్వి 9–21, 19–21 తేడాతో పరాజయం చవిచూసింది. రెండో గేమ్‌లో తాన్వి అద్భుత ఆటతో ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చింది. కాగా, ప్రిక్వార్టర్ ఫైనల్లో సంగ్ జి హ్యూన్ భారత స్టార్ సైనా నెహ్వాల్‌తో తలపడనుంది.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.